నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

సంపుటి 11 | సంచిక 121

ఆదివారం | 25 ఫిబ్రవరి 2018 | విజయవాడ | పేజీలు 12+12+16 | వెల: రూ. 6.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్ష తిథి : దశమి సా.5.38, మృగశిర ఉ.7.41, ఆరుద్ర తె. 5.14 వర్జ్యం తె.2.23 నుంచి 3.53 వరకు, రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు, సూర్యోదయం : ఉ.6.42 గం; సూర్యాస్తమయం: సా. 6.18 గం.

బడుగులకు హుళక్కేనా?



- ఏపీలో టీడీపీ, వైసీపీలకు బడుగులు పట్టరా
- ఇరు పార్టీలు అగ్ర వర్ణాలకే పెద్దపీట
- తెలంగాణలో కాస్త ఊరట
- బీసీ, ఎస్సీ, మైనారిటీల అభ్యర్థుల ఎంపిక దిశగా టీ సర్కార్ సమాలోచనలు
- తెలుగు రాష్ట్రాల్లో ఆరు సీట్లకు ఎన్నికలు
- రేసులో పోటీపడుతున్న తెలుగు తమ్ముళ్లు
- ఏపీలో గెలిచే ఆ ముగ్గురెవ్వరు
- మూడు సీట్లలోనూ బరిలోకి టీడీపీ
- ఒక సీటుకు వైసీపీ అభ్యర్థి ఖరారు
- ఆ పార్టీ నుంచి ఒకరిద్దరు జారే చాన్స్
- అదే జరిగితే 3 స్థానాలూ టీడీపీకే
- బీజేపీ ఎమ్మెల్యేల వైఖరిపై ఉత్కంఠ
- పొత్తు పోతే టీడీపీకి మూడో సీటు డౌటే

రెండు తెలుగు రాష్ట్రాలలో త్వరలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై దాదాపు అన్ని పార్టీలు ఓ నిర్ణయానికి వచ్చాయని, ఫలాన వారికే ఆ సీట్లు అన్న ప్రచారంతో బీసీ వర్గాలు భగ్గుమంటున్నాయి. రాజ్యసభ అభ్యర్థులు వీరే అని ప్రచారం సాగుతున్న జాబితాలో బడుగువర్గాల వారు లేకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నాయి. పార్లమెంటులోని పెద్దల సభలో తమ అడుగులకు బంధాలేస్తున్న పాలక, ప్రతిపక్ష పార్టీలపై బీసీలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పెద్దల సభలో కాలుమోపేందుకు మేం అర్హులం కామా అన్న తీవ్ర ఆగ్రహం బడుగువర్గాలలో లోలోన రాజుకొంటోంది.

(ఏపీ–పొలిటికల్‌బ్యూరో) : ప్రతి పార్టీ డబ్బున అగ్రవర్ణాలకే రాజ్యసభకు పంపడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదలు విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ బీసీలకు రాజ్యసభకు పంపే విషయంలో అన్ని పార్టీలు తీవ్రమోసం చేస్తున్నాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. రాష్ట్రజనాభాలో సభభాగమున్న తమను నిర్లక్ష్యం చేస్తే వచ్చే ఎన్నికల్లో తీవ్ర పరిణామాలుంటాయన్న సంకేతాలిచ్చేందుకు బడుగు సామాజిక వర్గం సమీకృతమవుతోంది. త్వరలో జరిగే పెద్దల సభ ఎన్నికల్లో బడుగులను ఎంపికచేసే విషయంలో కనీసం పార్టీలు కన్నెత్తి చూడకపోవడంపై బీసీ వర్గాలు భగ్గుమంటున్నాయి. టీడీపీ గతంలో మిగతా 6లో



ఔషధ రంగానికి పెద్ద పీట

వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్

ముగిసిన బయో అసియా సదస్సు : కేటీఆర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: బయో ఆసియా సదస్సు ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు, తెలంగాణ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చా కార్యక్రమంలో ఇద్దరు నేతలు పాల్గొన్నారు. హైదరాబాద్ వ్యాక్సిన్ రాజధానిగా అవతరించిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. జీడీపీ కంటే ఫార్మా రంగం వృద్ధి రేటు తగ్గిందని.. దేశంలో ఫార్మా రంగం అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోనున్నారని, ఈ రంగంలో పెట్టుబడిదారులకు ఎలాంటి భరోసా ఇవ్వనున్నారని సురేశ్ ప్రభును కేటీఆర్ అడిగారు. భారత్ విపణికి అనుగుణంగా ఔషధాల ధరల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో వివరించాలని కోరారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానమిచ్చిన ప్రభు ఫార్మా రంగం వృద్ధి కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. ఫార్మా రంగంతోపాటు ప్రజారోగ్యం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు.

ఏడేళ్లుగా మోసాన్ని ఎందుకు గుర్తించలేదు?



- పీఎన్‌బీ స్కామ్‌పై స్పందించిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ
- బ్యాంకింగ్ రంగంలో నిఘా వైఫల్యం
- గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్న జైట్లీ
- రుణ ఎగవేత దారులను క్షమించబోమని హెచ్చరిక
- ఓబీసీకి రూ. 390 కోట్లకు టోపీ పెట్టిన ఆభరణాల సంస్థ
- విదేశీ క్రెడిట్ లెటర్స్ సాయంతో రుణాలు

అగ్రస్థానమే లక్ష్యం

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం

- వ్యవసాయంలో గణనీయంగా వృద్ధి రేటు
- రాష్ట్రంలో 13.8 శాతం లోటు వర్షపాతం వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధించాం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రపంచంలోనే టాప్ 5 స్థానాలే లక్ష్యం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రారంభించిన ఉపరాష్ట్రపతి



(విశాఖపట్నం నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలో మూడో స్థానంలో, 2029 నాటికి అగ్రస్థానంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానమని, మూడోసారి సీఐఐ సదస్సు నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. గతేడాది కంటే ఈసారి స్పందన బాగుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో శాశ్వత కన్వెన్షన్ సెంటర్, షాపింగ్ మాల్స్, హోటళ్లు ఏర్పాటు, రాష్ట్రంలో భారీగా విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఈసారి రాష్ట్రంలో 13.8 శాతం లోటు వర్షపాతం నమోదన్నారు. వ్యవసాయంలో గణనీయ వృద్ధిరేటు సాధిస్తున్నామని, నీటి నిర్వహణ పద్ధతుల ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని చంద్రబాబు వివరించారు. మూడోసారి విశాఖలో భాగస్వామ్య సదస్సు నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఏడాది భాగస్వామ్య సదస్సు విశాఖలోనే నిర్వహించాలని కోరుతున్నానని, సీఐఐ ఇంతవరకు 23 ఈవెంట్లను నిర్వహిస్తే అందులో ఏపీలోనే 7 సదస్సులను నిర్వహించామన్నారు. 60 దేశాల నుంచి వచ్చిన మిగతా 6లో

మహిళా క్రికెట్‌లో కొత్త రికార్డు

తొలిసారిగా రెండు సిరీస్‌లనూ గెలుచుకున్న భారత్



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

చిత్తశుద్ధి ఏది?

చంద్రబాబుకు జగన్ సూటి ప్రశ్న



- ఊసరవెల్లికి కూడా చంద్రబాబు అంటే భయం
- కనిగిరి బహిరంగసభలో వై.ఎస్.జగన్
- దేశంలో ఎక్కడా లేని అవినీతి ఏపీలోనే ఉంది
- పచ్చచొక్కాల విచ్చలవిడి దోపిడీ
- బాబు పాలనలో నీళ్లు దొరకడం లేదు కానీ మద్యం పుష్కలంగా అందుతోంది
- మేం వస్తే వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తాం

(కనిగిరినుంచి సూర్య పొలిటికల్ బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చూస్తే ఊసరవెల్లి కూడా భయపడుతోందని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా జరగని అవినీతి బాబు హయాంలో జరుగుతోందని, తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతి ఊరిలో మంచి నీరు దొరకుతుందో లేదో తెలీదు కానీ, మద్యం మాత్రం దొరకుతుందని, ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి డెలివరీ చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. నాలుగేళ్లుగా పెట్రోలు, డీజిల్ మీద బాదుడు కనిపిస్తోందని, పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే రూ.7 ఎక్కువగా ఉందన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా కనిగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్ జగన్ ప్రసంగించారు. "అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో చంద్రబాబు మూడుసార్లు కరెంట్ చార్జీలు పెంచారు. విద్యుత్ బిల్లులకు భయపడి ఇంట్లో టీవీ కూడా ఆన్ చేయలేని పరిస్థితి వచ్చింది. బాబు అధికారంలోకి రాకముందు మిగతా 6లో

అంతా ఇంతే!



ఒకటి మన కుటుంబానికి, ఇంకొకటి బీసీలకు మరొకటి...

అవకాశాలకు అంతర్జాతీయ వేదికగా ఏపీ

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విశాఖపట్నం, సూర్య ప్రధాన ప్రతినిధి : అవకాశాలకు ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ వేదికగా నిలుస్తోందని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఆర్థిక వృద్ధి శరవేగంగా పెరుగుతోందన్నారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీ, అంతర్జాతీయ సంస్థలు దేశ ఆర్థిక వృద్ధిపై నివేదికలు వెల్లడిస్తున్నాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అతిపెద్ద ఆర్థిక సంస్కరణ నోట్ల రద్దని వెంకయ్య నాయుడు కొనియాడారు. నల్లధనాన్ని బ్యాంకులకు చేర్చడమే నోట్ల రద్దు ఉద్దేశమని, నోట్ల రద్దు వల్ల బ్యాంకుల వడ్డీరేట్లు తగ్గుతాయన్నారు. జీఎస్టీ (వస్తుసేవలపన్ను)ని కేంద్రం ఒక పార్టీ నిర్ణయించలేదని, అన్ని రాష్ట్రాలు పలుమార్లు సమావేశమై అంగీకరించాయని వెంకయ్య తెలిపారు. జీఎస్టీ అమలు కోసం 21 సమావేశాలు నిర్వహించారని ఆయన వెల్లడించారు. కాగా విశాఖలో ఈ సదస్సు నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి సురేశ్ ప్రభుకు వెంకయ్య అభినందనలు తెలిపారు.

టీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటానికి యువత సిద్ధం కావాలి : బీజేపీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: టీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటానికి యువత సిద్ధం కావాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని అన్ని వర్సిటీల విద్యార్థులు కేసీఆర్‌ను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక భూ మాఫియా, ఇసుక మాఫియా, అవినీతి పెరిగిపోయిందని ఆయన ఆరోపించారు. ఉద్యమం చేసిన వాళ్లకు ప్రభుత్వంలో చోటు లేదని, ద్రోహులే కీలక పదవులల్లో కొనసాగుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ముద్రా పథకంతో నిరుద్యోగులు చిరు వ్యాపారాలను కొనసాగిస్తూ కొంత ఉపశమనం పొందారని ఆయన తెలిపారు.

అమరావతిలో 1000 ఫ్లాట్లు

- సీఆర్‌డీఏ ద్వారా నిర్మాణం
- వేలంలో విక్రయించాలని నిర్ణయం
- ముఖ్యమంత్రి సూత్రప్రాయ ఆమోదం
- ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



వెలగపూడి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : అమరావతి రాజధాని పరిధిలో సీఆర్‌డీఏ స్వయంగా 1000 ఫ్లాట్లు ఉండే బహుళ అంతస్తుల నివాస భవనాలను(అపార్టుమెంట్) నిర్మించనుంది. వీటిని వేలం ద్వారా విక్రయించనుంది. సచివాలయంలో జరిగిన సీనఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనికి సూచనప్రాయంగా ఆమోదం తెలిపారని మంత్రి నారాయణ వెల్లడించారు. అపార్టుమెంట్ల నిర్మాణానికి రూ.372 కోట్ల వ్యయం కానుందని అంచనా వేసినట్లు చెప్పారు. వీటిని ఒకేచోట నిర్మించాలా? వేర్వేరు ప్రాంతాల్లో నిర్మించాలా అన్న దానిపై సమాలోచనలు జరుగుతున్నాయన్నారు. చదరపు అడుగు రూ.2,700 నుంచి రూ.3000ల మధ్య ఉండొచ్చునని తెలిపారు. ప్రభుత్వమే వీటిని నిర్మించడం ద్వారా ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గాంధీనగర్, చండీఘడ్‌లలో ఇలాగే ప్రభుత్వ పరంగా నిర్మాణాలు జరిగినట్లు తెలిపారు. రాజధాని అమరావతి పరిధిలోనే తలపెట్టిన 3,840 ఫ్లాట్ల నిర్మాణంపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వీటిని ఐఏఎస్, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ అధికారులకు కేటాయిస్తామని తెలిపారు. 274 కిలోమీటర్లలో సెంటర్ డివైడర్ల మధ్య మొక్కలను నాటి కొత్త అందాలను తీసుకువచ్చేందుకు చేపట్టిన చర్యల్లో 75% పనులు పూర్తయినట్లు వెల్లడించారు. విజయవాడ నగరంలో కూడా పచ్చదనం తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 110 మున్సిపల్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూములను ఏర్పాటుచేయడంపై చర్చ జరిగిందని పేర్కొన్నారు. వీటిని సీనఎం కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు.

తాత్కాలిక హైకోర్టు, ఐటీ టవర్లకు ఉత్తమ ఆకృతులు...

రాజధాని అమరావతిలో నిర్మించే తాత్కాలిక హైకోర్టు భవనానికి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) నియమించిన ఆర్కిటెక్ట్‌లు మొత్తం 12 నమూనా ఆకృతులు రూపొందించారు. ఐటీ టవర్లకు కూడా 19 సిద్ధమయ్యాయి. వీటిని సీఆర్‌డీఏ తన వెబ్‌సైట్‌లోను, సామాజిక మాధ్యమాల్లోను ఉంచింది. ఉత్తమమైన వాటిని ఎంపిక చేయాల్సిందిగా ప్రజలను కోరింది. తాత్కాలిక హైకోర్టుని 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తారు. నిర్మితప్రాంతం 1.8 లక్షల చదరపు అడుగులు. అంచనా వ్యయం సుమారు రూ.108 కోట్లు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుని అమరావతికి తరలించేందుకు అనువైనవిగా ఎంపిక చేసిన కొన్ని భవనాలను హైకోర్టు నియమించిన కమిటీ ఇటీవల పరిశీలించింది. అవి నచ్చకపోతే కొత్త భవనాన్ని ఆరు నుంచి ఎనిమిది నెలల్లో రాజధానిలో నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. హైకోర్టు కూడా దీనికే మొగ్గు చూపింది. ఈ నేపథ్యంలోనే తాత్కాలిక హైకోర్టు ఆకృతిని ఎంపికచేసి, త్వరలోనే టెండర్లు పిలవాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. అమరావతిలో ఐటీ కంపెనీల కోసం సీఆర్‌డీఏ మొత్తం 10 లక్షల చ.అడుగుల నిర్మితప్రాంతంతో రెండు ఐటీ టవర్లు నిర్మించాలని నిర్ణయించింది. వీటికి సంబంధించి రూపొందించిన ఆకృతుల్నీ జనాభిప్రాయం కోసం ఉంచింది. ఈ ఆకృతుల్లో కొన్ని జంట టవర్లు ఉండగా, కొన్ని ఒకే భవనంగా రూపొందించారు.

మీ శక్తి సామర్థ్యాలే మీకు పెట్టుబడులు

యువతకు మంత్రి దేవినేని ఉమా పిలుపు



విజయవాడ, సూర్య ప్రతినిధి : వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అని ఏపి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పోసాని నరసింహారావు చౌదరి హైస్కూల్‌లో రాష్ట్ర వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను మంత్రి ఉమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంజనీరింగ్, ఎం బి.ఏ చదువుకున్న యువతీ యువకులు అటెండర్ ఉద్యోగాలు అడుగుతున్నారని అందుకు తనకు బాధగా ఉందని వారు వారి తెలివితేటలకు శక్తి సామర్థ్యాలకు పదునుపెట్టాలని మంత్రి ఉమా కోరారు. తమిళనాడు, గుజరాత్ ఇలా ఎన్నో రాష్ట్రాలు పోటీపడినప్పటికీ మన రాష్ట్రానికి కియా కంపెనీని తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదని, గోదావరి నీళ్లు చూసి రూ.13 వేల కోట్ల కియా కంపెనీ మన రాష్ట్రానికి వచ్చిందని అభివర్ణించారు. పుట్టించిన దేవుణ్ణి, కనిపెంచిన తల్లిదండ్రులను తిట్టకుండా బయటకొచ్చి మీ సామర్థ్యాన్ని నిరూపించుకోండని, మీ వద్ద సామర్థ్యాలుంటే ఎవరి సిఫార్సులు అవసరం లేదని, మీ ఆలోచనలే మీ పెట్టుబడని యువతకు సూచించారు. ఏమి చదువుకోని డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. గొల్లపూడిలో నిర్వహిస్తున్న ఉద్యోగమేళాలో సుమారు 22 కంపెనీల ప్రతినిధుల వచ్చారని, రూ.8వేల నుండి సుమారు 25 వేల వరకు జీతాలిచ్చే కంపెనీలు ఉన్నాయని, యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఆన్‌లైన్ లో 1750 మంది నమోదు చేసుకున్నారని, ఇంకా ప్రత్యక్షంగా రిజిస్ట్రేషన్లు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని కోరారు.

గండిపేట మూసీ సుందరీకరణ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: 2020 నాటికి గండిపేట చెరువును నిర్మించి వంద సంవత్సరాలు పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో చెరువు అభివృద్ధి కోసం హెచ్ యండిఏ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని మంత్రి కె టి రామారావు చెప్పారు. ఇప్పటికే సాగునీటి శాఖ అధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమలకు తోడుగా హెచ్ యం డిఏ, టూరిజం శాఖలు కలిసి గండిపేట చెరువు సుందరీకరణ చేస్తాయన్నారు. దీంతోపాటు త్వరలోనే మూసి అభివృద్ధి సుందరీకరణపైన అంతర్జాతీయ స్థాయి డిజైన్ కాంపిటీషన్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కెటి రామారావు తెలిపారు. శనివారంనాడు హెచ్ఐసీసీ ప్రాంగణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ కార్యాలయంలో జరిగిన మూసి అభివృద్ధి, సుందరీకరణ కార్యక్రమాలపై మంత్రి కేటీఆర్ సమీక్షించారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, కాలుష్య నియంత్రణ మండలి, సాగునీటి , రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూసీ చుట్టూర ఎక్స్‌ప్రెస్‌వేలు, కారిడార్లు

మూసి చుట్టూ ఏర్పాటు చేయనున్న ఎక్స్ ప్రెస్ వేలు, ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణంపై మొదట చర్చించారు. మూసి డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఫీజిబిలిటీ రిపోర్టు తయారైందని , సాగునీటి శాఖ చేపట్టే హైడ్రాలిక్ సర్వే కూడా త్వరలోనే పూర్తి అవుతుందని మంత్రికి అధికారులు తెలిపారు. ఇప్పటికే మూసి అభివృద్ధి కోసం అవసరమైన పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. మూసి నీటిని శుద్ధిపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపైన వాటర్ వర్క్స్, పిసిబి, టియస్ ఐఐసి అధికారులతో ఒక జాయింట్ యాక్షన్ కమీటి ఎర్పాటు చేయాలని మంత్రి అధికారులను అదేశించారు. వారంరోజుల్లో ఈ అంశంపైన ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కోరారు. మూసి సుందరీకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమికంగా పలు ప్రణాళికలు రూపొందించిందని, మూసి సుందరీకరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వంతెల నిర్మాణం, యస్టీపీల నిర్మాణం వంటి అంశాలను అత్యంత సుందరంగా ఉంచాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం త్వరలోనే ఒక డిజైన్ కాంపిటీషన్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న నగరపౌరుల నుంచి నదుల సుందరీకరణలో పాలు పంచుకున్న ప్రపంచస్థాయి సంస్థల సూచనలు తీసుకునేందుకు ఈ డిజైన్ కాంపిటిషన్ ఉపయోగపడుతుందన్నారు. మూసి సుందరీకణ కోసం నదిలో నిరంతరం మంచినీరు ప్రవహించేలా చేసేందుకు ఉన్న అవకాశాలపైన ఈ సందర్భంగా జలమండలి, సాగునీటి శాఖాధికారులతో చర్చించారు. ముందుగా మూసిపైన వికేంద్రీకృత పద్దతిన ఎస్టీపీలు నిర్మాణం చేసేందుకు ఉన్న అవకాశాలపైన చర్చించారు. ఈ సమావేశంలో టూరిజం, జీహెచ్ఎంసీ, హెచ్ యండిఏ, జలమండలి, సాగునీటి శాఖ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పనిచేసే పార్టీ కావాలా?



- కుర్చీల కోసం కొట్లాడే పార్టీ కావాలా?
- రైతు వ్యతిరేక కాంగ్రెస్ కు ప్రజలే బుద్ధి చెప్పాలి
- పాలమూరులో 20 లక్షల ఎకరాలకు సాగునీరు
- కృష్ణా నికర జలాలన్నీ పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకే
- గోదావరి జలాలు ఖమ్మం, నల్గొండ పొలాలకు
- మంత్రి హరీశ్ రావు

వనపర్తిః అధికారంలో ఉన్నా,లేకపోయినా కుర్చీల కోసం కొట్లాడుకునే కాంగ్రెస్ పార్టీ కావాలో! ప్రజల కోసం రేయింబవళ్లు పని చేసే టి.ఆర్.ఎస్.కావాలో తేల్చుకోవాలని ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు ప్రజల్ని కోరారు. శనివారం నాడు వనపర్తి, నాగర్ కర్నూలు జిల్లాల్లో జరిగిన వివిధ సభలలో కాంగ్రెస్‌పార్టీ పై ఆయన నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ నాయకుల వైఖరిని హరీశ్ రావు తూర్పార బట్టారు.కాంగ్రెస్ పార్టీలోకి నాగం జనార్దన్ రెడ్డి చేరబోతుంటే దామోదర రెడ్డి వ్యతిరేకిస్తున్నాడు.రేవంత్ రెడ్డిని డి.కె.అరుణ వ్యతిరేకిస్తోంది. అధికారంలో లేకపోయినా కుర్చీలు,పదవుల కోసం పొట్లాడుకునే నిజస్వరూపం వదులుకోలేదని మంత్రి ఎద్దేవాచేశారు. ఇలాంటివారికి అధికారం ఇస్తారా?అని ప్రజలను ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రులు కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, రోశయ్య లందరినీ గద్దె దింపిన ఘన చరిత్ర కాంగ్రెస్ సొంతమని ఆ పార్టీ చరిత్రను హరీశ్ రావు తిరగదోడారు.ఒకరిని కుర్చీలో నుంచి లాగి మరొకరు ఆ కుర్చీలో కూర్చునే అధికార దాహం తప్ప ప్రజలు, రైతులు,బడుగు, బలహీన వర్గాల గురించి కాంగ్రెస్ నాయకులు ఎన్నడూ ఆలోచించరని విమర్శించారు.పాలమూరు జిల్లాలో కరువును శాశ్వతంగా నిర్మూలిస్తామని ఇరిగేషన్ మంత్రి ప్రకటించారు. ఆకలి చావులు, ఆత్మహత్యలు,వలసలు లేని పాలమూరు ను ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మిస్తున్నట్టు హరీశ్ రావు తెలిపారు. ఆయన ముందు చూపుతోనే కృష్ణాలో నికరజలాలన్నీ పాలమూరు ప్రాజెక్టులకు దక్కనున్నట్టు చెప్పారు. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో గోదావరిని మళ్లిస్తా మని తెలిపారు.కృష్ణా జలాలలో తెలంగాణ వాటాపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ లో న్యాయ పోరాటం జరుగుతున్నట్టు మంత్రి చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో తాను స్వయంగా ట్రిబ్యునల్ లో వాదనల తీరును చూసినట్టు తెలిపారు.త్వరలోనే ట్రిబ్యునల్ తీర్పు తెలంగాణ రైతాంగానికి అనుకూలంగా రానుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన కాంగ్రెస్ నాయకులలాంటి వాళ్లను తాను ఎక్కడా చూడలేదన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సహా అన్ని చోట్లా వందలాది కేసులు వేశారని చెప్పారు. భూసేకరణ నిలిపివేయాలని,లేదా పర్యావరణ అనుమతులు లేవనీ కేసులు వేశారు. ఈ కేసులను టి.ఆర్.ఎస్.భగ్నం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కారణంగా, సి.ఎం.గా కేసీఆర్ ఉన్నందుకు పాలమూరు స్వరూపం మారిపోయిందన్నారు. నాలుగు ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల నుంచి గత సంవత్సరం 6.50 లక్షల ఎకరాలకు సాగునీరందించడం ఒక రికార్డు అని మంత్రి చెప్పారు. ఉమ్మడి మహబూబ్ నగర్ లో ఈ యేడాది 10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్,జూరాల ప్రాజెక్టు లతో పాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకు రావడం ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని మంత్రి చెప్పారు.కల్వకుర్తి ప్రాజెక్టు కోసం గడచిన మూడేళ్ళ లో1000 కోట్లు ఖర్చు చేసినట్టు హరీశ్ రావు తెలిపారు. తెలంగాణలో పండించిన కంది కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం పరిమితులు విధించిందన్నారు.తెలంగాణ ప్రభుత్వం 2 లక్షల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేసిందని,కేంద్రం 50 వేల మెట్రిక్ టన్నుల కందులే కొన్నట్టు మంత్రి తెలిపారు.ఏ.పి,కర్నాటక కందులు కొనడం లేదని, అక్కడి నుంచి పెద్ద ఎత్తున కందులు మన మార్కెట్లకు వస్తున్నాయని చెప్పారు. వాటిని కట్టడి చేయాలని కోరారు. కర్నూలు, కర్నాటక రైతులు తెలంగాణ రైతుల పాసుబుక్కులతో అమ్ముతున్న సంఘటన లున్నందున రైతులు సహకరించవద్దని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.

చైతన్య యాత్రలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతాం

టీ-పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః గత నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం విపరీతమైన ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడిందని టీ-పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. టీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. మిగులు ఆదాయంతో ధనిక రాష్ట్రమైన తెలంగాణను నేడు రెండు లక్షల కోట్ల అప్పులు ఊబిలోకి నెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ విషయాలన్నింటినీ ఈనెల 26వతేదీ నుంచి చేపట్టనున్న కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్ర ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు మల్లు రవి తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన టిపిసిసి అధికార ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే సంపన్న రాష్ట్రంగా తెలంగాణను కాంగ్రెస్‌పార్టీ ఏర్పాటు చేస్తే అబద్దపు హామీలు, మోసపూరిత మాటలతో కేసిఆర్ అదోగతిపాలు చేశారన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా దళితున్ని చేస్తానని చెప్పిన ఆయన ఆమాట విస్మరించారన్నారు. దళిత కుటుంబాలకు మూడెకరాల వ్యవసాయ భూమి, అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణం, కేజీ టు పిజి పథకం, గిరిజనులకు, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ లాంటి అనేక ముఖ్యమైన పథకాలను పక్కన పెట్టి తనకు కమీషన్లు వచ్చే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి పనులు మాత్రమే చేస్తున్నారని విమర్శించారు. అడ్డగోలుగా భూ సేకరణ చేస్తూ పేద రైతుల భూములను గుంజుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఈ విషయాలపై అధికార ప్రతినిధులు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజలను చైతన్య పరచాలని ఆయన సూచించారు.

26 నుంచి ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ శంకుస్థాపనలు

ఏపీ సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు



అనంతపురం, సూర్య ప్రతినిధి : ఫిబ్రవరి 26 నుండి మార్చ్ 12 వరకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ శంఖుస్థాపన మహోత్సవాలు జరుగుతాయని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇందులో భాగంగా మూడు లక్షల ఇళ్లకు శంఖుస్థాపనలు జరుగుతాయని, సామాన్యుడి స్వంతఇంటి కలను నిజం చేసే దిశగా శక్తివంతమైన చర్యలు చేపడుతున్నామన్నారు.

సిటీ కోర్టు, ఐటీ టవర్ డిజైన్లు రెడీ

- పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆన్ లైన్‌లో ఇప్పటికే ప్రజాభిప్రాయసేకరణ
- రూ. 372 కోట్లతో వెయ్యి అపార్టుమెంట్ల నిర్మాణం
- సీఎం అనుమతులు మంజూరు
- నిర్మాణం పూర్తయిన వెంటనే విక్రయిస్తాం
- ఎపి మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ



వెలగపూడి, సూర్య సచివాలయ ప్రతినిధి : సిటీ కోర్టు, ఐటీ టవర్ భవనాల డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రజాభిప్రాయసేకరణకు ఆన్ లైన్ లో పెట్టింది. అత్యధికుల ఎంపిక చేసిన డిజైన్లను ఒకే చేసి, టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టాలని సీఆర్డీఏ అధికారులను సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించినట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సీఆర్డీఏ పరిధిలో వెయ్యి అపార్టుమెంట్లను ప్రభుత్వమే స్వయంగా నిర్మించి, ప్రజలకు విక్రయించనుందన్నారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్ లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన సీఆర్డీయే సమావేశం సచివాలయంలో జరిగినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సిటీ కోర్టు నిర్మాణానికి 12 డిజైన్లు, ఐటీ టవర్ కోసం 19 డిజైన్లను ఆర్కిటెక్టర్లు రూపొందించారన్నారు. వాటిని సీఎం చంద్రబాబునాయుడుకు చూపించామన్నారు. ఈ నెల 22 వ తేదీన సిటీ కోర్టు, ఐటీ టవర్ డిజైన్లు ప్రజాభిప్రాయ సేకరణకు ఆన్ లైన్లో పెట్టినట్లు సీఎంకు వివరించామన్నారు. ఇప్పటి వరకూ 3 వేల మంది డిజైన్లను తిలకించారని, మరో రెండజుల పాటు ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచనున్నామని ఆయన తెలిపారు. ఆ తరవాత అత్యధికుల ఎంపిక చేసిన డిజైన్లను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లతామన్నారు. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపడతామని మంత్రి నారాయణ తెలిపారు.

రూ.372 కోట్లతో వెయ్యి అపార్టుమెంట్లు



అమరావతి రాజధాని పరిధిలో వేగవంతంగా గృహ నిర్మాణాలు ప్రారంభం కావడానికి రాష్ట్ర ప్రభుత్వమే వెయ్యి అపార్టుమెంట్లను సొంతంగా నిర్మించనుందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఈ అపార్టుమెంట్లను 2, 3 బెడ్ రూమ్ లుగా నిర్మాణం చేపడతామన్నారు. అవి పూర్తికాగానే, ప్రజలకు వేలం పద్ధతిలో విక్రయిస్తామన్నారు. వెయ్యి అపార్టుమెంట నిర్మాణంతో అక్కడి ఆసుపత్రులు, విద్యా సంస్థలు, మార్కెట్ ఏర్పాటవుతాయన్నారు. అదే సమయంలో అక్కడ మరింతమంది నివాసం ఏర్పాటు చేసుకోడానికి ముందుకొస్తారని మంత్రి తెలిపారు. నయా రాయపూర్, గాంధీనగర్, చండీఘడ్ రాజధాని నిర్మాణ సమయంలో అక్కడి ప్రభుత్వాలు ఇటువంటి ఫార్ములానే పాటించాయన్నారు. అపార్టుమెంట్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబునాయుడు అనుమతించారని, త్వరలోనే డిజైన్లు రూపొందించి, టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపడతామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, నాన్ గెజిటెడ్ ఉద్యోగాల కోసం చేపట్టిన 3,840 అపార్టుమెంట్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్నారు.

2 నెలల్లో విజయవాడ కెనాల్స్ గ్రీనరీ పూర్తి చేయాలి

విజయవాడలో ఉన్న కెనాల్స్ పక్కన చేపట్టిన గ్రీనరీని రెండు నెలల్లో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించినట్లు రాష్ట్రమున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఇప్పటికే కొన్ని కెనాల్స్ పక్కన గ్రీనరీ అభివృద్ధి చేశామని సీఎం చంద్రబాబుకు సీఆర్డీఏ అధికారులు తెలిపారన్నారు. రెండు నెలల్లో అన్నీ కెనాల్స్ పక్కన గ్రీనరీ అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారన్నారు.

243 కిలో మీటర్ల డివైడర్లలో గ్రీనరీ పూర్తి


రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీల్లో 75 శాతం మేర 243 కిలోమీటర్లలో ఉన్న డివైడర్లపై మొక్కల పెంపకం పూర్తి చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. మరో రెండు నెలల్లో మిగిలిన 25 శాతం పూర్తి చేస్తామన్నారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో వీలైనంత త్వరగా గ్రీనరీ అభివృద్ధి చేయాలని సీఆర్డీఏ అధికారులను సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు.

ఆర్టీజీ సెంటర్ తో సెంటర్లు అనుసంధానం

110 మున్సిపాల్టీల్లో ఏర్పాటు చేయబోయే కమాండ్ కంట్రోల్ సెంటర్లను సచివాలయంలోని సీఎంవో కార్యాలయంలో ఉన్న ఆర్టీజీ సెంటర్ కమాండ్ కంట్రోల్ తో అనుసంధాన చేయనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నంలో కమాండ్ కంట్రోల్ నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపాల్టీల్లో ఏర్పాటుకానున్న కమాండ్ కంట్రోల్ సెంటర్లను సీఎంవో కార్యాలయంలో ఉన్న కమాండ్ సెంట్రల్ నుంచి దిశానిర్దేశం చేసేలా సాంకేతిక వ్యవస్థను రూపొందిస్తున్నామన్నారు.

నేనూ రాయలసీమ బిడ్డనే

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : తానూ రాయలసీమ బిడ్డనే అనే విషయాన్ని విమర్శలు చేసేవారు గుర్తుపెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. పార్టీ ముఖ్య నేతలతో ఆయన శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయలసీమకు అన్యాయం జరుగుతోందంటూ బీజేపీ ప్రవేశపెట్టిన కర్నూలు డిక్లరేషన్ అంశాన్ని పార్టీ నేతలు ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి రాయలసీమకు చేశామనే విషయం ప్రజలకు తెలుసని సీఎం అన్నారు. ఎన్నడూ కవివినీ ఎరుగని రీతిలో రాయలసీమకు నీళ్లందించామన్నారు. అనంతలో కియా, చిత్తూరులో ఫాక్స్ కాన్ కంపెనీలను ఏర్పాటు చేస్తోంది తెలుగుదేశం ప్రభుత్వమేనని ప్రజలు గుర్తించారని చంద్రబాబు నేతలతో అన్నారు. విభజన హామీల అమలు విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచుతామన్నారు. అలాగే నేతలు అనురించాల్సిన వైఖరిపై సీఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన అజెండాగా పని చేయాలన్న ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచినా, పోరాటం చేసినా రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని స్పష్టంచేశారు. దీంట్లో ఎలాంటి రాజకీయాలకు తావులేదన్నారు. బీజేపీ నేతలపై వ్యక్తిగత విమర్శలకు దిగవద్దని సూచించారు. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా చూస్తానన్న కేంద్ర ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోలేకపోవడం వల్లే పోరాటం తప్పలేదన్నారు.

పరీక్షలకు వేళాయే... హాల్ టికెట్లు ఇవ్వకపోయే...

- ఫీజు బకాయిలు విడుదల చేయని ప్రభుత్వం
- హాల్ టికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న కాలేజీ యాజమాన్యాలు
- ఆందోళనలో పేద విద్యార్థుల బంగారు భవితవ్యం
- వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని 12 బీసీ సంఘాల సమావేశం డిమాండ్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: మార్చి నెల నుంచి పరీక్షలు జరుగబోతున్నాయి. ఈ విద్యా సంవత్సరం కూడా పూర్తి కావస్తోంది. కానీ ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇచ్చేందుకు కాలేజీ యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. దీంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని 12 బిసి సంఘాల సమావేశం డిమాండ్ చేసింది. శనివారం జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత ఏడాది ఫీజు బకాయిలు రూ.1600కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, జిల్లా అధికారులు విద్యార్థులకు మంజూరు చేస్తూ ఈ మేరకు 15లక్షల మంది బిల్లులు తయారు చేసి ట్రెజరీకి పింపించగా..డబ్బులు లేవిన చెబుతూ బిల్లులు పాస్ చేయడం లేదన్నారు. దీంతో కాలేజీ యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. వచ్చే నెలతో ఆర్థిక సంవత్సరం, విద్యా సంవత్సరం ముగుస్తుందని, ఇప్పుడు కూడా మంజూరు చేయకుంటే ఎలా..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాలేజీ కోర్సులు చదివే 15లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బిసి, ఇబిసి, మైనార్టీ విద్యార్థుల గత ఏడాది ఫీజు బకాయిలు రూ.1600కోట్లు ఈ ఏడాదివి రూ.2500కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలేజీ స్థాయి కోర్సులు చదివే విద్యార్థుల పూర్తి ఫీజులు మంజూరు చేయాలని కోరారు. బిసిలలో అన్ని కులాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముస్లీం మైనార్టీ బిసి ఇ గ్రూపుకు చెందిన వారికి పూర్తి ఫీజులు చెల్లిస్తుందని, అలాగే బీసీలకు అందరికి పూర్తి ఫీజులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పూర్తి ఫీజుల స్కీము పునరుద్ధరించని పక్షంలో పెద్దయెత్తున ఉద్యమిస్తామని కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రానున్నా ఎన్నికల్లో పోటీకి డీసీసీలకు నోఛాన్స్

- కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయం
- జిల్లాలో అభ్యర్థుల గెలుపు బాధ్యతంతా డీసీసీలదే
- అందుకే టికెట్లు ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరణ
- టికెటిస్తే ఒకే సెగ్మెంట్ పరిమితమవుతారనే భావన
- నూతనంగా ఏర్పడ్డ జిల్లాలకు అధ్యక్షులను నియమించని టీ-పీసీసీ
- ఉమ్మడి జిల్లాల అధ్యక్షులనే ఇప్పటికీ కొనసాగిస్తున్న వైనం
- అధిష్ఠాన నిర్ణయంతో ఉమ్మడి జిల్లాల అధ్యక్షుల అసంతృప్తి
- టికెట్లిచ్చేది లేదంటే పదవి వదులుకునేందుకు పలువురు రెడీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులకు అధిష్టానం నీళ్లు చల్లింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులకు టికెట్లు ఇవ్వరాదని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల గెలుపు బాధ్యలతను జిల్లా అధ్యక్షులే పర్యవేక్షిస్తూ, ప్రచారం నిర్వహించాల్సిన నేపథ్యంలో, వారికి టికెటిచ్చి ఒకే నియోజకవర్గానికి పరిమితం చేయడం సరికాదన్న భావనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. నిస్వార్థంగా పనిచేసేవారికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించడం ద్వారా, రానున్నా ఎన్నికల్లో విజయం సాధించవచ్చునని ఆపార్టీ నాయకత్వం ఆశిస్తోంది. అయితే రానున్నా ఎన్నికల్లో డీసీసీ అధ్యక్షులకు టికెటివ్వరాదని కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయమేమి కొత్తదేమీ కాదని పార్టీ వర్గాలంటున్నాయి. గతంలోను పార్టీ అధిష్టానం డీసీసీ అధ్యక్షులకు టికెట్ ఇవ్వలేదని గుర్తు చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో చాలా మంది జిల్లా అధ్యక్షులకు అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు ఇచ్చేందుకు పార్టీ అధిష్టానం నిరాకరించిందని పేర్కొంటున్నారు. జిల్లా అధ్యక్షులకు టికెట్లు ఇవ్వరాదన్న నిర్ణయం వల్ల కొన్ని జిల్లాల్లో ఇబ్బందికర పరిస్థితులు నెలకొనడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమందికి మాత్రం టిక్కెట్లు ఇచ్చిందన్నారు. అయితే రానున్నా ఎన్నికల్లో పోటీ చేయాలని భావించే వారు డీసీసీ అధ్యక్ష పదవులను వదుకోవాల్సిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విస్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో రానున్నా ఎన్నికల్లో డీసీసీ అధ్యక్షులకు టికెట్లు ఇచ్చే అవకాశాలు లేవని, టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనప్రాయంగా ఇటీవల వెల్లడించినట్లు సమాచారం. డీసీసీ అధ్యక్షులకే కాకుండా పిసిసి అధ్యక్షులందరికీ ఇదే నిబంధనలు వర్తింపచేయాలని కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం యోచిస్తుందని హస్తిన వర్గాలంటున్నాయి. అదే జరిగితే త్వరలోనే ఎన్నికలు జరగనున్న చాల రాష్ట్రాల్లో పీసీసీ అధ్యక్ష పదవి బాధ్యతలను నిర్వహించేందుకు చాలమంది నేతలు నిరాకరించే అవకాశాలున్నాయంటున్నారు. ఎన్నికల్లో డీసీసీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించే వారికి టికెట్లు ఇవ్వక పోతే, వారు మరింత అంకితభావంతో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తారని కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం భావిస్తోందని అంటున్నారు. డీసీసీ అధ్యక్షులు ఎవరైనా అధిష్టానం ఆదేశాలను భేఖాతరు చేసే ప్రయత్నాన్ని చేస్తే, వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ భావిసున్నారని చెబుతున్నారు. . రానున్నా ఎన్నికల్లో డీసీసీ అధ్యక్షులకు టికెట్లిచ్చే అవకాశాల్లేవన్న అధిష్టానం ఆదేశాలతో, తెలంగాణలో నూతనంగా ఏర్పడిన 31 జిల్లాల అధ్యక్ష పదవిబాధ్యతలను చేపట్టేందుకు ఎవరు ముందుకురావడం లేదని కాంగ్రెస్‌పార్టీ వర్గాలంటున్నాయి. దాంతో నూతన జిల్లాలకు అధ్యక్షులను నియమించే ప్రక్రియను పక్కనపెట్టి, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులనే కొనసాగించాలని టీ-పీసీసీ నాయకత్వం యోచిస్తోందంటున్నారు. కాంగ్రెస్ అధిష్టాన నిర్ణయంతో కంగుతిన్న ఉమ్మడి జిల్లాల డీసీసీ అధ్యక్షులు, రానున్నా ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం అవసరమైతే అధ్యక్ష పదవిని వదులుకునేందుకు సిద్ధమని ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. కొన్ని జిల్లాలకు మాజీ ఎమ్మెల్యేలు అధ్యక్షులుగా కొనసాగుతుండగా, మరికొన్ని జిల్లాలకు పార్టీ సీనియర్లు అధ్యక్షులు కొనసాగుతున్నారు. ఎవరైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రానున్నా ఎన్నికల గోదాలోకి దిగాలని ఆరాటపడుతున్నారు. రానున్నా ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులకు టికెటిచ్చేది లేదంటే, ప్రస్తుతమున్న ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు పదవిని వదులుకునేందుకు రెడీ అవుతుండగా, ప్రజాధరణ కలిగిన కీలకనేతలు ఎవరు జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టేందుకు సుముఖంగా లేకపోవడంతో అధిష్టాన నిర్ణయంతో కొత్త చిక్కు వచ్చిపడిందని టీ-పీసీసీ నాయకత్వం ఆందోళన చెందుతోంది. తెలంగాణలో గతంలో కంటే ఇప్పుడిప్పుడే బలం పుంజుకుంటున్నామని భావిస్తోన్న తరుణంలో జిల్లా అధ్యక్షులకు రానున్నా ఎన్నికల్లో పార్టీ టికెటిచ్చేది లేదని మెలిక పెడితే, వారు పదవి నుంచి తప్పుకుంటామంటే ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో టీ-పీసీసీ నాయకత్వమున్నట్లు తెలుస్తోంది.

ఫేస్‌బుక్‌ద్వారా పార్టీ కేడర్‌తో సంభాషించిన ఉత్తమ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సామాజిక మాధ్యమాన్ని వేదికగా చేసుకుని తొలిసారిగా టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులతో సంభాషించారు. ఈనెల 26వతేదీనుంచి చేపట్టనున్న ప్రజాచైతన్యబస్సుయాత్ర గురించి ఫేస్‌బుక్‌ద్వారా ప్రత్యక్షంగా ఉత్తమ్, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విస్తృతస్థాయిలో సామాజిక మాధ్యమాన్ని వేదికగా చేసుకుంటున్న తరుణంలో, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉత్తమ్ తొలిసారిగా ఫేస్‌బుక్ ద్వారా పార్టీ శ్రేణులతో సంభాషించారు. ఫేస్‌బుక్ ద్వారా ఉత్తమ్ నిర్వహించిన లైవ్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది.

26న ఏపీ ఎంసెట్ నోటిఫికేషన్

28 నుంచి దరఖాస్తుల **స్వీకరణ**

కాకినాడ, సూర్య ప్రతినిధి : ఎంసెట్-2018 నోటిఫికేషన్‌ను ఈ నెల 26న విడుదల చేసేందుకు జేఎన్‌టీయూ కాకినాడ సన్నద్ధమైంది. ఫిబ్రవరి 28 నుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని కన్వీనర్ సీహెచ్.సాయిబాబు తెలిపారు. 30 రోజులపాటు ఎలాంటి ఆలస్యరుసుం లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ తరువాత ఆలస్య రుసుం రూ.500, రూ.1000, రూ.అయిదు వేలు, రూ.10 వేలు చెల్లించి కూడా దరఖాస్తు చేసుకునే వీలుంది. ఈ ఏడాది దరఖాస్తు ధరకు అదనంగా జీఎస్‌టీ కలవడంతో దరఖాస్తు రుసుంను రూ.500గా నిర్ణయించినట్లు కన్వీనర్ తెలిపారు. వచ్చే దరఖాస్తులను బట్టి ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. గత సంవత్సరం రీతిలోనే ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఎంసెట్ నిర్వహించనున్నారు.

సీఐఐ సదస్సులో అమరావతి ఐకన్ నిర్మాణాల ప్రదర్శన

విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : నగరంలో జరుగుతున్న సీఐఐ సదస్సులో అధికారులు అమరావతి ఐకాన్ నిర్మాణాల ప్రదర్శన చేశారు. క్యాపిటల్ సిటీ నమూనా, అసెంబ్లీ, హైకోర్టు భవనం నమూనా ప్రదర్శించారు. వాటిని వర్చ్యువల్ రియాలిటీ ద్వారా చూసే వెసులుబాటు కల్పించారు. కాగా విశాఖ సీఐఐ సదస్సులో కియా కార్ల ప్రదర్శన ఆకర్షణగా నిలిచాయి. అనంతపురంలో కియా సంస్థ తయారు చేయనున్న మూడు మోడల్స్‌ను ఇక్కడ ప్రదర్శించారు. వచ్చే ఏడాదికి ఈ మూడు కార్లను తయారు చేయనున్నారు. కియా సంస్థను ఆదర్శంగా తీసుకుని మరిన్ని సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి.

బీజేపీ అధికారంలోకి వస్తే రూ. 3 వేల నిరుద్యోగ భృతి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వెల్లడించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, దీనిని పరిష్కరించడంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో అమీర్‌పేటలో నిరుద్యోగుల యువగర్జన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలపై అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు చేపడతామని తెలిపారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి..కేసీఆర్ మాట మార్చారని ఆయన ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశించిన యువతకు చివరకు నిరాశే మిగిలిందని లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ కోసం బలిదానాలకు పాల్పడ్డ అమరులకు త్యాగాలు... తెలంగాణ ద్రోహులకు భోగాలు మిగిలాయని ఎద్దేవా చేశారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి నిరుద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం నిండా ముంచిందన్నారు. నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా... ప్రభుత్వం ఏమాత్రం చలించడం లేదన్నారు. ఉద్యమ సందర్భంగా, ఎన్నికల ముందు ప్రస్తావించిన ఉద్యోగాలు భర్తీ చేసేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎన్నో ఉద్యమాలు చేసిన ఫలితంగా 36జీవో ద్వారా ముల్కీ నిబంధనలు తీసుకొచ్చారని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉద్యోగులు తెలంగాణ వారికే దక్కాలని 610 జీవో తీసుకొచ్చారని చెప్పారు. అదే జీవో అమలు చేయాలని ఉద్యమాన్ని ప్రారంభిస్తే.. నేడు ఇంటికో ఉద్యోగం కాదు కదా... కనీసం ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని, మొదటి ఏడాదిలో లక్షా 12వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం చెప్పారని, కానీ నాలుగేళ్లలో కేవలం 16వేల పోస్టులు భర్తీ చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికలల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని నిరుద్యోగ భృతిని ఇచ్చేందుకు చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల కోసమే రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నారని డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకునేందుకు ప్రయత్నం

ఏపీ సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు



అనంతపురం, సూర్య ప్రతినిధి : అధికారులపై అసత్య ఆరోపణలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఏపీ సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన విజయసాయిరెడ్డి, అధికారులపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు తమ చేతుల్లో లేదని, రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబుతో చర్చించామన్నారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారని కాల్వ శ్రీనివాసులు తెలిపారు.

వచన్ కుమార్‌ను అభినందించిన మాలల ఐక్యవేదిక



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీసెల్ కన్వీనర్‌గా నియమితులైన వచన్‌కుమార్‌ను జాతీయ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆవుల బాలనందం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. బాలనందంతోపాటు వచన్‌కుమార్‌ను కలిసిన మాలల ఐక్యవేదిక నేతలు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా వచన్ కుమార్ మాట్లాడుతూ టీ-పీసీసీ ఎస్సీసెల్ కన్వీనర్‌గా నియమితున్ని అయిన విషయాన్ని తెలుసుకుని అభినందించడానికి విచ్చేసిన మాలల ఐక్యవేదిక నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రానున్నా రోజుల్లో అన్ని వర్గాలను కలుపుకుని టీ-పీసీసీ ఎస్సీసెల్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

26న ఏఎన్‌యూ పీజీ సెట్ నోటిఫికేషన్



గుంటూరు, సూర్య ప్రతినిధి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, అనుబంధ ఒంగోలు పీజీ కేంద్రం, అనుబంధ పీజీ కళాశాలలో 2018-19 విద్యాసంవత్సరానికి ఏఎన్‌యూ పీజీ సెట్ నోటిఫికేషన్ ఈనెల 26న విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రామిరెడ్డి వెల్లడించారు. ఈనెల 26 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 20వ తేదీ వరకు, అపరాధ రుసుముతో ఏప్రిల్ 25 వరకు, తత్కాల్ ఫీజుతో మే 1వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను అందించవచ్చు. దరఖాస్తు వెలను రూ.500గా నిర్ణయించారు. హాల్ టిక్కెట్లను మే 3వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ప్రవేశ పరీక్షలు మే 5 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో ఏర్పాటు చేసినప్పుడు కేవలం పది కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 41పైగా విభాగాలు, 356 అనుబంధ కళాశాలలు, ఒంగోలుకు పీజీ కేంద్రంలో ఆయా పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ఏడాది నూతనంగా ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ ఫిజికల్ కెమిస్ట్రీ కోర్సులను ప్రవేశపెడుతున్నారు.

ఫ్యాకల్టీల వారీగా ప్రవేశ పరీక్షలు...

గత ఏడాది నిర్వహించినట్లుగానే ఫ్యాకల్టీల వారీగా ప్రవేశపరీక్షలను నిర్వహిస్తున్నారు. ఒక్కో ఫ్యాకల్టీలో పరీక్షకు హాజరై అర్హత సాధిస్తే సంబంధిత కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. మొత్తం 15 ఫ్యాకల్టీల వారీగా పరీక్షలు జరుగుతాయి. లైఫ్‌సైన్సెస్‌లో ఎమ్మెస్సీ ఆక్వాకల్చర్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, నానో బయోటెక్నాలజీ, బోటనీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫుడ్ అండ్ న్యూట్రిషియనల్ సైన్సెస్, మైక్రోబయాలజీ, జువాలజీ కోర్సులు ఉన్నాయి. ఫిజికల్ సైన్సెస్‌లో ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రూమెంటేషన్ టెక్నాలజీ ఉన్నాయి. మేథమెటికల్ సైన్సెస్‌లో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ ఉన్నాయి. కెమికల్ సైన్సెస్‌లో ఎమ్మెస్సీ ఎనలిటికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, ఫోరెన్సిక్ ఉన్నాయి. జువాలజీలో ఎమ్మెస్సీ జువాలజీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో ఎమ్మెస్సీ నానో బయోటెక్నాలజీ (5 సంవత్సరాలు) కోర్సు ఉంది. సోషల్ సైన్సెస్‌లో ఎంఏ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంఎల్‌ఎస్‌సీ, ఎమ్మెస్సీ యోగాలు కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. ఆర్ట్స్ కోర్సుల్లో ఎంఏ ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, తెలుగు, ఎంకాం, ఎడ్యుకేషన్, ఎంపీఈడీ కోర్సులలో విడివిడిగా పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. అదేవిధంగా పీజీ డిప్లొమో కోర్సులలో డిగ్రీ అర్హత మీద ప్రవేశం పొందవచ్చు. అడ్వాన్స్‌డ్ ఆక్వాకల్చర్ మేనేజ్‌మెంట్, అంబేడ్కర్ స్టడీస్, గాంధీయన్ స్టడీస్, మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్, యోగా ఫర్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్, సర్టిఫికెట్ కోర్సు, సస్టేనబుల్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

భాగస్వామ్య సదస్సు వద్ద కియా ప్రదర్శన

విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : విశాఖపట్నంలో మూడు రోజులపాటు భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య వేదిక వద్ద కియా మోటార్స్ ప్రత్యేక ప్రదర్శన నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్లాంటులో ఉత్పత్తి చేయనున్న కార్ల మోడళ్లను ప్రదర్శనకు పెట్టింది. కొరియాలో అత్యంత ఖరీదైన స్పోర్ట్స్ కారు స్టింగర్‌తో పాటు ఎలక్ట్రిక్ కారు, హైబ్రీడ్ కార్లను బాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ఉంచింది. 60 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్న భాగస్వామ్య సదస్సు వద్ద ఈ కార్ల ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ సదస్సును మధ్యాహ్నం 3 గంటలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర 97వ రోజు షెడ్యూల్ విడుదల



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రతిపక్షనేత, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర 97వ రోజు షెడ్యూల్ ఖరారు అయింది. ఈమేరకు పాదయాత్ర షెడ్యూల్‌ను వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం విడుదల చేశారు. ఆదివారం ఉదయం 8.00 గంటలకు వైఎస్ జగన్ నైట్ క్యాంపు నుంచి పాదయాత్రను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి చాల్ల గిరిగేల చేరుకుంటారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరిస్తారు. అక్కడ నుంచి గద్ద మీద పల్లి క్రాస్, నంద మారెళ్లకు చేరుకొని పార్టీ జెండా ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 12.00 గంటలకు యేదవెల్లి క్రాస్ చేరుకొని, భోజన విరామంతీసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 3.00 గంటలకు తిరిగి పాదయాత్ర ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సాయంత్రం 4.00 గంటలకు పెద్దరికట్లకు చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు పాదయాత్రను ముగించి రాత్రికి అక్కడే బస చేస్తారు.

వైఎస్ జగన్ పాదయాత్రలో జేబుదొంగల హల్‌చల్

వైసీపీ అధినేత, ఏపీ ప్రధాన ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన ప్రజా సంకల్ప యాత్ర 96వ రోజు ముగిసింది. పాదయాత్రకు జగన్ వెంట పెద్ద సంఖ్యలో జనాలు రావడంతో దీన్నే అదునుగా చేసుకున్న కొందరు జేబు దొంగలు చేతివాటం చూపించారు. జగన్‌ను చూడటానికి వచ్చిన ఓ కాలేజ్ కరెస్పాండెంట్ వద్ద రూ. 1 లక్ష, మరొకరి వద్ద రూ. 70వేల నగదు, ఓ మహిళ వద్ద చైన్‌ను జేబు దొంగలు అపహరించారు.

కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్ర కమిటీలు ఖరారు

- భట్టి నేతృత్వంలో సలహా కమిటీ
- ఆర్థికకమిటీ చైర్మన్‌గా గూడురు
- మీడియా కమిటీ చైర్మన్‌గా మల్లురవి
- ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా షబ్బీర్ అలీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: టిఆర్ ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు ఈనెల 26 వతేదీ నుంచి చేపట్టనున్న కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయడానికి టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాలుగు అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. టీ-పీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు భట్టి విక్రమార్క నేతృత్వంలో సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో మాజీ పిసిసి అధ్యక్షులు వి.హనుమంతరావు, ఎఐసిసి కార్యదర్శి చిన్నారెడ్డి, ఎఐసిసి కార్యదర్శి మధు యాష్కి, మాజీ పిసిసి అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, ఎం.పి నందిఎల్లయ్య, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, పిఏసీ చైర్మన్ గీతారెడ్డి, ఎమ్మెల్యే డి.కె అరుణ, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకట రమణారెడ్డి, కిసాన్ సెల్ చైర్మెన్ కోదండరెడ్డి, మాజీ విప్ ఈరవర్తి అనిల్, మాజీ ఎం.ఎల్.ఎ కె. లక్ష్మారెడ్డి, పి. విజయ్ కుమార్ లను సభ్యులుగా నియమించారు.



ఆర్థికకమిటీ చైర్మన్ నారాయణరెడ్డి

ఆర్థిక కమిటీ చైర్మన్‌గా టిపిసిసి కోశాధికారి గూడరు నారాయణ రెడ్డి నియమించారు. కమిటీ సభ్యులుగా మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, జగదీశ్వర్ రావ్, మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్, బి. కైలాష్, ఎం.ఎ ఫహీమ్, ఎస్.షరత్ రెడ్డి, సయ్యద్ సాజిద్ పాషా, టిపిసిసి కార్యదర్శి మామిడి గోపిలను నియమించారు.

మీడియా కమిటీ చైర్మన్‌గా మల్లురవి

మీడియా కమిటీ చైర్మన్ టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవిని నియమించారు. కమిటీలో 19 మందిని సభ్యులుగా వ్యవహరించనున్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, దాసోజు శ్రవన్, మహేశ్ కొంగాల, హర్ష వర్ధన్ రెడ్డి, కమలాకర్ రావు, సుధాకర్ గౌడ్, ఎ.బి శ్రీనివాస్, తిరనగరి సురేందర్, సుజాత్ అలీ, హనుమంతరావు, సునితారావు, ఇందిరా, రమ్యా రావు, కైలాష్ నేత, శ్యామ్ మోహన్, కిరణ్ యాదవ్, బొజ్జ సంధ్యారెడ్డిలను సభ్యులుగా నియమించారు.

ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా షబ్బీర్ అలీ

మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ చైర్మన్‌గా ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కోచైర్మన్‌గా మాజీ మంత్రి దానం నాగేందర్, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు కన్వీనర్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఎమ్మెల్యేలు దొంతి మాదవరెడ్డి, సంపత్ కుమార్, టి. రామోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ కేంద్ర మంత్రి బల రామ్ నాయక్, మాజీ ఎం.పి మల్లు రవి, పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి దామోదర్ రెడ్డి, మాజీ విప్ జగ్గారెడ్డి, నల్గొండ డిసిసి అధ్యక్షులు బిక్షమయ్య గౌడ్, మాజీ ఎం.ఎల్.ఎ శ్రీశైలం గౌడ్, కె. దయాసాగర్, అనుబంధ సంఘాల చైర్మన్లు నాయకులు ఆరేపల్లి మోహన్, చిత్త రంజన్ దాస్, ఫక్రుద్దీన్, నేరేళ్ల శారద, జగన్నాయక్, అనిల్ కుమార్ యాదవ్, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు క్యామ మల్లేశం, వరంగల్ డిసిసిబి చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పి.కార్తీక్ రెడ్డి, ఆదాం సంతోష్, పాడి కౌశిక్ రెడ్డి, రవి యాదవ్, రాజ్ ఠాకూర్, టి.నిరంజన్, గోసుల శ్రీనివాస్ యాదవ్, చరన్ యాదవ్, మానవతా రాయ్ లను నియమించారు.

సంపాదకీయం

editpage@suryaa.com

"నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) ప్రభుత్వం బొగ్గు గనుల విషయంలో ఒక చరిత్రాత్మక ప్రకటన చేసింది. దేశంలో వాణిజ్య స్థాయిలో బొగ్గు గనుల తవ్వకానికి ప్రైవేట్ రంగానికి అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బొగ్గు గనుల తవ్వకాన్ని జాతీయం చేసిన దాదాపు 45 సంవత్సరాల అనంతరం ప్రత్యేక బొగ్గు గనుల సంస్థల పునఃప్రవేశానికి దీనితో దారులు తెరచినట్లు అయింది. ఇది ఎంతో కీలకమైన చర్య. 1991లో ఆర్థిక సరళీకరణ ప్రారంభించిన తరువాత చాలా వరకు ఆర్థిక కార్యకలాపాలలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యానికి చోటు కల్పించడమైంది. కాని ఆ సంస్కరణల పరిధిలోకి బొగ్గు గనులను తీసుకురాలేదు. తాజా సంస్కరణ బాగా ఆలస్యం అయినప్పటికీ ఇందుకు ప్రభుత్వం ఎంతైనా ప్రశంసార్హం. భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా ప్రభుత్వం ఆ బిల్లును సవరించవలసి ఉంది. ఆ రెగ్యులేటర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఉండడం అవసరం. ఎందుకంటే బొగ్గు గనుల తవ్వకంలోను, బొగ్గును ప్రధానంగా వినియోగించే థర్మల్ విద్యుత్ సంస్థలలోను ప్రభుత్వానికి నేరుగా వాణిజ్యపరమైన భాగస్వామ్యం ఉన్నది. బొగ్గు గనుల తవ్వకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న నిర్ణయం చరిత్రాత్మకమైనదే. కాని పర్యావరణానికి ముప్పు కలగని రీతిలో జరిగినప్పుడే దాని వల్ల సత్ఫలితం లభిస్తుంది. 138 క్షేత్రాల్లో 40 కోల్ బ్లాక్స్‌లో మైనింగ్ ప్రారంభమైందని ఆయన చెప్పారు. వాటికి సంబంధించిన కేంద్రాలు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. 40తో పాటు మరో ఆరింటిలో మైనింగ్ మొదలవ్వనప్పటికీ ప్లాంట్లు సిద్ధం"

బొగ్గుగనులు ప్రయివేటుకు

నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) ప్రభుత్వం బొగ్గు గనుల విషయంలో ఒక చరిత్రాత్మక ప్రకటన చేసింది. దేశంలో వాణిజ్య స్థాయిలో బొగ్గు గనుల తవ్వకానికి ప్రైవేట్ రంగానికి అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బొగ్గు గనుల తవ్వకాన్ని జాతీయం చేసిన దాదాపు 45 సంవత్సరాల అనంతరం ప్రత్యేక బొగ్గు గనుల సంస్థల పునఃప్రవేశానికి దీనితో దారులు తెరచినట్లు అయింది. ఇది ఎంతో కీలకమైన చర్య. 1991లో ఆర్థిక సరళీకరణ ప్రారంభించిన తరువాత చాలా వరకు ఆర్థిక కార్యకలాపాలలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యానికి చోటు కల్పించడమైంది. కాని ఆ సంస్కరణల పరిధిలోకి బొగ్గు గనులను తీసుకురాలేదు. తాజా సంస్కరణ బాగా ఆలస్యం అయినప్పటికీ ఇందుకు ప్రభుత్వం ఎంతైనా ప్రశంసార్హం.

ఇప్పుడుదేశంలో బొగ్గు గనులను తిరిగి ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని కేంద్రం నిర్ణయించడంతో చరిత్ర పునరావృతమైందన్న మాట. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి ఇందిరా గాంధి హయాం వరకు బొగ్గు పరిశ్రమ ప్రధానంగా ప్రైవేట్ రంగం ఆధ్వర్యంలోనే కొనసాగింది. ఇందిరా గాంధి ప్రభుత్వం 1973లో బొగ్గు గనుల (జాతీయకరణ) చట్టం ద్వారా బొగ్గు గనులు అన్నిటినీ ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియాకు బదలీ చేయాలని నిశ్చయించింది. బొగ్గు గనుల తవ్వకాన్ని ప్రైవేట్ రంగం పరిధిలో నుంచి తప్పించడానికి ఆ ప్రభుత్వం చెప్పిన ప్రధాన కారణం విద్యుత్ అవసరాలు తీర్చడమే. దేశంలో బొగ్గు సరఫరాలో 80 శాతం పైగా వాటా కోల్ ఇండియాదే. మిగతా వాటా మరొక ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ, కొన్ని పరిశ్రమల సొంత బొగ్గు గనులది. ఉక్కు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు వంటి పరిశ్రమల ఉపయోగార్థం ప్రైవేట్ సంస్థలకు ప్రత్యేకంగా బొగ్గు గనులను కేటాయించడం జరిగింది. వాణిజ్య స్థాయిలో బొగ్గు గనుల తవ్వకాన్ని, బొగ్గు విక్రయాన్ని ప్రైవేట్ సంస్థలకు బదలాయించడం ఎప్పుడో జరగవలసి ఉన్న సంస్కరణ. విద్యుదుత్పత్తి కోసం బొగ్గుపై దేశం ఇతోధికంగా ఆధారపడుతోంది. పునరుద్వియోగ, అణు విద్యుత్ వనరుల పెంపు కోసం ముమ్మరంగా కృషి చేస్తున్నప్పటికీ 70 శాతం విద్యుదుత్పాదన బొగ్గు ఆధారిత థర్మల్ కేంద్రాల ద్వారానే జరుగుతోంది.

ఇటీవలి సంవత్సరాలలో బొగ్గు దిగుమతులు గణనీయ స్థాయిలో పెరిగాయి. క్రితం సంవత్సరం దేశీయ డిమాండ్‌లో దాదాపు 20 శాతాన్ని దిగుమతుల ద్వారానే తీర్చడమైంది. తమ గనులలో బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఉత్పత్తి పెంచినప్పటికీ కోల్ ఇండియా కొత్త విద్యుత్ కేంద్రాల డిమాండ్‌కు తగినట్లుగా అడుగులు వేయలేకపోతుండడం ఇందుకు కారణం. దేశంలో దాదాపు 300.80 బిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అంచనా. ప్రపంచంలో బొగ్గు నిక్షేపాలలో భారతదేశం ఐదవ స్థానంలో ఉంది. అయితే, దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ప్రపంచంలో బొగ్గు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో పైనుంచి మూడవ స్థానంలో మనం ఉన్నాం. ఉన్న నిక్షేపాలను సమర్థంగా వినియోగించుకోవాలనే ప్రణాళిక లేకుండా అడ్డగోలుగా వాడుకోవాలని చూడడమే ఈ దురవస్థకు కారణమనడంలో సందేహం లేదు. ప్రభుత్వం తాజా నిర్ణయం వల్ల ఈ దిగుమతులు గణనీయంగా తగ్గుతాయని ఆశించవచ్చు.

కాగా, బొగ్గు గనుల విషయంలో యుపిఎ ప్రభుత్వం నుంచి వారసత్వంగా సంక్రమించిన అస్తవ్యస్త పరిస్థితులను సరిదిద్దడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం చురుకుగానే వ్యవహరించిందనాలి. యుపిఎ హయాంలో బొగ్గు గనుల కేటాయింపులో అవకతవకలు చోటు చేసుకోవడం, సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని బొగ్గు నిక్షేపాల వేలం ప్రక్రియకు ఆదేశించడం విదితమే. బొగ్గు గనుల కేటాయింపు ప్రక్రియలో లోపాలను కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) కనుగొన్న తరువాత ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు 204 బొగ్గు గనుల కేటాయింపును సుప్రీం కోర్టు 2014 సెప్టెంబర్‌లో రద్దు చేసింది. ఎన్‌డిఎ ప్రభుత్వం వెంటనే ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసి, బాధిత గనులకు సంబంధించి పారదర్శకంగా వేలం ప్రక్రియ సాగించింది. యుపిఎ హయాంలోని టెలికమ్ స్పెక్ట్రమ్ కేటాయింపు కుంభకోణం నుంచి నేర్చుకున్న పాఠాలు ఇందుకు దోహదం చేశాయి.

బొగ్గు క్షేత్రాల కుంభకోణానికి సంబంధించి సుప్రీం కోర్టు చరిత్రాత్మకమైన తీర్పు ఇవ్వడంతో కుంభకోణానికి సంబంధించి కీలక మలుపు సంఘటన జరిగినట్లయింది. ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన నాలుగు మెగా పవర్ ప్రాజెక్టులకు మినహాయింపు లభించడం ఒక్కటే ప్రభుత్వానికి ఊరట కలిగించిన అంశం. 1993 నుండి కేటాయించిన 214 బొగ్గు క్షేత్రాల కేటాయింపును భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు రద్దు చేయడం అప్పట్లో రాజకీయ, వాణిజ్య వర్గాల్లో సంచలనం కలిగించింది. బొగ్గు క్షేత్రాలను రద్దు చేయాలనుకుంటే 218 లైసెన్సులు రద్దు చేయవచ్చని అటార్నీ జనరల్ అంతకు ముందు కోర్టుకు సూచించారు. 218 బొగ్గు క్షేత్రాల కేటాయింపుల్లో 80 క్షేత్రాలను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన 138 క్షేత్రాల్లో 40 కోల్ బ్లాక్స్‌లో మైనింగ్ ప్రారంభమైందని ఆయన చెప్పారు. వాటికి సంబంధించిన కేంద్రాలు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. 40తో పాటు మరో ఆరింటిలో మైనింగ్ మొదలవ్వనప్పటికీ ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయని అటార్నీ జనరల్ తెలిపారు.

బొగ్గు పరిశ్రమ కోసం ఒక రెగ్యులేటర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ఇప్పుడు తీసుకోవలసిన మరొక ముఖ్యమైన చర్య. బొగ్గు రంగంలో ఒక రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేయడం కోసం ఒక బిల్లును 2013లో లోక్‌సభలో ప్రవేశపెట్టడమైంది. కాని బిల్లు ఆమోదించే లోపలే సభ రద్దు అయింది. ఎన్‌డిఎ ప్రభుత్వం దానిని పునరుద్ధరించవలసి ఉంది. అంతే కాదు. భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా ప్రభుత్వం ఆ బిల్లును సవరించవలసి ఉంది. ఆ రెగ్యులేటర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఉండడం అవసరం. ఎందుకంటే బొగ్గు గనుల తవ్వకంలోను, బొగ్గును ప్రధానంగా వినియోగించే థర్మల్ విద్యుత్ సంస్థలలోను ప్రభుత్వానికి నేరుగా వాణిజ్యపరమైన భాగస్వామ్యం ఉన్నది. బొగ్గు గనుల తవ్వకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న నిర్ణయం చరిత్రాత్మకమైనదే. కాని పర్యావరణానికి ముప్పు కలగని రీతిలో జరిగినప్పుడే దాని వల్ల సత్ఫలితం లభిస్తుంది.

రెంటికీ చెడ్డ రేవడి అయిన బిజెపి

సత్య ఎం.వి.ఎస్
హైదరాబాద్ – 833011972

- బిజెపి, దేశం మిత్ర భేదం వైసీపికి కలసి వచ్చేనా?
- బిజెపి ఎదుగుదలను దేశం అడ్డుకుందన్నదే ఆరోపణ
- ఒంటరిగా గెలిచేస్తామంటూ అధిష్ఠానానికి సంకేతాలు
- పొత్తు వీడిపోతే కామినేని టిడిపిలో చేరే ఛాన్సు
- సోము వీర్రాజు రాజీనామాకు తెలుగుదేశం డిమాండ్



తెలుగురాష్ట్రాలకు నిధులు కురిపించిన ఘనత మాదేనని ఇక ఒంటరి పోరుతో ఇరు రాష్ట్రాలలో పాగా వేయచ్చున్న స్థానిక నేతల నమ్మక వచనాలతో మిత్ర పక్షాన్ని తీలనాడి అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలో ఒంటరిపోరుకు ఆప్షన్స్ వెదు క్కోవటం ప్రారంభించిన భారతీయ జనతాపార్టీకి కనీసం శుభశకునాలు కనిపించడం లేదన్నది వాస్తవం. నిజానికి బీజేపీ అధిష్టానం తను సొంతంగా వివిధ జాతీయ సంస్థలతో చేయించుకున్న అంతర్గత సర్వేల్లో 2019 ఎన్నికల్లో బీజేపీ భారీ గానే నష్టపోనుందని, అందునా ఉత్తరాదిలో దీని ప్రభావం ఎక్కువగా ఉండబో తోందని స్పష్టంగా తేలిన నేపథ్యంలో దక్షిణాదిన బలపడాలని నిర్ణయిం చుకుం ది. తెలంగాణలో అయిదు అసెంబ్లీ స్థానాలకు, ఒక లోక్ సభ స్థానానికి బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తుంగా ఆంధ్రప్రదేశ్‌లో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు శాసనసభ్యులను గెలిపించుకుని రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం దక్కించుకుంది. అయితే తెలంగాణాలో గెలిచిన తొలి నాళ్ల నుంచి తెలుగుదేశం పార్టీకి దూరం కావటమే లక్ష్యంగా బిజెపి నడక సాగింది . ఓదశలో తెలుగుదేశంలో ఉన్న కీలక నేతల్ని పార్టీలో చేర్పించుకునేందుకు పావులు కదిపారు కూడా. నోటుకు ఓటు వ్యవహారంతో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పరిస్థితిని చంద్రబాబు పట్టించుకోక పోవటంతో ఆ పార్టీలోని సభ్యులు దాదాపు అధికార తెలంగాణ రాష్ట్రసమితిలో చేరిపోయారు.

దీంతో ఒంటరిపోరుకు సిద్ధమైన బిజెపి తెలంగాణ నుంచి ప్రతినిధి ఎన్నిక కావడం అంటే అదంతా తెలుగుదేశం బలం మాత్రమేననే వాదనా ఉంది. అయితే సొంత బలంగా చెప్పుకుంటున్న నేతలు రానున్న ఎన్నికలలో పోరుకుదిగుతుండగా. తాజాగా వచ్చిన ఎన్నికల సర్వే నివేదికలు హతాసుల్ని చేసాయి. పార్టీకి కొత్తగా జవసత్తువలు కల్పించాలనుకుంటు ముందుకు సాగుతున్న మోడీ,అమిత్ షాలకు తెలుగు రాష్ట్రాల్లో చుక్కెదురు తప్పదన్నది వస్తున్న వార్తల సారాంశం.

వాస్తవ పరిస్థితి, స్థానికంగా కనీస కేడర్ కూడా లేని రాష్ట్రస్థాయి నాయకులు వాస్తవాలను గుర్తించక బీరాలు పలకడం ఆశ్చర్యకరంగా కనిపిస్తుంది. తెలంగాణ లో ఆ పార్టీ పరిస్థితి పూర్తిగా తీసికట్టు అయిన సందర్భంలో ఆటు ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పరిస్థితి ఏంటో అర్థం కాక అధిష్టానానికి కూడా చికాకుగానే మారిందనటంలో సందేహం లేదు. ఎపిలో తెలుగుదేశం పొత్తు కొనసాగిస్తే విజయా వకాశాలను అందుకునే ఛాన్సుందని చెపుతున్నా, అవినీతి ఆరోపణలు ఎదురొంకటున్న జగన్‌వైపే కొందరు మొగ్గు చూపడంతో స్థానిక నాయకులని నమ్మిన అగ్రనాయకత్వం టీడీపీని దూరం పెట్టి వైసీపీ పూర్తిగా కలిసిపోవాలని ఆలోచించింది. అయితే వైసిపి పొత్తులకోసం విధిస్తున్న షరతులు, అనధికార ఒప్పందాలు బీజేపీకే నష్టదాయకమనేది మంత్రులు రాజ్ నాథ్, అరుణ్ జైట్లీ తదితర నాయకుల అభిప్రాయంగా చెబుతున్నా మోడీ , అమిత్ షాలు మాత్రం పెద్దగా స్పందించడం లేదని, పొత్తుల కన్నా ఒంటరి పోరుద్వారానే తమ సత్తా చూసుకోవాలని భావిస్తున్నట్లు కనిపిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హరిబాబు తెలుగుదేశంతో ఇన్నాళ్లు సన్నిహిత సంబంధాలు నెరుపుతూ వస్తుండగా రాష్ట్రంలోనూ అటు అధిష్టానం, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో తీవ్ర సతమతమవుతున్నారు. ఇటు స్థానిక నాయకులు, మధ్యలో టీడీపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులను అదుపు చేయాలని గతంలో అమిత్ షా స్పష్టంగా హరిబాబును ఆదేశించినా కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అందచేసిన నిధుల వివరాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని సూచించినా, సోము వీరరాజు లాంటి లాంటి నేతలు తెలుగుదేశం పార్టీపై తమ దాడిని కొనసాగిస్తునే ఉన్నారు. అలాగే వీర్రాజు, పురందరేశ్వరి లాంటి నేతల మాటలు విన్న క్యాడర్ కూడా హరిబాబు మాట వినడం మానేసింది..

ఇప్పుడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థాయి నాయకులు కూడా టీడీపీని టార్గెట్ చేసుకుంటూ రాజకీయ విమర్శలు గుప్పిస్తుండటంతో తనూ జతకలవాల్సిన పరిస్తితిని తెచ్చుకున్నారు. ఇటీవలే పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షునిగా మరోమారు అవకాశం పొందిన అతనికి రానున్న రోజులలో తెలుగురాష్ట్రాలలో ప్రధాని, అమిషాల పర్యటనలు పూర్తయితే కానీ గడ్డు పరిస్థితి తప్పకపోవచ్చు. తెలుగుదేశం పార్టీతో పొత్తుల విషయమై బిజెపి అధిష్టానం స్పష్టమైన నిర్ణయం తీసుకుని ప్రకటించేవరకూ నలిగిపోక తప్పదన్నది హరిబాబు సన్నిహితులు చెపుతున్నారు.

మరోవైపు గత నాలుగేళ్లుగా తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటిక భారతీయ జనతాపార్టీ కొత్తగా క్యాడర్ ను నిర్మించుకోలేకపోయిందన్నది వాస్తవం. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన సీట్లలో పోటీ చేయటం, ఆ పార్టీ బలం మీదే ఆధారపడి విజయాలు అందుకోవటం గమనించదగ్గది. అసలు ఏపిలో పేరున్న నేతలు మినహా ఆ పార్టీ ఏనాడూ సొంతంగా పోటీచేసి గెలవగల సామర్ధ్యాన్ని సంతరించుకోలేదు. అయితే ఈ విషయంలో తప్పంతా వెంకయ్య నాయుడిదేనని ఆతని వ్యతిరేకులు నేటికీ వేళ్లు చూపిస్తుంటారు. . కేంద్రమంత్రిగా పనిచేసిన రోజులలో వెంకయ్యానాయుడు బీజేపీని సరిగా పట్టించుకోలేదని తెలుగుదేశం బీ టీమ్‌గా ఉన్నవారిని తయారు చేశారని ఆరోపిస్తున్నారు.

కేంద్రం ఏపికి చేస్తున్న సహాయాలపై ప్రజలకు వివరించడం మాని ఏపీకి జరిగిన అన్యాయంపైనే ఆయన దృష్టి సారించడంతో టీడీపీకి అడ్వాంటేజ్ గా మారిందనే వారూ లేకపోలేదు చంద్రబాబునాయుడు, వెంకయ్య నాయుడు పరస్పర ప్రశంసలతో కాంగ్రెసు నుంచి వచ్చిన నలుగురైదుగురు బలమైన నాయకులు నీరుగారిపోయారు.

ఈ క్రమంలో చంద్రబాబు వ్యతిరేకులను పార్టీలో సైతం వెంకయ్యానాయుడు ఎదగనీయరనే అపప్రధను విజయవం తంగా చాటించి. టీడీపీతో పొత్తు విచ్చిన్నమైతే ముందుకు వెళ్లాగలమని, గత ఎన్నికలలో బిజెపి ఓట్లతోనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్న భావన అధిష్టానంలో చొప్పించడంతో పొత్తులు తిరస్కరణకు ఓకే చెప్పిందన్నది ఓ వాదన.

రాష్ట్రప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న బీజేపీ నేతలు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్ భిన్నమైన వైఖరిని కనబరుస్తున్నారు. కామినేని పూర్తిగా తెలుగుదేశం మనిషిగా ముద్రపడిపోయారు. ఒకవేళ బీజేపీ టీడీపీకి దూరమైతే ఆయన కమలదళంలో కొనసాగుతారో లేదో కూడా తెలియని సందిగ్ధ పరిస్థితి. మరోవైపు మాణిక్యాల రావు తన పరిధిని విస్తరించుకోలేదు. మంత్రిగా పార్టీలో రాష్ట్రవ్యాప్తంగా జోష్ నింపే అవకాశమున్నప్పటికీ ఆయన లోకల్ లీడర్ గానే మిగిలిపోయారు.

ప్రధానంగా పశ్చిమగోదావరి, మరీ ముఖ్యంగా తాడేపల్లి గూడానికే ఆయన పరిమితం. అవసరమైతే మంత్రివర్గానికి అయిదు నిము షాల్లో రాజీనామా చేస్తానన్న ఆయన ప్రకటన కూడా పెద్దగా స్పందన రాబట్టలేక పోయింది.మరోవైపు తెలుగుదేశం ప్రజా ప్రతిధుల సాయంతో శాసనమండలి లో స్థానం దక్కించుకున్న సోమువీరరాజుని తక్షణమే రాజీనామా చేయాలన్న డిమాండుతో తెలుగుదేశం పార్టీ ముందుకు వచ్చింది. దీనిపై స్పందించేందుకు నిరాకరిస్తున్న ఆయన తెలుగుదేశం పార్టీ వ్యవహారాలను మరిన్నింటిని ముందుకు తీసుకువస్తానంటూ గర్జిస్తుండటం విశేషం

దీంతో అధిష్టానం టీడీపీతో కలిసి వెళ్లమంటుందా?వంటరి పోరాటానికి రంగం సిద్ధం చేసుకోవాలా? స్ట్రాటజీ ఏమిటి? మరీ ఆలస్యం చేస్తే నష్టమే. మరింత బద్నాం అయ్యాక పొత్తు చెడిపోయినా ప్రజల్లోకి వెళ్లడం కష్టమని క్యాడర్ ఆందోళన చెందుతోందన్నది వాస్తవం. మరి రానున్న రోజులలో పార్టీ పరిస్థితి ఏంటో? అర్థం కాకుండా ఉందన్నది వారి వాదన.

తెలంగాణ కాంగ్రెస్‌లో లుకలుకలు

వినోద్ సుద్దాల, రీసెర్చ్ స్కాలర్
ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాద్

- పార్టీలోని వర్గాలతో ఇమడలేక పోతున్న రేవంత్ రెడ్డి
- వచ్చి చేరుతానని ఆఫర్ ఇచ్చిన నాగం జనార్దన్ రెడ్డి
- నాగం చేరికను వ్యతిరేకిస్తున్న పాలమూరు నేతలు
- జానా రెడ్డి అడుగులపైనా కేడర్‌లో అయోమయం
- రానున్న ఎన్నికలెదుర్కోవటంపైనే పార్టీలో మల్లగుల్లాలు



తెలంగాణ తెలుగుదేశం పార్టీలో రేవంత్ ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా సాగింది. రేవంత్ కు పార్టీలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు అధినేత చంద్రబాబు. దీంతో మూడున్నరేళ్ల పాటు రేవంత్ అధికార టిఆర్ఎస్ పార్టీ మీద రెచ్చిపోయారు. అధికార పార్టీ కదలికలను అడుగడుగునా ఎండగట్టారు. కేసిఆర్ ను ధీటుగా ఎదుర్కోవడంలో హేమాహేమీలే కింద మీద అయిన పరిస్థితుల్లో రేవంత్ కేసిఆర్ కు ధీటైన ప్రత్యర్థిగా నిలిచే ప్రయత్నం చేశారు. టిడిపిలో సీనియర్లు ఉన్నా.. సైలెంట్ గా ఉండడంతో ఆ పార్టీలో రేవంత్ ఇష్టారాజ్యం సాగింది. ఒకవేళ సీనియర్లు ఏమైనా కలగజేసుకున్నా.. వాళ్లను పార్టీ అధినేత చంద్రబాబు కంట్రోల్ చేసేవారు. దీంతో రేవంత్ కు టిడిపి అనే పార్టీ తెలంగాణలో కీలక నేతగా ఎదిగేందుకు మెట్టు మాదిరిగా ఉపయోగ ఎడింది. అయితే తన లక్ష్యం చేరాలంటే రేవంత్ కు టిడిపి చాలదన్న ఉద్దేశంతోనే ఆయన పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరిపోయారు.

ఇక కాంగ్రెస్‌లోకి రాగానే రేవంత్ కు అసలు తత్వం బోధపడిందంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రెస్ మీట్ పెట్టాలన్నా.. సవాలక్ష అనుమతులు, సవాలక్ష అడ్డంకులు ఉంటున్నాయి. దీంతో రేవంత్ స్వేచ్ఛ కోల్పోయిన పక్షి మాదిరిగా తయారయ్యారని పార్టీలో చర్చ మొదలైంది. ఒకవేళ ఏదైనా సబ్జెక్టు ఎంచుకుని ప్రెస్ మీట్ పెట్టాలంటే.. అధిష్టానం నుంచి అనుమతి వచ్చే పరిస్థితులు లేవని రేవంత్ సన్నిహితులు వాపోతున్నారు. కాకలు తీరిన నేతలున్న కాంగ్రెస్ పార్టీకి.. చిన్న లీడర్లున్న తెలుగుదేశం పార్టీకి మధ్య తేడా ఆమాత్రం ఉండదా అని కాంగ్రెస్ పెద్ద నేతలు అంటున్నారు. టిడిపిలో ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో అక్కడ మంచి మైలేజ్ తెచ్చుకున్నారు రేవంత్. కానీ.. కాంగ్రెస్ లో అడుగడుగునా కాలు పట్టి గుంజి కింద పడేసే లీడర్ల సంఖ్య చాలా ఉంటుంది అని ఇప్పుడిప్పుడే ఆయనకు అర్థమవుతోందట.

రేవంత్ పార్టీ మారగానే తాను రాష్ట్రమంతా పాదయాత్ర చేస్తానని తన సన్నిహితుల వద్ద చర్చించారు. వారమో.. రెండు వారాలో గడిచిన తర్వాత తనకు పాదయాత్ర చేసే స్వేచ్ఛ రావొచ్చని ఆశించారు. కానీ రెండు నెలలు గడుస్తున్నా.. ఇంకా పాదయాత్రపై రేవంత్‌కు స్పష్టత రాలేదు. అసలు పాదయాత్రకు అనుమతి వస్తుందా రాదా అన్న ఆందోళన కూడా నెలకొంది. కాకలు తీరిన కోమటిరెడ్డి నెలల తరబడి ప్రయత్నాలు చేసినా.. అధిష్టానం పాదయాత్రకు నో చెప్పింది. అయితే పాదయాత్ర ఒక్క రేవంత్ మాత్రమే కాదు, మరో ఇద్దరు నేతలు కూడా చేస్తారన్న ప్రచారం పార్టీలో సాగుతోంది. తాజాగా సీన్ లోకి గద్వాల ఎమ్మెల్యే డికె అరుణ కూడా ఎంటర్ అయ్యారు. తనకు కూడా పాదయాత్ర చేసే వెసులుబాటు ఇవ్వాలని ఆమె అధిష్టానం వద్ద రిక్వెస్టు పెట్టేశారు. ఇప్పటికే రేవంత్, మల్లు బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ ముగ్గురూ పాదయారత చేసే చాన్స్ ఉందంటున్నారు. ఇప్పుడు డికె అరుణ కూడా వచ్చి చేరారు. దీంతో పాదయాత్రలు ప్రహసనంగా మారుతాయా అన్న ఆందోళన రేవంత్ శిబిరంలో నెలకొంది.

శనివారం రేవంత్ అన్న కొడుకు వివాహం హైదరాబాద్ లో జరగనుంది. ఆ పెళ్లి రేవంత్ చేతులమీదుగానే జరిపిస్తున్నారు. (రేవంత్ సోదరుడు మరణించారు) శనివారం వరకు పెళ్లి హడావిడిలో ఉన్నారు కాబట్టి పెళ్లి తర్వాత తన పాదయాత్రతోపాటు మిగతా అన్ని అంశాలపై క్లారిటీ తీసుకునే ప్రయత్నం చేస్తామని అంటున్నారు రేవంత్ సన్నిహితులు. ఇక పార్టీలో చేరి ఇంతకాలమైనా రేవంత్ కు ఏ రకమైన పదవి కూడా రాలేదు. ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి ఇస్తారని ముందుగా ఊహాగానాలు నడిచాయి. కానీ ఇప్పుడప్పుడే ఆ పదవి వస్తుందా లేదా అన్న క్లారిటీ లేదు. ఒకవేళ రేవంత్ కు పదవి ఇస్తే ఆ మేరకు కాంగ్రెస్ పార్టీని డ్యామేజీ చేసేందుకు కొంతమంది కాంగ్రెస్ పెద్ద నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి టిఆర్ఎస్ లో చేరవచ్చన్న ప్రచారం కూడా సాగుతోంది. ఈ తరుణంలో ఇటు రేవంత్ కానీ.. అటు కాంగ్రెస్ అధిష్టానం కానీ.. ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొందని పాలమూరుకు చెందిన ఒక కాంగ్రెస్ సీనియర్ నేత వెల్లడించారు. తొందరపడితే అసలుకే మోసం రావొచ్చు కదా అని ఆయన వ్యాఖ్యానించారు.

మొత్తానికి టిడిపిలో స్వేచ్ఛ అనుభవించిన రేవంత్ కు కాంగ్రెస్ లో కట్టడి చేస్తున్న పరిస్థితులు మాత్రం ఉన్నాయని చెబుతున్నారు.

కాగా కాంగ్రెస్ మోస్ట్ సీనియర్ నేత, సీఎం పీఠంపై అనేక ఆశలు పెట్టుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి వ్యవహారం ఇలానే ఉంది. తెలంగాణ కోసం ఉద్యమించిన వారిలో తొలి వరుసలో నిలిచారు జానా రెడ్డి. అధిష్టానం వద్ద సఖ్యత రానున్న రోజులలో కలసి వచ్చే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ తీర్థం వుచ్చుకోవడంతో బాహుబలి వచ్చాడంటూ మరోమారు అసహనాన్ని బయట పెట్టుకుని పార్టీ శ్రేణులని సైతం ఇబ్బంది పెట్టారు. మరోవైపు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరదామనుకుంటున్న నాగం జనార్ధన్‌రెడ్డికి ముందే షాక్ తగిలినట్లు కనిపిస్తోంది. ఆయన రాకను కొందరు జిల్లా కాంగ్రెస్ నేతలు వ్యతిరేకిస్తున్నారు. నాగంపై రాహుల్‌కు కొందరు నేతలు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ఈ చేరికపై అసంతృాప్తితో రగిలిపోతున్నారట. నాగం పార్టీలో చేరితే... పార్టీకి నష్టమని... ఆయన కేడర్ లేని లీడరని కామెంట్ చేసినట్లు తెలుస్తోంది. ఆయన్ను ఎన్నికల్లో అభ్యర్థిగా నిలిబెడితే... ఓడిపోవడం ఖాయమన్నారు. ఒకవేళ పార్టీలోకి తీసుకుంటే... తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరిం చబోమని దామోదర్ రెడ్డి తేల్చి చెప్పారంటూ వస్తున్న వార్తలు పార్టీ కేడర్‌లో ఆందోళన కలిగిస్తున్నాయి. తాను, డీకే అరుణ, ఎంపీ నంది ఎల్లయ్యలు ఢిల్లీ వెళ్లి... నాగంను తీసుకోవడం వల్ల జరిగే పరిణామాలను రాహుల్‌కు వివ రించామని దామోదర్ అన్నారట. నాగం, జైపాల్ రెడ్డి మధ్య మంచి అవగాహన ఉందని... జైపాల్ రెడ్డి లోక్‌సభకు పోటీ చేయకపోతేనే... నాగంను కాంగ్రెస్‌లోకి తీసుకోవాలని షరతు పెట్టారు. ఆయన్ను జైపాల్ రెడ్డి పార్టీలోకి తెస్తున్నారని... గత ఎన్నికల్లో పోటీ చేసిన నాగం, ఆయన కుమారుడికి కనీసం డిపాజిట్ కూడా రాలేదని గుర్తు చేశారట. నాగం పార్టీలో చేరతారని... ప్రచారం జరగడంతో ముందుగానే కాంగ్రెస్ నేతలు అలర్టయ్యారు. ఆయన చేరికను వ్యతిరేకిస్తున్నారు. మరి నాగం చేరికపై అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది. అలాగే ఈ ఎపిసోడ్ నేతల మధ్య ఉన్న లుకలుకలు బయటపడ్డాయి.మరో ఏడాదిలో ఎన్నికలు ఉన్నాయి. వీటిని అధికార పార్టీ చాలా ప్రతిష్టా త్మకంగా తీసుకుంది. నిన్న మొన్నటి వరకు పట్టించుకోని రైతులను కూడా చేరదీసింది. అదేవిధంగా వివిధ సామాజిక వర్గాలను కూడా టీఆర్ ఎస్ మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. మరి ఈ క్రమంలో కాంగ్రెస్ మరింత దూకుడు పెంచాల్సి న అవసరం ఉందనేదన్నది కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మరి కాంగ్రెస్ బలం ఎలా పెరగనుందో చూడాలి.

చరిత్రలో ఈరోజు

ఫిబ్రవరి 25

2008: క్యూబా అధ్యక్షుడిగా ఫిడెల్ కాస్ట్రో సోదరుడు రాల్ క్యాస్ట్రో ఎన్నిక
1894: అవతార్ మెహెర్ బాబా జననం
1932: సుబ్రతా బోస్, ఎంపీ, జననం.
1948: డానీ డెంజోంగ్ప, సుప్రసిద్ధ భారతీయ చలనచిత్ర నటుడు జననం.
1974: దివ్యభారతి, ఉత్తరాది నుండి తెలుగు పరిశ్రమకు వచ్చిన నటీ మణులలో పేరు తెచ్చుకొన్న నటి, జననం.
1961: శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రముఖ రచయిత మరణం
1995: ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కవి, పాత్రికేయుడు మరణం.
2001: డోనాల్డ్ బ్రాడ్‌మాన్, ఆస్ట్రేలియా క్రికెటర్ మరణం.
2004: బి.నాగిరెడ్డి, తెలుగు సినీనిర్మాత, మరణం.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

20 వ శతాబ్దపు తెలుగు కథకులలో విశిష్టంగా చెప్పుకోదగ్గ రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయన ఏప్రిల్ 23, 1891న జన్మించి, ఫిబ్రవరి 25, 1961న మరణించాడు. భాషలో, భావంలో, తెలుగు నుడికారం ప్రయోగించటంలో ఈయన పేరెన్నిక గన్నవాడు. ఒక పక్క పాత సంప్రదాయాలు వెనక్కి లాగుతూ ఉండగా, పాశ్చాత్య నాగరికత మరొక పక్క ఆకర్షిస్తూ ఉండగా ఆ పాత కొత్తల కలయికని తన రచనలలో ప్రతిభావంతంగా చిత్రించేడీయన. వేదవేదాంగాలు తరతరాలుగా అధ్యయనం చేసే కర్మిష్టులూ, పండితులూ అయిన కుటుంబంలో వుట్టి, సంస్కృతానికి స్వస్తి చెప్పి, తెలుగులో చిన్న కథలని రాయటం ప్రవృత్తిగా ఎన్నుకుని ఆ చిన్న కథకి కావ్యప్రతిపత్తి కలిగించిన సాహిత్య శిల్పి, సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయన ఆత్మకథ పేరు అనుభవాలూ జ్ఞాపకాలూనూ.

బ్రాడ్‌మాన్



ది డాన్ అని సూచించే సర్ డోనాల్డ్ జార్జ్ బ్రాడ్‌మాన్ ఆగష్టు 27, 1908న జన్మించి, ఫిబ్రవరి 25, 2001న మరణించాడు. ఒక ఆస్ట్రేలియా క్రికెటర్, ఇతను అద్భుతమైన సార్వకాలిక బ్యాట్స్‌మన్‌గా పేరు గాంచాడు. బ్రాడ్‌మాన్ కెరీర్ టెస్ట్ బ్యాటింగ్ సగటు 99.94ను గణాంకాల ప్రకారం ఏదైనా ప్రముఖ క్రీడలో సాధించగల అత్యుత్తమ సగటుగా పేర్కొంటారు. బ్రాడ్‌మాన్ చిన్నతనంలో ఒంటరిగా ఒక క్రికెట్ స్టంప్ మరియు ఒక గోల్ఫ్ బంతితో ప్రాక్టీస్ చేసిన కథనాన్ని ఆస్ట్రేలియా జానపదకళలో భాగంగా చెబుతారు. బ్రాడ్‌మాన్ గల్లీ క్రికెట్ నుండి ఆస్ట్రేలియా టెస్ట్ జట్టులో స్థానానికి ఎదగడానికి రెండేళ్లు పట్టింది. అతని 22వ పుట్టినరోజుకు ముందు, అతను అత్యధిక స్కోర్‌తో పలురికార్డులను సృష్టించాడు, వాటిలో కొన్ని ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

బి. నాగిరెడ్డి



బొమ్మిరెడ్డి నాగిరెడ్డి డిసెంబర్ 2, 1912న జన్మించి, ఫిబ్రవరి 25, 2004న మరణించారు. ఆయన తెలుగు సినీనిర్మాత మరియు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత. విజయ సంస్థను స్థాపించి, పాతాళ భైరవి, మాయాబజార్, గుండమ్మకథ, మిస్సమ్మ, అప్పుచేసి పప్పుకూడు, పెళ్లి చేసి చూడు, చంద్రహారం తదితర విజయవంతమైన చిత్రాలను నిర్మించాడు. ఆయన చెన్నై వడపళనిలో విజయా హాస్పిటల్, విజయా హార్ట్ ఫౌండేషన్, విజయా హెల్త్ సెంటర్ స్థాపించాడు. బెంగుళూరులోని ప్రసిద్ధ కంటి అసుపత్రి శంకర నేత్రాలయ కూడా విజయా హాసిటల్ ఆవరణలోనే ప్రారంభమైది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1987లో), పాయ్ అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డు, తమిళనాడు ప్రభుత్వంచే కలైమామణి అవార్డు (1972లో), శ్రీవేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లను ఆయన పొందారు. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా రెండు సార్లు, సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా నాలుగుసార్లు, 1980–83 మధ్యకాలంలో టీటీడీ ట్రస్ట్‌బోర్డ్ అధ్యక్షుడిగా ఆయన నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు కూడా పనిచేశారు.



ఐ లవ్ ఇండియన్ మీడియా: ట్రంప్ జూనియర్

న్యూఢిల్లీ: అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొడుకు ట్రంప్ జూనియర్ దేశీయ మీడియాపై పొగడ్తల వర్షం కురిపించారు. భారత మీడియాను తాను చాలా ప్రేమిస్తానని... కఠినంగా, క్రూరంగా ఉండే అమెరికా మీడియతో పోల్చుకుంటే, భారత మీడియా చాలా మృదువుగా ఉంటుందన్నారు. ఒక్కడ జరుగుతున్న గ్లోబల్ బిజినెస్ సమిట్‌లో ట్రంప్ జూనియర్ పాల్గొన్నారు. భారత మీడియాను ప్రేమిస్తున్నట్టు చెబుతున్న భారత చరిత్రలో మొదటి వ్యక్తిని నేనే. వీరు చాలా మృాఎదువుగా ఉంటారు అని తెలిపారు. ఎన్ని ఆటంకాలు, ఆటుపోట్లు వచ్చినప్పటికీ భారతీయుల ముఖంపై చిరునవ్వు చెదరదని చెప్పారు. నేను తొలిసారి ఇక్కడికి రాలేదని, కానీ 10 ఏళ్లతో తర్వాత భారత పర్యటనకు వచ్చినట్టు తెలిపారు. రాజకీయాలపై మాట్లాడటానికి నిరాకరించిన జూనియర్ ట్రంప్, తాను ఇక్కడి ఒక వ్యాపారవేత్తలాగే వచ్చానన్నారు. ఇండో-పసిఫిక్ సంబంధాలు : కోఆపరేషన్‌పై కొత్త శకం అనే అంశంపై మాట్లాడతారని ముందస్తుగా షెడ్యూల్ సన్నద్ధం చేయగా.. చివరి నిమిషంలో జూనియర్ ట్రంప్ తన ప్రసంగాన్ని మార్చేశారు. భారత్‌లో వ్యాపార పరిస్థితుల మార్పులపై ఆయన ప్రసంగించారు. గత కొన్నేళ్లుగా మంచి మంచి డీల్స్ కుదిరాయని, ప్రస్తుతం 10 టైమ్స్ కంటే ఎక్కువగా పెట్టుబడి పెట్టే సామర్థ్యం వచ్చిందన్నారు. ట్రంప్ జూనియర్ తన వ్యాపారానికి సంబంధించిన పనుల నిమిత్తం భారత్‌లో పర్యటిస్తున్నారు. ట్రంప్ టవర్స్ పేరిట ట్రంప్ జూనియర్ ఇక్కడ తన వ్యాపారాలను కొనసాగిస్తున్నారు.

ఏడేళ్లుగా మోసాన్ని ఎందుకు గుర్తించలేదు?

● పీఎన్‌బీ స్కామ్‌పై స్పందించిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ● బ్యాంకింగ్ రంగంలో నిఘా వైఫల్యం ● గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్న జైట్లీ ● రుణ ఎగవేతదారులను క్షమించబోమని హెచ్చరిక ● ఓబీసీకి రూ. 390 కోట్లకు టోపీ ె ట్టిన ఆభరణాల సంస్థ ● విదేశీ క్రెడిట్ లెటర్స్ సాయంతో రుణాలు ● పది నెలలుగా ఆచూకీ లేని కం ె నీ యజమానులు ● ఓబీసీ ఫిర్యాదుతో కేసు దాఖలు చేసిన సీబీఐ

న్యూఢిల్లీ: ఏడేళ్ల నుంచి ఒక బ్యాంకు శాఖ్లో మోసం జరుగుతుంటే ఎందుకని గుర్తించలేకపోయారని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) అధికారులను ప్రశ్నించారు. రూ.11,400కోట్ల కుంభకోణం గురించి ఆయన మరోసారి మాట్లాడారు. పీఎన్‌బీలో జరిగిన మోసాన్ని గుర్తించడంలో బ్యాంకింగ్ నియంత్రణదారులు విఫలమయ్యారని ఆయన మండిపడ్డారు.

ఈటీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ పీఎన్‌బీ కుంభకోణం గురించి ప్రస్తావించారు. బ్యాంక్‌లో మోసం జరుగుతుంటే కనీసం ఒక్క ఉద్యోగి కూడా హెచ్చరించలేదు. ఆడిటర్లు మొక్కుబడిగా తమ విధులు నిర్వర్తించినట్లు తెలుస్తోంది. బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్ దీనిపై దృాఎష్టి సారించకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది అని జైట్లీ అభిప్రాయపడ్డారు. ఏడేళ్లుగా బ్యాంక్‌లో మోసం జరుగుతుంటే.. ఆడిటర్లు ఎందుకని గుర్తించలేకపోయారని ఆయన ప్రశ్నించారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వాళ్లను ప్రభుత్వం ఎంతమాత్రం విడిచిపెట్టబోదని.. వారిని పట్టుకొని కఠినంగా శిక్షిస్తుందని మరోసారి పునరుద్ఘాటించారు. మోసాలు జరగకుండా ఎప్పటికప్పుడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

బ్యాంకులకు రుణాలు ఎగవేసే వారిని కఠినంగా శిక్షించేందుకు అవసరమైతే చట్టంలో కొన్ని మార్పులు చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ దాదాపు రూ.11,400కోట్ల మేర మోసానికి పాల్పడిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా సంచలనం సృాఎష్టించిన ఈ కేసును సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారిస్తున్నారు.

ఆ బ్యాంకులను ప్రయివేటీకరించం



పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ 11,400 కోట్ల కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) బ్యాంకులపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పీఎస్‌యూ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాజకీయంగా ఈ చర్య ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న జైట్లీ పీఎన్‌బీ స్కాం అనంతరం బ్యాంకుల ప్రైవేటీకరణపై ప్రజల్లో చర్చ మొదలైందని చెప్పుకొచ్చారు. బ్యాంకుల ప్రైవేటీకరణపై విస్తృాఎత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమని, చట్ట సవరణలు (బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్) చేపట్టాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. దీనికి రాజకీయ పార్టీలపై ఒకే వైఖరి అవసరమని, పీఎస్‌యూ బ్యాంకుల ప్రైవేటకీరణకు రాజకీయంగా ఏకాభిప్రాయం కుదిరేపని కాదని అన్నారు. ఇది సవాల్‌తో కూడిన సంక్లిష్ట నిర్ణయమని జైట్లీ అన్నారు.

కాగా, వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.11,400 కోట్లకు మోసం చేసిన తరహాలోనే ఢిల్లీకి చెందిన ఓ బంగారం వర్తకుడు ఓరియెంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్ (ఓబీసీ) కు రూ.390 కోట్ల మేర టోపీ పెట్టాడు. దీనిపై ఓబీసీ ఆరు నెలల క్రితమే ఫిర్యాదు చేసినప్పటికీ సీబీఐ కేసు నమోదు చేయలేదు. ఇప్పుడు నీరవ్ మోదీ షాక్ తో వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టింది. ఢిల్లీలోని కరోల్ భాగ్ ప్రాంతానికి చెందిన ద్వారకాదాస్ సేత్ ఇంటర్నేషనల్ సంస్థ వజ్రాభరణాలు, బంగారు, వెండి ఆభరణాల తయారీ, విక్రయంలో ఉంది. ఓబీసీ గ్రేటర్ కైలాష్-2 శాఖ నుంచి ఈ సంస్థ విదేశీ క్రెడిట్ లెటర్స్ సాయంతో రూ.390 కోట్ల మేర రుణాలు పొందింది. ఈ కంపెనీని సభ్యసేత్, రీతాసేత్, క్రిషన్ కుమార్ సింగ్, రవి కుమార్ సింగ్ నిర్వహిస్తున్నారు. గత పది నెలలుగా వీరి ఆచూకీ లేదు. వారు బ్యాంకుకు ఇచ్చిన చిరునామాల్లో ఉండడం లేదు. దీంతో ఓబీసీ గతేడాది ఆగస్ట్ 16న సీబీఐని సంప్రదించింది. దీనిపై సీబీఐ శుక్రవారమే కేసు నమోదు చేయడం గమనార్హం.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మోసాలకు సంబంధించి మరిన్ని కేసులు వెలుగులో వస్తున్నాయి. ఢిల్లీకి చెందిన వజ్రాల వ్యాపారి బుట్టలో మరో ప్రభుత్వ రంగ బ్యాంకు పడటం పలు ప్రశ్నల్ని రేకెత్తిస్తోంది. ఇటీవల నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ వేల కోట్ల కుంభకోణం తాలూకు ప్రకంపనల వేడి ఇంకా చల్లాకరముందే మరో డైమండ్ వ్యాపారిపై సీబీఐ శుక్రవారం కేసు నమోదు చేసింది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ) రూ. 389 కోట్ల మేర మనీ లాండరింగ్‌కు పాల్పడ్డాడన్న ఆరోపణలపై సంస్థపైనా, డైరెక్టర్లపైనా కేసు నమోదైంది.

ఈ విషయాన్ని ఆలస్యంగా గమనించిన బ్యాంకు సీబీఐకు ఫిర్యాదు చేసింది. దీంతో ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పై సీబీఐ కేసు నమోదు చేసింది. డైమండ్ వ్యాపారి నిరవ్ మోడీ, మెహల్ చోక్సిల తరహాలోనే ఓబీసీలో 2007-2012 మధ్య కాలంలో ద్వారకా దాస్ రూ.389.85 కోట్లు మోసానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో సంస్థలోని మొత్తం డైరెక్టర్లు సభా సేత్, రీటా సేథ్, కృాఎష్ణ కుమార్ సింగ్, రవి సింగ్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వీరితోపాటు ద్వారకా దాస్ సేథ్ సెజ్ ఇన్‌కార్పొరేషన్ అనే మరో సంస్థను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. కంపెనీలెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ల ద్వారానే మోసానికి పాల్పడినట్టు బ్యాంకు ఆరోపించింది. ఈ సంస్థ కూడా ఉనికిలో లేని సంస్థలపేర్లతో వ్యాపార లావాదేవీలు చేసినట్టు చెప్పింది. కాగా బ్యాంకు ఆరు నెలల క్రితమే సీబీఐకి ఫిర్యాదు చేయడం గమనార్హం.

నీరవ్ మోడీ ఫామ్ హౌస్ సీజ్



న్యూఢిల్లీ: పీఎన్‌బీ మెగాస్కాంలో ఈడీ దాడుల పరంపర కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు నీరవ్‌మోదీకి చెందిన విలువైన పలు స్థిర ఆస్తులను శనివారం ఈడీ అధికారులు సీజ్ చేశారు. ముఖ్యంగా ఈ స్కాం వెలుగులోవచ్చిన తరువాత వార్తల్లో నిలిచిన మోదీ విలాసవంతమైన ఫాం హౌస్‌ను ఈడీ స్వాధీనం చేసుకుంది. వీటితోపాటు ముంబయిలో ఆరు నివాస, పది కార్యాలయాలు, పూణెలో రెండు ఫ్లాట్లను కూడా ఎటాచ్ చేసింది.

మనీ లాండరింగ్ చట్టంకింద మోదీ, ఆయన కంపెనీ నియంత్రణలో ఉన్న 21 స్థిరాస్తులను ఈడీ అధికారులు ఎటాచ్ చేశారు. అలీబాగ్‌లో ఫాం హౌస్, సోలార్ పవర్ ప్లాంట్, అహ్మద్ నగర్‌లోని 135 ఎకరాల భూమి, ముంబై, పూణేలోని నివాస, కార్యాలయాల ఆస్తులు ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ. 523.72 కోట్లుగా ఈడీ తేల్చింది. కాగా అలీబాగ్‌లోని ఫాంహౌస్‌ను సీబీఐ ఇప్పటికే సీల్ చేయగా, తాజాగా దీన్ని ఈడీ ఎటాచ్ చేసింది. అలాగే మోదీకి చెందిన విలువైన తొమ్మిదికార్లను, దాదావు 10వేల ఖరీదైన విదేశీ వాచ్‌లను ఈడీ స్వాధీనం చేసుకుంది.

బ్యాంకుల్లో మోసాలు ఓ రకంగా మంచికే

● టాప్ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్ ఝున్ వాలా ● ప్రభుత్వ రంగ సంస్థల్లో పెరుగుతున్న వ్యవస్థీకృత నేరాలు ● ప్రైవేటీకరణ కోసం ప్రజల నుంచి పెరిగే డిమాండ్ ● 3 లేదా 4 బ్యాంకులు చాలన్న రాకేష్

న్యూఢిల్లీ: బ్యాంకుల్లో వెలుగు చూస్తున్న మోసాలు దీర్ఘకాలంలో దేశానికి మేలు చేసేవేనని భారత టాప్ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్ ఝున్ వాలా అభిప్రాయపడ్డాడు. ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యవస్థీకృత నేరాలు పెరిగిపోయాయని, ఇటువంటి నేరాలు, మోసాలు బయటపడటం వల్ల ప్రైవేటీకరణ చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తుందని ఆయన అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రారని, దీనికి ఎయిర్ ఇండియానే ఉదాహరణని అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులన్నింటినీ విలీనం చేసి, కేవలం 3 లేదా 4 బ్యాంకులను మాత్రమే ఉంచాలని రాకేష్ సూచించారు.


పీఎస్యూ బ్యాంకులకు మూలధనాన్ని ప్రభుత్వం అందించడం వల్ల దీర్ఘకాలంలో అనుకూల ప్రభావాలకన్నా, ప్రతికూల ప్రభావమే అధికమని అభిప్రాయపడ్డ ఆయన, బ్యాంకులకు ఇలా నిధులు ఇస్తూ వెళితే, కొంతకాలం తరువాత మౌలిక వసతుల కల్పనకు నిధులు కరవవుతాయని అన్నారు. బ్యాంకుల్లో కుంభకోణాలు వెలుగులోకి రాకుంటే, ఇటువంటి స్కామ్‌లు మరింతగా పెరుగుతూనే ఉంటాయని ఝున్ ఝున్ వాలా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం బ్యాంకుల భవిష్యత్తు బాగుపడే సమయం వచ్చిందని తాను భావిస్తున్నానని అన్నారు. వడ్డీరేట్లు ఇప్పటికిప్పుడు మారే అవకాశాలు లేవనే చెప్పవచ్చని, యూఎస్ ఫెడ్ తీసుకునే నిర్ణయాల వల్ల ద్రవ్యోల్బణం ప్రభావితం కాబోదని చెప్పుకొచ్చారు.

ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీని ఓ బఫే విందుతో అభివర్ణించిన ఆయన, బఫేలో చాలా రకాలుంటాయని, వాటిల్లో నచ్చినది ఎంచుకుని తినవచ్చని, అదే విధంగా స్టాక్ మార్కెట్లో ఎన్నో కంపెనీలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని, ఎటొచ్చీ వాటిని ఎంచుకోవడంలోనే నైపుణ్యత దాగుందని అన్నారు. ఇతరులు తమకు ఎందుకులే అని వదిలేసిన రంగాల్లో అవకాశాలను వెతుక్కుంటూ లాభాలను సంపాదించేవాడే అసలు సిసలైన ఎంటర్ ప్రెన్యూర్ గా రాకేష్ అభివర్ణించారు.





మరిన్ని ఉద్యోగాలు రానున్నాయి: స్టీ ె న్ వొజ్నిక్



న్యూఢిల్లీ: కృత్రిమ మేధతో పెద్దసంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని యాపిల్ సహవ్యవస్థాపకులు స్టీఫెన్ వొజ్నిక్ అన్నారు. ఈ టెక్నాలజీతో ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు లేదని భరోసా ఇచ్చారు. కృత్రిమ మేధపై పనిచేసేందుకు మనకు మరింత మంది ఉద్యోగులు అవసరమవుతారని అన్నారు. రాబోయే తరానికి ఎంచుకునేందుకు భిన్న ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయన్నారు. తాను మెషీన్లను డిజైన్ చేసినప్పటికీ వాటిని మార్కెట్ చేసేందుకు స్టీవ్ జాబ్స్ లాంటి ఎంట్రెప్రెన్యూర్ అవసరమని ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్, ప్రోగ్రామర్, ఫిలాంత్రోపిస్ట్ వొజ్నిక్ యాపిల్ తొలిరోజులను గుర్తుచేసుకున్నారు. జాబ్స్‌తో తన అనుబంధాన్ని ప్రస్తావిస్తూ..అతనితో తానెప్పుడూ వాదనకు దిగలేదని, మా ఇద్దరి మధ్య కొన్నివిషయాల్లో బిన్నాభిప్రాయాలున్నా..జాబ్స్ తన పట్ల చాలా గౌరవంగా వ్యవహరించే వాడన్నారు. తన ఫేవరేట్ గాడ్జెట్ యాపిల్ వాచ్ అని చెప్పుకొచ్చారు.

ఒక్క ట్వీట్‌తో స్నాప్‌చాట్‌కు రూ. 8,300 కోట్ల నష్టం

న్యూఢిల్లీ: ట్వీటా మజాకా... ఒకే ఒక్క ట్వీట్ తో భారీగా నష్టం వాటిల్లుతుందా...? అవును ఇప్పుడు ఇదే జరిగింది. స్నాప్ చాట్ మార్కెట్ విలువను 1.3 బిలియన్ డాలర్ల మేర కరిగించేసింది. ఇంతకీ ఈ ట్వీట్ చేసింది ఎవరంటే రియాలిటీ స్టార్ కైలీ జెన్నర్. ఇక మీదట తాను స్నాప్ చాట్ ను వాడనంటూ జెన్నర్ ట్వీట్ చేసింది. గురువారం ఈ ట్వీట్ చేయగా స్నాన్ చాట్ పేరెంట్ కంపెనీ స్నాప్ ఐఎన్ సీ మార్కెట్ విలువ 1.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,300 కోట్లు) పడిపోయింది. స్నాప్ ఐఎన్ సీ షేరు ధర ఆరు శాతానికి పైగా పతనమైంది. అయితే, తాను ఇప్పటికీ స్నాప్ ను ప్రేమిస్తున్నట్టు ఆమె తర్వాత మరో ట్వీట్ చేశారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కైలీ జెన్నర్ కు సామాజిక మాధ్యమాల్లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఫోటో షేరింగ్ ప్లాట్ ఫామ్ అయిన స్నాప్ చాట్ 2017 డిసెంబర్ క్వార్టర్లో అమెరికా మార్కెట్లో ఫేస్ బుక్ కంటే ఎక్కువ మందిని ఆకర్షించింది.

భారత్‌లో 5జీ ట్రయల్ సక్సెస్



● సెకనుకు 3జీబీ డేటా వేగం ● టెలికం రంగంలో సరికొత్త అధ్యాయం ● చైనా మొబైల్ మేకర్ హువేయితో చేతులు కలిపిన ఎయిర్‌టెల్ ● మనేసర్‌లో నిర్వహించిన 5జీ నెట్‌వర్క్ ట్రయల్ విజయవంతం ● నెట్‌వర్క్ అభివృద్ధిపై దృష్టి: ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్, చైనా టెలికం ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్ సంస్థ హువేయి కలిసి భారత్‌లో నిర్వహించిన 5 జీ నెట్‌వర్క్ ట్రయల్ విజయవంతమైంది. ఈ మేరకు ఈ రెండు సంస్థలు శుక్రవారం సంయుక్తంగా వెల్లడించాయి. 5జీ ట్రయల్ విజయవంతం అయిందని, సెకనుకు 3జీబీ డేటా వేగాన్ని అందుకున్నట్టు పేర్కొన్నాయి. 5జీ కోసం ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) జపాన్‌కు చెందిన ఎన్‌టీటీ ఏటీ, ఆ సంస్థ భారత భాగస్వామి విర్గో కార్పొరేషన్‌తో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. అందులోనే ఎయిర్‌టెల్ 5జీ నెట్‌వర్క్‌ను పరీక్షించి విజయం సాధించినట్టు పేర్కొనడం గమనార్హం. గురుగ్రామ్‌లోని మనేసర్‌లో ఉన్న ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ట్రయల్ నిర్వహించినట్టు ఎయిర్‌టెల్ పేర్కొంది. టెస్ట్ విజయవంతం కావడంతో త్వరలోనే భారత్‌లో 5జీ ఈకో సిస్టం అభివృద్ధికి చర్యలు ప్రారంభిస్తామని భారతీ ఎయిర్‌టెల్ డైరెక్టర్ (నెట్‌వర్క్స్) అభయ్ సావర్గోవంకర్ తెలిపారు.

నీరవ్ బాటలో మరో వజ్రాల కంపెనీ



న్యూఢిల్లీ: దేశంలో మరో వజ్రాల కంపెనీ భారీ మోసం బయటపడింది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన మామ ఛోక్సీలు పంజాబ్‌నేషనల్ బ్యాంకులో దాదావు రూ.11,400 కోట్ల భారీ మోసాలకు పాల్పడిన విషయం విదితమే. అదే తరహాలో ఢిల్లీకి చెందిన ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వజ్రాల ఎగుమతి కంపెనీ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో రూ.389.85కోట్ల భారీ మోసానికి పాల్పడ్డట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. అనంతరం సీబీఐ ఈ కంపెనీపై కేసు నమోదు చేసింది. ఓరియంటల్ బ్యాంకు ఈ కంపెనీపై ఆర్నెళ్ల క్రితమే సీబీఐకి ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం సీబీఐ.. కంపెనీకి చెందిన డైరెక్టర్లు సభ్య సేథ్, రీటా సేథ్, కృాఎష్ణ కుమార్ సింగ్, రవి సింగ్‌లపై కేసు నమోదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ సెజ్ ఇన్‌కార్పొరేషన్ పేరుతో ఉన్న మరో కంపెనీపైనా సీబీఐ కేసు పెట్టింది. ఈ కంపెనీ ఓరియంటల్ బ్యాంకు నుంచి 2007 నుంచి 2012 సంవత్సరాల మధ్య పలుమార్లు రుణం పొందింది. అది మొత్తం రూ.389కోట్లు బకాయి పడింది. ఈ కంపెనీ కూడా లెటర్స్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓయూ) ద్వారా అక్రమాలకు పాల్పడ్డట్లు గుర్తించిన ఓబీసీ సీబీఐని ఆశ్రయించింది.

రేపటి నుంచి వరల్డ్ మొబైల్ కాంగ్రెస్

● బార్సిలోనాలో 26న మొదలు ● మార్చి 1వరకు కొనసాగనున్న సదస్సు ● పలు కొత్త స్మార్ట్‌ఫోన్ల ఆవిష్కరణ ● ప్రపంచవ్యాప్త కంపెనీలన్నీ ఒక వేదికపైకి




బార్సిలోనా: మొబైల్ పరిశ్రమకు చెందిన మహా మహా కంపెనీలన్నీ ఒకే చోటకు చేరే మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ సదస్సు ఈ నెల 26న స్పెయిన్ లోని బార్సెలోనాలో మొదలు కాబోతోంది. మార్చి 1 వరకు ఇది కొనసాగుతుంది. ఈ విడత టాప్ కంపెనీల నుంచి పెద్ద ఎత్తున ఆవిష్కరణలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ సదస్సులో భాగంగా ఆవిష్కరణలు జరుగుతాయన్న అంచనాలు ఈ కింది మోడళ్లపైనే వున్నాయి. శామ్ సంగ్ గెలాక్సీ ఎస్9 మోడల్, ఎస్ 9 , నోకియా 9, నోకియా 8ప్రో, నోకియా 7ప్లస్, నోకియా 1, సోనీ ఎక్స్ పీరియా ఎక్స్ జెడ్2, ఎక్స్ జెడ్2 కాంపాక్ట్, ఆసుస్ జెన్ ఫోన్ 5, జెన్ ఫోన్ 5 లైట్, ఎల్జీ కే10, కె8 మోడళ్లను ఈ సదస్సులో ప్రదర్శించొచ్చు.

ఐఫోన్‌ఎక్స్‌పై భారీ తగ్గింపు

ముంబై: యాపిల్ తయారు చేసే గాడ్జెట్స్ అంటే ప్రతీ ఒక్కరికీ మక్కువే. యాపిల్ ఐఫోన్ ఎక్స్ విడుదల చేసిన దగ్గరి నుంచి అందరూ దాని గురించే మాట్లాడుకుంటున్నారు. ఎందుకంటే దీనిలో ఉండే ఫీచర్లు అలాంటివి. అంతేకాదు ఈ ఫోన్‌ధర రూ.1.02లక్షలు (256జీబీ వేరియంట్). ఇంత భారీ ధరకు ఈ ఫోన్‌ను కొనుగోలు చేయలంటే ఎవరైనా ఒక్కసారి ఆలోచిస్తారు. అయితే ఇక అలాంటి ఆలోచన అక్కర్లేదు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా రూ.20వేల డిస్కౌంట్‌తో ఐఫోన్ ఎక్స్‌ను మీ సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తోంది యాపిల్. మీరు ఇప్పటికే యాపిల్ ఫోన్‌ను వినియోగిస్తుంటే కంపెనీకి చెందిన ఎంపిక చేసిన ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఎక్స్ఛేంజ్ కింద ఆ ఫోన్ ఇచ్చేసి రూ.20వేల వరకూ డిస్కౌంట్‌పై ఐఫోన్ ఎక్స్‌ను సొంతం చేసుకోవచ్చు. దీనితోపాటు ఆర్నెల్ల పాటు ఉచిత స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా యాపిల్ అందిస్తోంది. దీనితో పాటు ఐసీఐసీఐ బ్యాంకు క్రెడిట్ కార్డును ఉపయోగించి ఈఎంఐలపై రూ.10వేల వరకూ అదనపు క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చు. కేవలం యాపిల్ ఐఫోన్ ఎక్స్ఛేంజ్ కింద మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. క్యాష్ బ్యాక్‌ను 90 పనిదినాల్లో పొందవచ్చు. ఇది పరిమితకాల ఆఫర్. ముందస్తు ప్రకటన లేకుండా ఆఫర్‌ను ఎప్పుడైనా వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. కేవలం ఎంపిక చేసిన ఐఫోన్‌లపై మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఐఫోన్6ఎస్, ఐఫోన్6ఎస్ ప్లస్, ఐఫోన్ 7, ఐఫోన్ 7ప్లస్, ఐఫోన్ 8, ఐఫోన్ 8ప్లస్‌లతో పాటు, ఎంపిక చేసిన ఆండ్రాయిడ్ డివైజ్‌లపైనా వర్తిస్తుంది. ఫోన్‌కు ఎలాంటి డ్యామేజ్ ఉన్నా ఈ ఆఫర్ వర్తించదు. ఎంపిక చేయబడిన యాపిల్ ప్రీమియమ్ రీసెల్లర్ స్టోర్స్‌లోనే ఈ అవకాశం ఉంది.




త్వరలో సిమ్ కార్డు అవసరం లేని ఫోన్



న్యూఢిల్లీ: సిమ్ కార్డులు అవసరం లేని ఫోన్ కూడా మార్కెట్‌లోకి రాబోతుందట. ఆర్మ్ టెక్నాలజీ సంస్థ ఈ వినూత్నాన్ని ఆవిష్కరించబోతుంది. మొబై ల్ ఫోన్లలో వాడే సిమ్‌కి బదులుగా ఐసిమ్ కార్డుని(ఇంటిగ్రేటెడ్ సిమ్ కార్డును) ఆర్మ్ సంస్థ, ఎండ బ్ల్యూసీ 2018లో ప్రదర్శించబోతుంది. ఈ సిమ్ కార్డు, ప్రాసెసర్‌తోనే చిప్‌సెట్‌లో ఇంటిగ్రేటెడ్ పార్ట్‌గా ఉండబోతుంది. ప్రాసెసర్ చిప్ సెట్‌లోనే ఇంటగ్రేటెడ్ అయ్యే ఐసిమ్ నెంబర్‌ను, ఫోన్ కొనుగోలు చేసిన తర్వాత ఐసిమ్ నెంబర్ నెట్‌వర్క్ కంపెనీలకు చెబితే, వాళ్లు దానికి మొబైల్ నెంబర్‌ను అను సంధానిస్తారు. దీంతో సిమ్ కార్డుకు కేటాయించే అదనపు స్థలం మిగిలి పోతుంది. ఈ కొత్త ఐసిమ్ కార్డు చదరపు మిల్లీమీటర్ కంటే తక్కు వ స్థలాన్ని తీసుకుంటుంది. ఈ విధానం వల్ల ప్రస్తుతం ఉన్న సిమ్ కార్డ్ అవస రం ఉండదు. నెట్‌వర్క్ కంపెనీలకు కూడా సిమ్ కార్డ్ ఖర్చు తగ్గిపోతుంది. మరికొన్ని ఆప్షన్స్‌తో కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావటానికి మొబైల్ తయారీ కంపెనీలకు అవకాశం కూడా ఉంటుందని తెలుస్తోంది.

గూగుల్‌పై కోర్టుకెక్కిన మాజీ ఉద్యోగి



శాన్‌ఫ్రాన్సిస్కో: గూగుల్‌పై మరో మాజీ ఉద్యోగి, ట్రాన్స్ జెండర్ అయిన టిమ్ షెవలీయర్ కోర్టుకెక్కాడు. తనను ఆన్ లైన్ లో వేధింపులకు గురిచేశారంటూ బుధవారం శాన్ ఫ్రాన్సిస్కో కోర్టులో పిటిషన్ వేశాడు. ప్రధానంగా డైవర్సిటీ అంశాలను లేవనెత్తాడు. పని ప్రదేశంలో భిన్నత్వాన్ని ప్రోత్సహించడమే డైవర్సిటీ. గూగుల్ పై ఇటీవలే జేమ్స్ డామోర్ అనే మాజీ ఉద్యోగి సైతం దావా వేసిన విషయం గమనార్హం. తెల్లజాతి సంప్రదాయ వాదుల కార్పొరేట్ సంస్కృతి గూగుల్ లో నడుస్తోందని అతని ఆరోపణ. దీనిపై గూగుల్ ఓ ప్రకటన విడుదల చేసింది. జాతి లేదా లింగత్వానికి సంబంధించి హానికారక విధానాలను ప్రోత్సహించబోమని, అందుకే షెవలీయర్ ను తొలగించాలని నిర్ణయించినట్టు గూగుల్ పేర్కొంది.

కారకులను గుర్తించండి: సెబీ ఆదేశం



న్యూఢిల్లీ: త్రైమాసిక ఫలితాల లీకుల ఘటనకు సంబంధించి.. సూత్రధారులను గుర్తించాల్సిందిగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. బ్యాంక్‌లోని వ్యక్తులే ఈ పని చేసి ఉంటారని సెబీ ప్రాథమికంగా నిర్ధారించింది. ఇందుకు సంబంధించి బ్యాంక్ అధికారులతో పాటు వ్యక్తులను సైతం గుర్తించాలని సూచించింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పలు కంపెనీల త్రైమాసిక ఫలితాలు అధికారికంగా విడుదల కాక ముందే.. వాట్సాప్‌లో లీకైన విషయం తెలిసిందే. అన్ని విభా గాలను బలోపేతం చేయాలని, భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుం డా జాగ్రత్త వహించాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు సెబీ ఆదేశించింది. ప్రస్తుత వ్యవస్థలు, అవి ఏ విధంగా బలోపేతం కావొచ్చు, ఇటువంటి వ్యవస్థలను పర్యవేక్షించే వ్యక్తులను సంబంధించిన వివరాలతో కూడిన నివేదిక సమర్పించాల్సిందిగా సైతం సెబీ బ్యాంక్‌ను ఆదేశించింది.

మైక్రోసాఫ్ట్ నుంచి కొత్త సర్‌ఫేస్ ప్రొ విడుదల

న్యూఢిల్లీ : మైక్రోసాఫ్ట్ తన ఐదో తరం సర్‌ఫేస్ ప్రొ 2 ఇన్ 1 ను లాంచ్ చేసింది. ఈ డివైజ్ ప్రారంభ ధర 64,999 రూపాయలుగా కంపెనీ నిర్ణయించింది. మైక్రోసాఫ్ట్ స్టోర్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ క్రోమా, విజయ్ సేల్స్, ఇతర అధికారిక స్టోర్లలో అందుబాటులోకి వస్తున్నట్టు కంపెనీ పేర్కొంది. సర్‌ఫేస్ ప్రొ 4కు సక్ససర్‌గా సర్‌ఫేస్ ప్రొ 2-ఇన్-1ను కంపెనీ లాంచ్ చేసింది

రష్యాతో కలసి సిరియా అధ్యక్షుడు యుద్ధ నేరాలకు పాల్పడుతున్నారు

● అమెరికా ఆరోపణలు ● బషర్ అల్ అసద్ యుద్ధ నేరస్థుడు ● సొంత ప్రజలపైనే వైమానిక దాడులకు పాల్పడుతున్నారు ● సిరియాలో పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం

వాషింగ్టన్ : రష్యా సహకారంతో సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాడని అమెరికా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుగుబాటుదారుల చేతుల్లో ఉన్న తూర్పు గౌటా ప్రాంతాన్ని వశపర్చుకునేందుకు రష్యా సహకారంతో సిరియా సైన్యం వైమానిక దాడులకు పాల్పడుతోంది. దీంతో గత ఐదు రోజుల్లోనే 403 మంది సామాన్యులు ప్రాణాలు విడువగా, వారిలో 95 మంది అభం శుభం తెలియని చిన్నారులు ఉండడం కలచివేస్తోంది. ఈ నేపథ్యంలో స్పందించిన అమెరికా సిరియా అధ్యక్షునిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సొంత ప్రజలనే బషర్ అల్ అసద్ చంపుకొంటున్నాడని ఆరోపించింది. తిరుగుబాటుదారులపై దాడుల పేరిట సామాన్య ప్రజానీకాన్ని బలి తీసుకుంటున్నాడని మండిపడింది. అసద్‌ను యుద్ధ నేరస్థుడిగా అభివర్ణించిన అమెరికా సిరియాలోని పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలియజేసింది.



హైదరాబాద్‌లో మరో జాతీయ సదస్సు

● 26, 27 తేదీల్లో ఇ-పరిపాలనపై హెచ్ఐసీసీలో సదస్సు
● కేంద్ర మంత్రి సుజనాచౌదరి ప్రారంభం
● రాష్ట్ర ఐటి మంత్రి కేటీఆర్ హాజరు





హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః భారత ప్రభుత్వ పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎఆర్ పిజి)భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక విజ్ఞాన మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం కలిసి ఇ-పరిపాలన పై 21వ జాతీయ సదస్సును ఈనెల 26,27న హెచ్ఐసీసీలో నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశం ప్రారంభ సదస్సు కు తెలంగాణ ఐటి, పురపాలన, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు,మైనింగ్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామా రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక విజ్ఞానశాఖ సహాయ మంత్రి వై.సుజనా చౌదరి ప్రారంభ సదస్సుకు సభాధ్యక్షత వహించనున్నారు.తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి ప్రారంభ సదస్సులో ప్రసంగిస్తారు. కేంద్ర వినియోగదారు వ్యవహారాలు, ఆహారం ప్రజా పంపిణీ వాణిజ్యం పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ సి.ఆర్. చౌదరిహాజరుకానున్నారు. కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎఆర్ పిజి) కార్యదర్శి కె.వి. ఇయాపెన్ ప్రారంభోపన్యాసం చేస్తారు. యుఐడిఎఐ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అజయ్ భూషణ్ పాండే కీలకోపన్యాసం చేయనున్నారు. ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ ప్రకాశ్ సాహనీ ఈ సదస్సులో మరొక ముఖ్య వక్తగా ఉంటారు. అభివృద్ధి ని వేగవంతం చేయడంలో సాంకేతిక విజ్ఞానంపై విస్తృతస్థాయిలో చర్చించనున్నారు. ప్రారంభ సదస్సు కు తరువాయిగా సమావేశం మొదటి రోజున మూడు సర్వ సభ్య సదస్సులు కూడా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఇ-పరిపాలన ను అజమాయిషీ చేయడం, ఇ-పరిపాలన సార్వత్రీకరణ, ఇ-పరిపాలన తాలూకు మంచి పద్ధతులు/ ఉత్తమ పద్ధతులు, ఎమర్జింగ్ టెక్నాలజీస్ ల వంటి అంశాలపైన చర్చలు జరగనున్నాయి. సినర్జైసింగ్ రోల్ ఆఫ్ నేషనల్ అండ్ స్టేట్ గవర్నమెంట్ అనే అంశం ముగింపు సదస్సులో చర్చించనున్నారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ (స్వతంత్ర హోదా) సహాయ మంత్రి, ప్రధాన మంత్రి కార్యాలయ వ్యవహారాలు, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు శక్తి విభాగం, అంతరిక్ష విభాగం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఫిబ్రవరి 27వ తేదీన 2018 జాతీయ ఇ- పరిపాలన పురస్కారాలను ప్రధానం చేయనున్నారు. ఈ అవార్డులు మొత్తం 8 కేటగిరీలలో ఇ- పరిపాలన తాలూకు అనేక అంశాలకు సంబంధించి .. ప్రతి ఒక్క కేటగిరీ లోనూ స్వర్ణ పురస్కారం, రజత పురస్కారాలు అందజేయనున్నారు. ఈ అవార్డులను గవర్నమెంట్ ప్రాసెస్ రి- ఇంజినీరింగ్ లోను, పౌర ప్రధానమైన సేవల అంద జేత లోను, ప్రభుత్వ రంగ సంస్థలు కాకుండా ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులలో నూతన ఆవిష్కారాల లోను శ్రేష్ఠతకుగాను ప్రదానం చేస్తారు. ఇంకా.. ఐసిటి ఆధారితంగా జిల్లా స్థాయి ఉత్తమ కార్యక్రమాలకు, ఇ- పరిపాలన లో అంతరిక్ష సాంకేతిక విజ్ఞానం మరియు జిఐఎస్ ల వినియోగానికి, కేంద్ర ప్రభుత్వ పిఎస్ యులు మరియు రాష్ట్ర ప్రభుత్వ పిఎస్ యులలో ఐసిటి ని వినూత్నమైన రీతిలో వినియోగించినందుకు, విద్యా సంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, సహకార సంస్థలు/ సమాఖ్యలు/ సంఘాలలో అసాధారణమైన రీతిలో ఇ- పరిపాలన సంబంధిత చొరవల అమలుకు గాను ఇస్తారు. పరిపాలన సంస్కరణల సంబంధ కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సమాచార సాంకేతిక విజ్ఞాన సంస్కరణల సంబంధ కార్యదర్శులు, కేంద్ర ప్రభుత్వ ఐటి మేనేజర్లు, సాఫ్ట్ వేర్ సొల్యూషన్ ప్రొవైడర్లు, తదితర వర్గాలకు ఒక వేదికగా ఈ సమావేశం ఉపయోగపడనుంది. వారంతా ఈ సమావేశంలో పాలుపంచుకొని పరస్పరం చర్చలలో పాల్గొంటారు. తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. సమస్యలపై చర్చోపచర్చలు చేస్తారు. సమస్యలకు తగిన పరిష్కార మార్గాలపై విశ్లేషిస్తారు. ఉత్తమమైన పద్ధతులను, నూతన ఆవిష్కరణలను, ఐసిటి సొల్యూషన్ లను వెల్లడించేందుకు ఈ సమావేశం ఒక వేదికగా మారబోతోంది. వివిధ ప్రభుత్వ విభాగాలు ఇ- పరిపాలన ను అమలు చేయడంలో కనబరచిన ప్రావీణ్యాన్ని ప్రోత్సహించేందుకు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇంకా ప్రభుత్వేతర సంస్థలు చేపట్టిన కార్యక్రమాలను సైతం ప్రోత్సహించేందుకు జాతీయ ఇ- పరిపాలన అవార్డులను ప్రదానం చేయనున్నారు.

సఫారీ గడ్డపై సరికొత్త చరిత్ర

● దక్షిణాఫ్రికాపై టీ20 సీరీస్ కైవసం ● ఒకే పర్యటనలో రెండు సీరీస్‌లు సొంతం ● సత్తాచాటిన భారత మహిళల జట్టు
● చివరి మ్యాచ్‌లో సఫారీ జట్టుపై 54 పరుగుల తేడాతో విజయం
● అద్భుతంగా రాణించిన మిథాలీరాజ్, రోడగ్స్
● మిథాలీరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది సీరీస్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో విజయంసాధించి భారత మహిళల జట్టు నూతన చరిత్ర సృష్టించింది. దక్షిణాఫ్రికా గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సొంతం చేసుకున్న మహిళల తొలి జట్టుగా భారత్ నిలిచింది. చివరి మ్యాచ్‌లో సఫారీ జట్టుపై 54 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించడంతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-1 తేడాతో కైవసం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. మిథాలీరాజ్ 62(64), రోడగ్స్ 44(48) రాణించడంతో పాటు, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 27(19) మెరుపులు మెరిపించిన వేళ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి.. 166పరుగులు చేసింది. 167 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన సఫారీ జట్టుకు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. 50 పరుగులకే కీలకమైన ఐదు వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన ట్రయాన్ 25(28), కాప్ 27(34)లు భారత్ బౌలర్లను ప్రతిఘటించారు. అయితే ఎక్కువ సేపు క్రీజులో నిలదొక్కుకోలేక పోయారు. చివరకు 18 ఓవర్లలో 112 పరుగులకు దక్షిణాఫ్రికా జట్టు ఆలౌటైంది. భారత్ బౌలర్లలో శిఖా పాండే, రుమేలి ధర్, రాజేశ్వరి గైక్వాడ్‌లు తలో మూడు వికెట్లు తీయగా, పూనమ్‌యాదవ్‌కు ఒక వికెట్ దక్కింది. అద్భుత ప్రదర్శన కనబరిచిన మిథాలీరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు దక్కాయి.

పేలిన పెళ్లి కానుక : వరుడి మృతి



భువనేశ్వర్ : కొత్తగా పెళ్లైన యువకుడు తనకు వచ్చిన పెళ్లి కానుక కారణంగానే ప్రాణా లు కోల్పోయిన విషాద ఘటన ఒడిశాలోని బొలాంగిర్ జిల్లాలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకుతో పాటు అతడి బామ్మ కూడా చనిపోయింది. వధువు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నదని పోలీసులు వెల్లడిం చారు. అయిదు రోజుల క్రితం వారి పెళ్లి జరగగా ఈ నెల 21న జరిగిన వివాహ రిసెప్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తి నూతన దంపతులకు పెళ్లి కానుకగా ఒక పార్సిల్ ఇచ్చాడు. శుక్రవారం వారు ఇంటిలో ఆ పార్సిల్ తెరిచారు. తెరిచిన వెంటనే అది పేలింది. దీనితో అక్కడ ఉన్న వరుడు, వధువు, వారి బామ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. వరుడు, అతడి బామ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. తీవ్రంగా గాయపడిన వధువు బుర్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పతాన్‌గఢ్ సబ్ డివిజ నల్ పోలీస్ ఆఫీసర్ సెసాదేవ బరిహా తెలిపారు. ఆ పెళ్లికానుక ఇచ్చిన వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

బడుగులకు హుళక్కేనా?

మెజార్టీగా కమ్మ సామాజిక వర్గం నుంచే ఎంపికచేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సారి బీసీలపై ఆ పార్టీ దృష్టి సారిస్తుందా లేక కమ్మ, ఇతర ఉన్నత సామాజిక వర్గానికే రాజ్యసభ పదవులు కట్టబెడుతుందా అన్నది ఆసక్తికర చర్చ సాగుతోంది. ఇదిలావుంటే వైసీపీ తనకున్న ఏకైక రాజ్యసభ సీటును గతంలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన విజయసాయిరెడ్డికి కట్టబెట్టింది. ఇప్పుడు కూడా దక్కే ఒక రాజ్యసభ సీటును కూడా మళ్లీ రెడ్డి సామాజిక వర్గానికి కట్టేబట్టే ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తెలంగాణలో మాత్రం తనకు దక్కే మూడు సీట్లలో టీఆర్ఎస్ నాయకత్వం ఒక బీసీకి మరో సీటును ఎస్సీ లేదా మైనార్టీలకు, మరో సీటు ఓ ఉన్నత సామాజిక వర్గానికి ఇచ్చే ప్రయత్నం జరుగుతోందని ప్రచారం. ఈ పరిణామాలను చూస్తే తెలంగాణలో పరిస్థితి బడుగు వర్గాల విషయంలో కాస్త ఊరాట కనిపించినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆ రకమైన పరిస్థితులు కనిపించడంలేదని సమాచారం. దీనిపై బీసీలు భగ్గుమంటున్నారు. ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభసభ్యులుగా ఉన్న చిరంజీవి, రేణుకాచౌదరి, దేవేందర్‌గౌడ్, తెలంగాణ నుంచి సీఎంరమేష్, రాపోలు ఆనందభాస్కర్‌ల పదవీ కాలం త్వరలో పూర్తికానున్నది. ఇదిలావుంటే పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మృతితో ఖాళీ అయిన స్థానానికీ ఇప్పుడు ఎన్నిక జరుగనుంది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని మూడు స్థానాల్లో రెండు టీడీపీకి, ఒకటి ప్రతిపక్ష వైసీపీకి, తెలంగాణలోని మూడుస్థానాల్లోనూ టీఆర్ఎస్ సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

పెద్దల సభలో ప్రవేశం కోసం రెండు రాష్ట్రాలలో సీఎంలుగా ఉన్న ఇద్దరు చంద్రులపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. నవ్యాంధ్రలో ప్రస్తుతం రాజ్యసభ సీటు కోసం టీడీపీలో గట్టిపోటీ పడుతుండగా, వైసీపీకి దక్కే ఒక సీటు కోసం దాదాపు అభ్యర్థిఖరారై పోయినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో మూడు స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. టీడీపీ అధినేత ప్రసన్నం కోసం చాపకింద నీరులా తెలుగు తమ్ముళ్లు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలవటంతో తెలుగుదేశం పార్టీలో రెండు స్థానాలు ఎవరికి దక్కుతాయన్న దానిపై ఆసక్తికర చర్చ ప్రారంభమైంది. ఈ స్థానాన్ని ఆశించే వారు కనీసం పది మందికిపైగా ఉన్నారని సమాచారం. టీడీపీ నుంచి దేవేందర్‌గౌడ్, సీఎం రమేష్‌ల పదవీ కాలం పూర్తవుతోంది. దేవేందర్‌గౌడ్ తెలంగాణకు చెందిన వారు కావటంతో తిరిగి ఆయన్ని టీడీపీ నాయకత్వం మరో అవకాశం ఇచ్చే ఆస్కారంలేదని సమాచారం. అయితే సీఎం రమేష్‌కు మరో అవకాశం వస్తుందా? లేదా? అన్న దానిపై అందరి దృష్టి కేంద్రీకృ తమైంది. ఆయనను ఇంకోసారి రాజ్యసభకు పంపించే వీలుంటే రెండో స్థానం బీసీ, ఎస్సీల్లో ఒకరికి దక్కవచ్చన్న ప్రచారం ఉంది. వైసీపీ నుంచి భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు టీడీపీలో చేరటంతో మూడో స్థానానికి కూడా అభ్యర్థిని నిలపాలన్న వాదన పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. పార్టీపరంగా నిలిపే పరిస్థితి లేకుంటే ఎవరైనా బలమైన స్వతంత్ర అభ్యర్థిని పోటీకి దించి మద్దతివ్వాలనే సూచన వస్తోంది. వైసీపీ తన అభ్యర్థిగా నెల్లూరు జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ వి.ప్రభాకర్‌రెడ్డిని ఎంపిక చేయాలని గతంలో సూత్రప్రాయంగా నిర్ణయిం చింది. అదే పరిస్థితి ఇప్పటికీ ఉందా? లేదా? అన్నదానిపై స్పష్టత రాలేదు. ఆయన్నే ఎంపిక చేస్తే రెండు స్థానాలూ ఒకే జిల్లా నుంచి ఒకే వర్గానికి ఇచ్చినట్ల వుతుందన్న వాదన కూడా ఉంది. కాంగ్రెస్ నుంచి రాష్ట్రానికి చెందిన చిరంజీవి పదవీకాలం పూర్తవుతోంది. ఆయనను మరోసారి రాజ్యసభకు పంపించే అవకాశం లేదు.

ఎన్నికలకు తప్పని పోటీ...

రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూలు విడుదలైంది. ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు ఈసారి ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి రాష్ట్రంలో పోటీ తప్పదనిపిస్తోంది. ఎన్నికలు జరగనున్న మొత్తం మూడు సీట్లకూ అభ్యర్థులను ఖరారు చేసే యోచనలో అధికార పక్షం టీడీపీ ఉండగా ఒక సీటుకు పోటీ పెట్టాలని ప్రతిపక్ష వైసీపీ నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రతిసారీ నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా ఈసారి వాటి సంఖ్య మూడుకు తగ్గింది. రాష్ట్ర విభజన తర్వాత ఏ రాష్ట్రం నుంచి ఎంత మంది రిటైరవుతున్నారో అంత మంది ఎంపీలు అదే రాష్ట్రం నుంచి తిరిగి ఎన్నిక కావడానికి అవకాశం కల్పించడంతో ఈసారి తెలంగాణకు ఒక సీటు పెరిగి మూడు ఎంపీ సీట్లు వచ్చాయి. ఆంధ్రకు ఒకటి తగ్గి మూడు వచ్చాయి. ఈ లెక్కన ప్రతి ఆరేళ్లకు ఈ రెండు రాష్ట్రాలకు మూడు చొప్పున రాజ్యసభ సీట్లు వస్తాయు. మిగతా సమయాల్లో ప్రతి రెండేళ్లకు ఆంధ్రకు నాలుగు, తెలంగాణకు రెండు వస్తాయి. ఈసారి ఆంధ్రలో జరిగే ఎన్నికల్లో రాజ్యసభ అభ్యర్థులు తొలి రౌండ్ లెక్కింపులోనే గెలవాలంటే 45 ఎమ్మెల్యేల ఓట్లు కావాలి.



సరిపోను రాకపోతే తర్వాతి రౌండ్లకు లెక్కింపు కొనసాగుతుంది. వైసీపీకి ప్రస్తుతం 45 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక సీటు గెలుచుకోవడానికి ఈ సంఖ్యాబలం సరిపోతుంది. కానీ ఆ పార్టీ నుంచి ఒక ఎమ్మెల్యే నిష్క్రమించినా వారి అభ్యర్థి గెలుపు డోలాయమానంలో పడుతుంది. ఇప్పటికే వైసీపీ నుంచి 22 మంది ఎమ్మెల్యేలు నిష్క్రమించి టీడీపీలో చేరారు. ఇంకా ఒకరిద్దరు కూడా చేరే యోచనలో ఉన్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ ఎన్నికలపై ఉత్కంఠ పెరుగుతోంది. మరోపక్క రెండు సీట్లను గెలుచుకునే బలం ఉన్న టీడీపీ ఈ దఫా మొత్తం మూడు సీట్లకు పోటీ పెట్టాలని ఆలోచిస్తోంది. ప్రతిపక్షం నుంచి ఒకరిద్దరు ఆ పార్టీలోకి వస్తే మూడో సీటు కూడా గెలుచుకోగలుగుతుంది. దానికి అవకాశాలు ఉన్నాయని, మూడో సీటుకు కూడా పోటీ పెట్టాలని అనుకుంటున్నామని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ తమ అభ్యర్థిగా నెల్లూరు జిల్లాకు చెందిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పేరును ఇప్పటికే ఖరారు చేసింది. ఆయన ఆఫ్రికాలో గనుల వ్యాపారంలో ఉన్నారని సమాచారం. పోయిన అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన నెల్లూరు జిల్లాకు వైసీపీకి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆ ఎన్నికల తర్వాత టీడీపీలో చేరారు. మళ్లీ కొంతకాలానికి వైసీపీలోకి వెళ్లారు. ఆయన ఇప్పటికే జిల్లాలు తిరిగి వైసీపీ ఎమ్మెల్యేలను కలుసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ ఇంకా తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం రిటైరవుతున్న వారిలో సీఎం రమేశ్ మరో ఛాన్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు కూడా రేసులో ఉన్నారు. శుక్రవారం వారిద్దరూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. కాగా ఈసారి రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ వైఖరి ఎలా ఉంటుందన్నది ఉత్కంఠ కలిగిస్తోంది. ఆ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మిత్రపక్షం కోటా కింద గత ఎన్నికల్లో బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి సురేశ్ ప్రభుకు ఈ రాష్ట్రం నుంచి ఎంపీగా అవకాశం కల్పించింది. కానీ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై టీడీపీ ఎంపీలు గళమెత్తడంతో ఏం జరగబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ పార్టీల సఖ్యత కొనసాగితే బీజేపీ ఎమ్మెల్యేల ఓట్లు టీడీపీకి పడతాయి. సఖ్యత బీటలు వారితే ఈ ఎమ్మెల్యేల వైఖరి ఎలా ఉంటుందన్న దానిపై రకరకాల ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. బీజేపీ ఎమ్మెల్యేల ఓట్లు లేకుండా టీడీపీ మూడో సీటు గెలవడం సాధ్యం కాదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలావుంటే రాజ్యసభ ఎన్నికల పోలింగ్ అమరావతిలోనే జరగనుంది.

పదవీకాలం పూర్తికానున్న ఎంపీలు వీరే..

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం ఆరుగురు ఎంపీలు రిటైరవుతున్నారు. వీరిలో ఏపీ నుంచి చిరంజీవి, రేణుకా చౌదరి, దేవేందర్ గౌడ్; తెలంగాణ నుంచి సీఎం రమేశ్, రాపోలు ఆనంద భాస్కర్, పాల్వాయి గోవర్ధనరెడ్డి ఉన్నారు. వీరిలో పాల్వాయి ఇటీవల చనిపోయారు. అప్పటి నుంచి ఆయన స్థానం ఖాళీగా ఉంది. విభజన సమయంలో తీసిన డ్రాలో దేవేందర్ గౌడ్ ఏపీకి, సీఎం రమేశ్ తెలంగాణకు వచ్చారు.

ముమ్మర ప్రయత్నాల్లో బీద మస్తాన్‌రావు...

సీఆర్‌డీఏ సభ్యుడు, తెలుగు దేశం పార్టీ కావలి నియోజక వర్గ ఇన్‌చార్జి బీద మస్తాన్ రావుకు అరుదైన అవకాశం దక్కనున్నట్లు సమాచారం. రాజ్యసభ స్థానానికి బీసీ కోటాలో ఆయన్ను నిలబెట్టేందుకు ఆ పార్టీ అధిష్ఠానం యోచిస్తున్నట్లు సమాచారం. ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో టీడీపీకి రెండు స్థానాలు దక్కే అవకాశం ఉంది. బీసీ కోటాలో తన సోదరుడికి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చంద్రబాబును అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఒకవేళ రాజ్యసభకు అవకాశం లేకుంటే టీటీడీ ఛైర్మన్ పదవి అయినా తమ నేతకు దక్కుతుందనే ఆశాభావం బీఎమ్మార్ అనుచరులు వ్యక్తం చేస్తున్నారు. రాజ్యసభ రేసులో తెలుగుదేశం పార్టీ తరఫున కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు (బీఎమ్మార్) పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. బీసీ కోటాలో ఆయనకు అవకాశం దక్కే సూచనలు ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు శుక్రవారం రాత్రి నోటిఫికేషన్ వెలువడ్డాయి. గత కొన్ని రోజులుగా బీద మస్తాన్‌రావుకు రాజ్యసభ లేదా మరేదైన కీలక పదవి దక్కే అవకాశం ఉందని ప్రచారంలో ఉంది. తాజాగా రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడటంతో ఈ ప్ర చారం మరింత ఊపందుకుంది. ఎన్టీఆర్ హయాం నుంచి బీద కుటుంబం తెలుగుదేశం వెన్నంటే ఉంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈ కుటుంబం నెల్లూరు తెలుగుదేశం రాజకీయాల్లో బలమైన పట్టుకలిగిన విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో బీద మస్తాన్‌రావు కావలి అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ప్రస్తుతం నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జిగా రాజధాని అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తగా, ఆధ్యాత్మికవేత్తగా గుర్తింపు పొందిన బీద మస్తాన్ రావు టీటీడీ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవికి సైతం పోటీలో ఉన్నారు. ఈ నియామకం కన్నా ముందే రాజ్యసభ నోటిఫికేషన్ వెలువడటంతో ఈ స్థానానికి ఆయన పేరు ప్రచారంలోకి వచ్చింది. రాష్ట్రం నుంచి తెలుగుదేశంకు రెండు రాజ్యసభ స్థానాలు దక్కే అవకాశం ఉన్న క్రమంలో బీసీ కోటాలో తనకు అవకాశం ఇవ్వాలని బీద మస్తాన్‌రావు, ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పార్టీ అధినేత చంద్రబాబును కోరారు.

మొదటి పేజీ తరువాయి


చిత్తశుద్ధి ఏది?




రూ100 వచ్చే కరెంట్ బిల్లు ఇప్పుడు రూ.500 నుంచి రూ.2వేల వరకూ వస్తోంది. అంతే కాదు రూ.10వేల పెనాల్టీ అంటూ ప్రజలను హింసిస్తున్నారు. పక్కనున్న ఊర్లో బంధువుల ఇంటికి వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే ప్రజలు భయపడుతున్నారు. మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచారు. పండుగ వస్తే టికెట్లు కొత్త సినిమాకు బ్లాక్‌లో అమ్మినట్లు అమ్మతున్నారు. నాన్నగారి హయాంలో రేషన్ దుకాణానికి వెళ్తే అన్ని సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం బియ్యం ఒక్కటే ఇస్తున్నారు. వాటిలో కూడా వేళ్లు పడట్లేదంటూ ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ పంటకు గిట్టుబాటు ధరలేదు. పండించిన పంటకు ధర కోసం రైతన్నలు రోడ్డెక్కి ధర్నాలు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. పొగాకు, కందులు, శనగకు కనీసం గిట్టుబాటు ధర లభించడం లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జామాయిల్ రైతులకు క్వింటా రూ.4200 ఉంటే ఇప్పుడు రూ. 1800 కూడా రావడం లేదు. ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు పూర్తిగా రుణమాఫీ చేస్తామంటూ హామీ ఇచ్చారు. కానీ ఏ ఒక్కరికి పూర్తిగా రుణమాఫీ జరిగని పరిస్థితి. తాకట్లు పెట్టిన బంగారాన్ని వేలం వేస్తామంటూ బ్యాంకులు నోటీస్ పంపిస్తున్నాయి. ఇంట్లో ఆడబిడ్డ కన్నీరు పెడితే అది అరిష్టం అంటారు. కానీ చంద్రబాబు కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా అక్కాచెల్లెమ్మలు ప్రతిరోజు కన్నీరు పెడుతున్నారు. ఆయన చేసిన రుణమాఫీ వడ్డీకిందకు కూడా సరిపోలేదు. ఇక అధికారంలోకి రావడానికి యువతను సైతం మోసం చేశాడు. జాబు రావాలంటే బాబు రావాంటూ మభ్యపెట్టాడు. ఇప్పటి వరకూ ఏ ఒక్క నిరుద్యోగికి నిరుద్యోగ భృతి చెల్లించలేదు. ప్రతి నిరుద్యోగికి రూ 90 వేలు బాకీ ఉన్నారు. ఎన్నికల సమయంలో పూర్తి రుణమాఫీ చేస్తానన్నారు, నాలుగేళ్లులో ఏ ఒక్కరికి సంపూర్ణ రుణమాఫీ అవలేదు. ప్రకాశం జిల్లాలో 787 ఫ్లోరైడ్ బాధిత గ్రామాలు ఉన్నాయి. డయాలసిస్ సెంటర్లలో డాక్టర్లు లేని పరిస్థితి ఉంది. ప్రైవేటుగా చేయించుకోవాలంటే వేలాది రూపాయలను చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ఫ్లోరోసిస్ నుంచి విముక్తి కలిగించడానికి రామతీర్థం నుంచి కనిగిరికి నీళ్లు తెచ్చిన ఘనత వైఎస్ఆర్‌దే. వైసీపీ అధికారంలోకి రాగానే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ప్రజా సంక్షేమం కోసం నవరత్నాలు ప్రవేశ పెట్టాం. పేద విద్యార్థులు చదువుకోవడం కోసం ఎన్ని లక్షలైనా భరిస్తాం. హాస్టల్ చార్జీల కింద రూ.20 వేలు ఇస్తాం. చిన్నారులను బడులకు పంపే తల్లి దండ్రలకు రూ.15వేలు ఇస్తాం. అంతేకాకుండా అవ్వా,తాతలకు పింఛన్లును రూ.2వేలకు పెంచుతాం. వయోపరిమితి 60 ఏళ్లకే తగ్గిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 45 ఏళ్ళకే పెన్షన్ ఇస్తున్నానని భరోసా ఇస్తున్నా." అని అన్నారు.

అగ్రస్థానమే లక్ష్యం

పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొంటున్నారని, విదేశీ ప్రతినిధులు 230 మంది వచ్చారని, 2500 మంది పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొనడం విశేషమన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది స్పందన ఇంకా బాగుందని, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఏరో స్పేస్, టెక్స్‌టైల్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ తదితర రంగాలలో ఎంవోయూలు జరగబోతున్నాయన్నారు. వ్యవసాయరంగంలో అద్భుత ఫలితాలు సాధించామని, ఇప్పుడు పరిశ్రమలు, సేవలరంగంపై దృష్టి పెట్టామని, కేంద్రం సహకారంతో ఏపీలో రెండు పారిశ్రామిక క్యారిడార్లు అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ-చెన్నయ్, చెన్నయ్-బెంగళూర్ పారిశ్రామిక కారిడార్లు తీసుకువస్తున్నామని చెప్పారు. కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్ అభివృద్ధి చేస్తున్నామని, గత మూడున్నరేళ్లుగా 1946 ఎంవోయూలు జరిగాయని, వాటి విలువ రూ.13 లక్షల 54 వేల కోట్లు అని అన్నారు. అవి సాకారమైతే 31 లక్షల ఉద్యోగాలు వస్తాయని, జరిగిన ఒప్పందాల్లో 59శాతం వాస్తవరూపం దాలుస్తున్నాయన్నారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన., రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత్ ఎంతో మేలుగా ఉందని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమమన్నారు. వరుసగా రెండేళ్లుగా దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీకి వరల్డ్ బ్యాంక్ ఫస్ట్ ర్యాంక్ ఇచ్చిందని, ప్రభుత్వ పాలనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్దఎత్తున వినియోగిస్తున్నామని, ఏపీలో రియల్ టైమ్ గవర్నెన్స్ సమర్థంగా ఉందన్నారు. అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందే భావనపాడు భారతదేశంలోనే అత్యుత్తమ నౌకాశ్రయంగా రూపుదిద్దుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. మీరు ఇక్కడ పరిశ్రమలు పెడితే ఎటువంటి ఆటంకాలూ లేవని, వెంటనే భూమి ఇస్తాం. నీరిస్తాం. అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులను నేను సమకూర్చగలనని, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచే వారందరికీ నేను అభయం ఇస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు. అన్ని మౌలిక వసతులు కల్పించామని, నీరు, విద్యుత్‌కు లోటు లేకుండా చేశామని, రైల్వే-రోడ్డు రవాణా వ్యవస్థ పటిష్టంగా ఉందన్నారు. ఫైబర్ గ్రిడ్ ద్వారా 1.5 లక్షల మందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే సామర్థ్యాన్ని సాధించామని, రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నేరుగా పర్యవేక్షించే సాంకేతికతను అందిపుచ్చుకున్నామన్నారు. రెండో విడత విద్యుత్ సంస్కరణలు తీసుకువస్తున్నామని, భవిష్యత్‌లో విద్యుత్ ధరలు పెంచకపోగా తగ్గిస్తామని చెబుతున్నామన్నారు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే వెంటనే సమస్యలను పరిష్కరిస్తాం, 21 రోజుల్లో పరిశ్రమల స్థాపనకు సంబంధించి అన్ని అనుమతులు ఇస్తామన్నారు. ఎవరైనా సూర్యుని చూడాలంటే ఏపీకి రావాల్సిందేనని, రాబోయే కాలంలో ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా మార్చడానికి సీఐఐ మాకు మంచి భాగస్వామిగా నిలుస్తోందని, పెట్టుబడుల ప్రక్రియ సరళంగా ఉండాలన్నదే నా ప్రభుత్వ ఆలోచన అన్నారు. టెక్నాలజీలో, ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఇండియా స్ట్రాంగ్‌గా ఉండటం మనకు అడ్వాంటేజ్ అని చెప్పారు. ప్రపంచం భారత్ వైపు చూడాలి. భారత్ వచ్చినవారు ఏపీ వైపు చూడాలి, అదే నా ఆకాంక్ష అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రపంచంలోనే టాప్ 5 స్థానాల్లో ఉండాలన్నదే ధ్యేయమని, హైదరాబాద్ నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దినట్టే కొత్త రాష్ట్రాన్ని పోర్టు ఆధారిత ఎకానమీగా మార్చుతానని, ఏడాది వ్యవధిలోనే రెండు నదులను అనుసంధానం చేశామని, విద్యుత్‌లో ఏపీకి తిరుగులేదని చంద్రబాబు స్పష్టం చేశారు. నా దగ్గర డబ్బు లేదు, రాజధాని మాత్రం నిర్మించాలి. నాతో కలిసి రండని రైతులను అడిగాను. ల్యాండ్ పూలింగ్ ఆలోచన మెచ్చి రైతులు ముందుకొచ్చారు, ఇది అపూర్వం. రాజధాని అంటే



పాలనానగరంగానే కాకుండా ప్రపంచంలోని 5 ఉత్తమ నగరాల్లో ఒకటిగా నిర్మించడానికే నేను అన్ని దేశాలు తిరిగాను. ఈ శతాబ్దంలోనే గొప్ప నగరాన్ని నిర్మించుకునే కృషిలో మీరు కూడా భాగస్వాములు కావాలి. గ్యాస్, ఆయిల్ నిక్షేపాలతో ఏపీ సంపన్న రాష్ట్రంగా మారడం ఖాయం. ఐక్యరాజ్యసమితి సుస్థిర వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి సాధిస్తున్నాం. సంతోషాన్ని సూచికగా తీసుకుని కుటుంబ వికాసంతో సమాజ అభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రపంచంలోనే టాప్ 15 స్థానాల్లో నిలవాలని ఈసారి బెంచ్ మార్కుగా పెట్టుకున్నాం. విద్యుత్ సంస్కరణలను నేను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రారంభించాను. ఇప్పుడు రెండోతరం విద్యుత్ సంస్కరణలను తీసుకొచ్చాను. సౌరవిద్యుత్తు పవన విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాం. విద్యుత్తును నిల్వచేసే పద్ధతులను తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉన్నాం. విశాఖ క్లీన్ సిటీ, గ్రీన్ సిటీ. ఓ వైపు సముద్రం, మరోవైపు కొండలతో ఎంతో అందమైన ప్రదేశం. అందమైన సూర్యోదయం చూడాలంటే ఇక్కడికి రండి అన్ని ప్రదేశాలు చూడండి. ఇక్కడి వంటకాల రుచులను ఆస్వాదించండి అని చంద్రబాబు పిలుపునిచ్చారు. ముందుగా చార్టింగ్ న్యూ ఇండియాస్ గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ అనే అంశంపై ప్రారంభ సదస్సు జరిగింది.



చిన్న సినిమాల నిర్మాతలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అంబికా కృష్ణ

విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రంలో తడ నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్మించే చిన్న సినిమాల నిర్మాతలకు రూ.10 లక్షల వరకు ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కోరామని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అంబికా కృష్ణ శనివారం ఆర్.టి.సీ కాంప్లెక్స్ పరిపాలనా భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. డిజిటల్ సినిమా ప్రోవైడర్లకు, సినిమా నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య జరుగుతున్న చర్చలలో చైర్మన్ దాలో పాలుపంచుకోవడం జరిగిందన్నారు. అనాలోచితంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు తీసుకున్న ఒప్పందాల వల్ల చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్నామన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని యూ.ఎఫ్.ఓ, క్యూబ్ డిజిటల్ సినిమా ప్రోవైడర్లు ఆయా సినిమా హాళ్లలో 20 నిమిషాల చొపన ప్రైవేట్ ప్రకటనలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చిన్న సినిమాల నిర్మాణాన్ని ఇక్కడ నిర్మించాలని కోరడంతో పాటు పెద్ద సినిమాలు ఒక షెడ్యూల్ అయినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మించాలని పలువురు సినిమా హిరోలను కలసి కోరడం జరిగిందన్నారు.

రాష్ట్రంలో సినిమా పరిశ్రమ ఏర్పాటుకు ఆసక్తి చూపే ప్రాంతంలో ఏర్పాటుకు సహకారం అందించేలాగా కృషి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడ ప్రాంతంలో ఎ.వి.యం సంస్థ ఆధ్వర్యంలో 24 ఎకరాల స్థలంలో స్టూడియో ఏర్పాటుకు చొరవ చూవుతున్నామన్నారు.

పినపాకలో పాయం పాట్లు ఫలించేనా?

- పార్టీ మారడంపై ప్రధాన చర్చ
- అభివృద్ధి అంతంత మాత్రమే
- పట్టు కోల్పోతున్న వైనం
- కేసీఆర్ లెక్కల్లో బొటాబొటి మార్కులేనా?
- సింగరేణి ఉద్యోగుల్లోనూ తీవ్ర అసంతృప్తి
- భారజలం, బిపిఎల్‌లోను ఇదే పరిస్థితి



(ఖమ్మం-సూర్యబ్యూరో) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్య వహిస్తున్న సీపియర్ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు ఈ సారి తిరిగి జెండా ఎగరవేస్తాడా? పాయం పాట్లు ఫలించేనా? లేదా? అనే సందేహలు నెలకొన్నాయి. పాయం కమ్యూనిస్టు నేపద్యం నుంచి వచ్చిన వ్యక్తి కష్టపడే మనస్తత్వం... స్పందించే గుణం... మృదు స్వభావి. ఇన్ని మంచి క్వాలిటీలు ఉన్నా ఆయన పార్టీ మారాడనే ఆపవాదును ఎదుర్కొంటున్నాడు. దీంతో ప్రజలు షాక్ ఇవ్వనున్నారా? అనే అనుమానాలు ఆయన్ను వెంటడుతున్నాయి. ఆయన సిపిఐ యువజన సంఘలో పనిచేశారు. జిల్లా కమిటీలో ఉన్నారు. పార్టీ ఆయనకు మంచి గుర్తింపు నిచ్చింది. ఎమ్మెల్యేను చేసింది. కాని ఆయన పార్టీకి దూరమైయ్యారు. సిపిఐ నుంచి వైకాపాలో చేరినప్పుడు కారణలు ఏమైనప్పటికి ఆయనపై పెద్దగా ప్రజల్లో వ్యతిరేకత రాలేదు. పైగా ఆయన నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలు స్వాగతించారు. 2014 ఎన్నికల్లో పినపాక నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటి చేసి విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో వైకాపా మూడు స్థానాలు గెలవగా అవి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కావటం విశేషం. అందులో పాయం ఒకరు. పాయంకు నియోజకవర్గంలో మంచి పరిచయాలు ఉండటంతో పాటు రెడ్డి సామాజికవర్గం పూర్తిగా వైకాపా అభ్యర్థిగా ఉన్న పాయంను గెలిపించే బాధ్యత నెత్తి కెత్తుకుంది. వైయస్ రాజశేఖర్‌రెడ్డి మరణం ప్రజల్లో సానుభూతి, సిపియం సహకారం, కాంగ్రెస్ పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి పోటిలో లేకపోవటం, సిపిఐ పోటిచేయటం లాంటి ఆంశాలు పాయంకు కలిసొచ్చాయి. ఈ సారి ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ శాసనసభ్యుడు రేగా కాంతారావు పోటిచేస్తారని టిపిసిసి ఇప్పటికే ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించిన రెండవ నియోజకవర్గం కావటం విశేషం. దీంతో పొత్తులు ఎవరితో ఉన్నా పినపాకను ఎట్టి పరిస్థితుల్లోను వదులుకోనేది లేదని చెప్పకనే చెప్పారు. దీంతో ఈ సారి కాంగ్రెస్ పోటి ఖాయం. పైగా ప్రభుత్వ వ్యతిరేకత ఉంది. పాలక పార్టీ శాసనసభ్యుడిగా ఉండి ప్రత్యేకంగా నియోజకవర్గం ప్రజలకు ఇది చేశానని చెప్పుకునే పరిస్థితి పాయంకు లేదని విమర్శలు ఉన్నాయి. ఆయనకు తెలుసోలేదే తెలియదు గాని కూడబెట్టుకుంటున్నాడు, సంపాదించు కుంటున్నాడనే వ్యతిరేక ప్రచారం పాయంపై జరుగుతుంది. నియోజకవర్గంలో ప్రధానంగా బొగ్గుగనులు ఉన్నాయి. మణుగూరులో కార్మిక కుటుంబాలు, ఇక్కడ అభ్యర్థి గెలుపోటముల్లో కీలకంగా వ్యవహరిస్తాయి. సింగరేణి ఎన్నికల్లో టిఆర్‌యస్‌కు చెందిన బొగ్గుగని కార్మిక సంఘ గుర్తింపు ఎన్నికల్లో గెలిచినప్పటికి ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చలేదనే విమర్శలను మూటగట్టుకుంటుంది. గుర్తింపు సంఘంగా ఎన్నికైనప్పటికి, సంఘానికి అధికారిక పత్రం అందజేయటం ఆలస్యం కావటంతో అసలు ఎన్నికలను గుర్తిస్తారా? లేదా?అనే సందేహలు కూడా కలిగాయి. గుర్తింపు దృవీకరణ పత్రం ఎట్టకేలకు వచ్చినా పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఇంతవరకు చేయలేదు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రతి బ్రాంచి నుంచి ఉపాద్యక్షులను తానే ఎంపిక చేస్తానని , కార్మిక కుటుంబాలకు చేసిన వాగ్దానాలను నేరవేర్చుతానని ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు హైద్రాబాద్‌లో విలేకర్ల సమావేశం పెట్టి చెప్పినప్పటికి ఇంతవరకు ముఖ్యమంత్రి వాగ్దానాలు నేరవేరలేదు. దీంతో కార్మికుల్లో తీవ్రవ్యతిరేకత వ్యక్తం అవతుంది. దేశలలోని అన్ని ప్రాంతాల వారికి నెలవైన నియోజకవర్గం కావటం ఇక్కడ ప్రత్యేకత. అశ్వాపురంలోని హెవివాటర్ ప్లాంట్ కూడా ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. భద్రాచలం పేపర్ బోర్డు, బూర్గంపాడు మండలంలోని సారపాకలో ఉంది. ఇక్కడకూడా కార్మిక వర్గం అధికంగానే ఉంది. ఇక పినపాక గుండాలతో పాటు కొత్తగా ఎర్పడిన ఆళ్ళపల్లి, కరకగూడెం మండలాలు ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న మారుమూల మండలాలు. అన్ని మండలాలకు రోడ్డు సౌకర్యం కల్పించినప్పటికి , రైతులు , పోడు భూములు చేసుకునే వారు, ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే ఉన్నారు. రైతు సమితులను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వారిని మచ్చిక చేసుకునేందుకు ఎన్నికల ముందు ఎకరాకు 4 వేల పెట్టబడిగా ఇచ్చేందుకు నిర్ణయించిందనే అభిప్రాయాలు ఉన్నాయి. పంటలకు గిట్టుబాటు ధర, పెన్షన్ విధానంలో లోపాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు, ఇరిగేషన్ పథకాలు, ప్రధానంగా మిషన్ కాకతీయలో జరుగుతున్న అవినీతిపై గ్రామాల్లో జరుగుతున్న చర్చ ఇబ్బంది కరంగా మారే ఆవకాశం ఉంది. అభ్యర్థుల గెలుపోటములపై కేసీఆర్ ఇప్పటికే అనేక సర్వేలు చేయించారు. అందులో పాసు మార్కులు వచ్చిన వారినే తిరిగి పోటిలో నిలిపే ఆవకాశాలు ఉండటంతో ఎమ్మెల్యేల్లో ఆందోళన మొదలైంది. ఈ సారి పినపాక నుంచి అభ్యర్థి మారే ఆవకాశం ఉందనే ప్రచారం కూడా జరుగుతుంది. ఇందులో వాస్తవం ఎంత ఉన్నా చివరకు కేసీఆర్ నిర్ణయమే ఫైనల్ అవుతుంది. ఆయన కూడా గెలుపు గుర్రాలకే టిక్కెట్లు అని స్పష్టంగానే చెబుతున్నారు. ఎమ్మెల్యే పనితీరు మెరుగుపడాలని వార్నింగ్‌లు కూడా ఇస్తున్నారు. టిఆర్‌యస్‌కు 2019 ఎన్నికలు అత్యంత కీలకమైనవి కావటంతో ప్రతి అభర్థి జాతకాలను జాగ్రత్తగా పరిశీలించటతో పాటు వారికి అనుకూల, ప్రతికూల ఆంశాలను కూడా తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో పినపాకలో తిరిగి టిఆర్‌యస్ జెండా ఎగరవేయాలంటే తీసుకోవల్సిన చర్యలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఇంటిలిజెన్సు వర్గాలతో పాటు ప్రవేట్ ఏజన్సీలతో పక్కాగా సర్వేచేయిస్తున్నారు. ఇటీవల చేసిన సర్వేనే అభ్యర్థుల ఎంపికలో ఫైనల్ అని చెబుతున్నా మరొక సర్వేకూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఒక వేళ పాయం కాక ఇక్కడ ఎవరిని పోటిలో పెడతారు? ఆయన సతీమణి పాయం ప్రమీల పేరును కూడా పరిశీలించే ఆవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఒక సందర్భంలో గతంలో టిఆర్‌యస్ నుంచి పోటిచేసిన బాస్కర్‌నాయక్‌ను పోటి పెట్టాలని అనుకున్నా నియోజకవర్గంలో గిరిజనుల్లో కోయలే అధికంగా ఉండటంతో ఆ సామాజిక వర్గానికి చెందిన వారికే టిక్కెట్ దక్కుతుంది. సీట్టంగ్ లను కాదనుకుంటే పెద్దఎత్తున కసరత్తు జరుగుతుంది. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు రిజర్వుడ్, మరో రెండు జనరల్ నియోజక వర్గాల్లో అభ్యర్థులను మార్చుతారనే ప్రచారం ఉంది. అధినేత కేసీఆర్ అభ్యర్థుల ఎంపిక లో కాస్త కరుకుగానే ఉంటారని టిఆర్‌యస్ వర్గాలే అంటున్నాయి.

గతంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం దాన్ని సాధించటంలో టిఆర్‌యస్, ప్రదానంగా కేసీఆర్ త్యాగం ఉండటంతో దాని నాయకుడుగా ఉన్న కేసీఆర్ పార్టీని ప్రజలు ఆదరించారు. ఈ సారి అభివృద్ధి బంగారు తెలంగాణ , ఎన్నికల వాగ్దానాల అమలు లాంటి వాటిపైనే ఎన్నికలు జరగనున్నాయి. దాంతో పాయం పాట్లు ఫలిస్తాయోలేదో చూడాల్సిందే మరి???

ఆదినారాయణరెడ్డి దొంగా ? దొరా ?

వైసీపీ నాయకురాలు పద్మజ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సంతలో పశువులా అమ్ముడుపోయిన పశు సంవర్ధక శాఖమంత్రి ఆదినారాయణరెడ్డికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నారమల్లి పద్మజ ధ్వజమెత్తారు. చంద్రబాబు వేసిన బిస్కెట్‌లకు అమ్ముడు పోయి వైఎస్ జగన్‌పై రెచ్చిపోయి మాట్లాడితే రోడ్డు మీద పిచ్చికుక్కను కొట్టినట్లుగా కొట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె హెచ్చరించారు. చంద్రబాబు తన అసమర్ధ పాలనను కప్పిపుచ్చుకోవడానికి ఆంబోతుల్లాంటి మంత్రులను ఉసిగొల్పి వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం పద్మజ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ నాయకుడు నాలుగేళ్లుగా ఏం చేశాడో చెప్పే ధైర్యం లేక ప్రతిపక్షంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రకు వస్తున్న ఆదరణను చూసి టీడీపీ నేతలు భయపడుతున్నారన్నారు. మాట తప్పడం, వెన్నుపోటు పొడవడం, అవినీతికి పాల్పడే చంద్రబాబు పంచన తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే నాయకులు చేరి దొంగ స్వామీజీల్లా మైక్‌ల ముందుకు వచ్చి మాట్లాడుతున్నారని పద్మజ విమర్శించారు. పార్టీ ఫిరాయించి రాజీనామా చేసే దమ్ము లేని ఆదినారాయణ రెడ్డి సెక్రటేరియట్ సాక్షిగా ప్రెస్‌మీట్‌లు పెట్టి రామసుబ్బారెడ్డి, నేను చెరో 50 శాతం వాటాలు పంచుకుంటున్నారని చెప్పడం సిగ్గుచేటన్నారు. కేశవరెడ్డి విద్యా సంస్థల ద్వారా రూ. 80 కోట్ల స్కాం జరిగితే దాని నుంచి తప్పించుకోవడానికి పార్టీ ఫిరాయించిన సంగతి అందరికీ తెలుసన్నారు. ఇంతకీ ఆదినారాయణ రెడ్డి దొంగా, లేక దొరా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌కు, చంద్రబాబుకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు.

26న కాగడాల నిరసన ర్యాలీ : రఘువీరా



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా, ఏపి పునర్ వ్యవస్థీకరణ చట్టం2014లోని అంశాలన్నీ రాజీ లేకుండా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలువు మేరకు ఈ నెల 26వ తేదీ సాయత్రం 6.00 గంటల నుంచి 7.00 గంటల వరకు ఏపిసిసి రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్నభవన్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ మీదుగా లెనిన్ సెంటర్ వరకు "కాగడాలతో నిరసన ప్రదర్శన" జరుగు తుం దని ఏపిసిసి కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రదర్శనలో ముఖ్య అతిథిగా ఏపిసిసి అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘు వీరారెడ్డి, ఏపిసిసి సీనియర్ నాయకులు పాల్గొంటారు. కాగడాల నిరసన ప్రద ర్శను విజయ వంతం చేయాలని ప్రజలకు కార్యకర్తలకు రఘువీరా పిలువు నిచ్చారు.

ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రెడీ

వైసీపీ నేత సుధాకర్‌బాబు

మంత్రి ఆదినారాయణరెడ్డి సవాల్‌కు తాము రెడీ అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి టీజేఆర్ సుధాకర్ బాబు ప్రతి సవాల్ విసిరారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయ చరిత్రపై ఎక్కడైనా, ఎప్పుడైనా తాము బహిరంగ చర్చకు తాము సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. దొడ్డిదారిన మంత్రి అయిన ఆదినారాయణరెడ్డికి నిజంగా కడప రెడ్డి అయితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకో మని ఆయన హెచ్చరించారు. ఆదినారాయణరెడ్డికి దమ్ముంటే చంద్రబాబు చరిత్ర, వైఎస్ఆర్ చరిత్రపై చర్చించేందుకు సిద్ధమా అని చాలెంజ్ చేశారు. శని వారం ఆయన విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లా డుతూ ఏపీ మంత్రులు విచక్షణారహితంగా మాట్లాడుతున్నారని, చంద్రబాబు విష కౌగిలిలో చిక్కుకున్న మంత్రి ఆదినారాయణరెడ్డి పంది బురదలో దొర్లినట్లు దొర్లుతూ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ భిక్ష పెట్టిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తావా అని నిలదీశారు.

నోరు అదువులో పెట్టుకుంటే మంచిదని, అవాకులు, చెవాకులు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

అచ్చి నువ్వు 9 నెలలు ఓపిక పట్టు :మంత్రి అచ్చెన్నాయుడుపై కూడా సుధాకర్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అచ్చి నువ్వు 9 నెలలు ఓపికపట్టు, మీ అన్న చనిపోతే నీకు పదవి వచ్చింది. ఆ తర్వాత నీ బాగోతం అంతా శ్రీకాకుళం జిల్లా ప్రజలు బట్టబయలు చేస్తారు. అని అన్నారు.

గ్రీన్ అవార్డులపై సమీక్ష సమావేశం



విజయవాడ, సూర్య బ్యూరో : పచ్చదనంతో ప్రజల ఆరోగ్యం మెరుగుతో పాటు పర్యావరణ సమతుల్యానికి పెద్ద పీట వేస్తూ ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఒక లక్ష్యంతో పనిచేస్తుందని సంస్థ ఎం.డీ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం అర్బన్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆఫీసులో గ్రీన్ అవార్డులపై సంస్థ ఎం.డీ చంద్రమోహన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులకు సమావేశ వివరాలను అందిస్తూ సమాజంలో మొక్కల పట్ల ప్రజలకు అవగాహన పెంచడం మరియు అందరి భాగస్వామ్యంతో చెట్లను పెంచడం, వనాలను పెంచడం వల్లనే హరితాంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనాన్ని వృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పానికి అనుగుణంగా ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించి పచ్చదనం పెంపొందించుటకు ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అవార్డులను ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవార్డులను 8 విభాగాలుగా విభజించడం జరిగిందన్నారు. ఈ అవార్డులకు స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యావనాలు పెంచేవారు, పబ్లిక్ మరియు ప్రైవేట్ పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు, పాఠశాలలు, కళాశా లలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల ప్రాంగణాలు, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్, టెర్రెస్ గార్డెన్స్, వ్యక్తు లు, ఎన్.జి.వోలు, పురాతన చెట్లు, వృక్ష సముదాయాలు సంరక్షించేవాళ్లు ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ధరఖాస్తు ఫారాలను నుంచి డౌన్‌లోడ్ల చేసుకోవచ్చని, పూర్తి చేసిన ధరఖాస్తులను ఎ.పి గ్రీన్ అవార్డ్స్ యాప్ ద్వారా, ఈమెయిల్ ద్వారా లేదా పోస్టు ద్వారా పంపవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 7997650835 నెంబర్‌కు ఆఫీసు పనివేళల్లో ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు. గ్రీన్ అవార్డులకు పూర్తిచేసిన ధరఖాస్తులు చేరవలసిన చివరి తేదీ ఫిబ్రవరి 28, 2018 గా తెలిపారు. మొక్కల పెంపకాన్ని పెంపొందించడానికి ప్రతి సంవత్సరం మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా మొత్తం 120 అవార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. ఇందుకుగాను రోలింగ్ షీల్డ్, జ్ఞాపిక, సర్టిఫికేట్ మరియు నగదు బహుమతులు ఇందులో ఉంటాయన్నారు. ఈ పురస్కారాలను ఎంపిక చేయడానికి నియమించిన జ్యూరీ సభ్యులు వివిధ రంగాలకు సంబంధించిన నిపుణులు ఉంటారన్నారు. గ్రీన్ అవార్డుల ప్రదానోత్సవం 2018 ఏప్రియల్‌లో జరగనున్నదని ఈ బహుమతులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారని మేనేజింగ్ డైరెక్టర్ మీడియాకు తెలియజేశారు.

సవరణ

30-12-2017వ తేదీన పోలవరం ప్రత్యేక కలెక్టర్ వారి కార్యాలయం, రాజమహేంద్రవరం నుండి చింతలపూడి ఎత్తిపోతల పథకంనకు సంబంధించి సూర్య దినపత్రికకు ప్రచురణ నిమిత్తం ఇచ్చిన ప్రకటనలో Ref.D/458/2017 & C1/451/2017కు సంబంధించి ద్వారకాతిరుమల మండలం, రామన్నగూడెం గ్రామంకు బదులుగా 'రామన్న'గా పొరపాటున ప్రచురించినారు. కావున రామన్నగూడెం గ్రామంగా చదువుకొనగలరు

అర్హులకు దక్కని సబ్సిడీ ట్రాక్టర్లు

- ఖమ్మం జిల్లాకు 578 సబ్సిడీ ట్రాక్టర్ల కేటాయింపు
- అనర్హులకు పెద్దపీట వేసిన అధికారులు
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జిల్లా రైతాంగం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రైతులను ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసేవిధంగా ప్రోత్సహించేందుకు సబ్సీడీ కింద ట్రాక్టర్లను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి క్రిషి వికాస్ యోజన, ఎఫ్ ఎం పథకం ద్వారా 75 శాతం సబ్సిడీతో వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు సబ్సిడీ ట్రాక్టర్లను అందజేయాలని నిర్ణయించారు. ఖమ్మం జిల్లాకు 578 సబ్సిడీ ట్రాక్టర్లు మంజూరు కాగా, మెజార్టీ ట్రాక్టర్లను అధికారపార్టీ కార్యకర్తలకు, సానుభూతిపరులకు మంజూరు చేశారన్న ఆరోపణలున్నాయి. సబ్సిడీ ట్రాక్టర్లకు అర్హులైన రైతులను ఎంపిక చేసేందుకు మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారు. సబ్సిడీ ట్రాక్టర్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఆయా కమిటీలు పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన రైతులను ఎంపిక చేయాల్సి ఉంది. కాని జిల్లాలోని చాలా మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకి చెందిన కార్యకర్తలను, సానుభూతి పరులనే లబ్దిదారులు గా ఎంపిక చేశారన్న ఆరోపణలున్నాయి. చిన్న, సన్న కారు రైతులు, మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా అసలు వ్యవసాయం చేయని వారికి, సెంటు భూమికూడా లేని వారిని లబ్దిదారులుగా ఎంపిక చేశారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. పాలేరు నియోజకవర్గంలో ఎంపికైన లబ్దిదారుల్లో మెజారిటీ లబ్దిదారులు అధికార పార్టీకి చెందిన వారే ఉన్నారని స్థానిక కాంగ్రెస్‌నేతలు పేర్కొంటున్నారు. అనంతసాగర్, పాతర్ల పాడు గ్రామాల్లో కూడా చాలా మంది అనర్హులను ఎంపిక చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులుగా వ్యవహరించే వారిని ప్రభుత్వ పథకాల్లో లబ్దిదారులుగా ఎంపిక చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదంటున్నారు. మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో 22 మంది లబ్దిదారుల్లో 9 మంది టీఆర్‌ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులేనని అంటున్నారు. తిరుమలయాపాలెం, నేలకొండపల్లి, మధిర మండలాల్లోనూ ఇదే తంతు కొనసాగుతోందన్నారు. సబ్సీడీ ట్రాక్టర్ల మంజూరులో అధికార పార్టీనేతల ఒత్తిళ్లకు తోడు అధికారుల అవినీతి వల్లే అర్హులకు సబ్సిడీ ట్రాక్లర్లు దక్కకుండాపోయాయని అంటున్నారు.

చింతకాని మండలం లచ్చగూడెంకు చెందిన మహిళా రైతు .మండల వ్యవసాయ శాఖ అధికారికి 10వేల లంచం ఇచ్చినప్పటికీ లబ్దిదారుల ఎంపికలో తన పేరులేదని ఆమె జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. అర్హులైన చాలా మంది రైతులు, తమని లబ్దిదారులుగా ఎంపిక చేయలేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా లబ్దిదారులకు ట్రాక్టర్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదు

మంత్రి నక్కా ఆనందబాబు



గుంటూరు,సూర్యబ్యూరో: రాయలసీమలో రెండో రాజధాని పెట్టాలన్న బీజేపీ నేతల తీర్మానాన్ని మంత్రి నక్కా ఆనందబాబు తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికే కేంద్రం నిధులు ఇవ్వడంలేదని, విభజన హామీ చట్టాన్ని అమలు చేయడం లేదని మంత్రి విరుచుకుపడ్డారు. ముఖ్య మంత్రి చంద్రబాబుపై ఆరోపణలు చేసిన సోము వీర్రాజు జగన్ ఏజెంటుగా పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వాళ్ల సత్తా ఏంటో ప్రజల్లోకి వస్తే తెలుస్తుం దని మంత్రి ధ్వజమెత్తారు. చంద్రబాబు ఢిల్లీకి పలుమార్లు వెళ్లినా ప్రధాన మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. జగన్, వైసీపీ నేతల వైఖరిని ఆనందబాబు దుయ్యబట్టారు. ప్రధాని మోదీకి జగన్, వైసీపీ ఎంపీలు భయపడుతున్నారని, కానీ టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం ధైర్యంగా పోరాటం చేస్తున్నారని ఆయన అన్నారు. రాయలసీమ అభి వృద్ధికి కేంద్రం రూ. 600 కోట్లు ఇచ్చిందని, అటువంటిది ,ఇవాళ బీజేపీ నేతలు రాయలసీమలో మీటింగ్ పెట్టుకుని, కొత్త విధానంలో మాట్లాడడం అవివేకమని, అజ్ఞానమని మంత్రి ఆనందబాబు అన్నారు. తాను బీజేపీ నేతలు అందరినీ అనడం లేదని, ఎవరైతే అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారో వారిని ఉద్దేశించి మాత్రమే మాట్లాడుతున్నానని ఆయన అన్నారు. వాళ్ల స్థాయి తెలుసుకోకుండా విమర్శలు చేస్తున్నారని, వాళ్ల ఉనికిని కాపాడుకోవడం కోసం రాష్ట్రాన్ని అబాసుపాలు చేసే పనులు చేయద్దని నక్కా ఆనందబాబు హెచ్చరించారు. ఈ విధంగా ప్రవర్తిస్తున్న బీజేపీ, వైసీపీ నాయకులకు ఇదే హెచ్చరికని ఆయన అన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర హెూమ్ మంత్రి నాయిని నరసింహరెడ్డి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః దేశ రక్షణకోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేసిన పారా మిలిటిరీ, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్,ఐటిబిపి,ఎస్ఎస్బి,అస్సాంరైఫిల్స్ సైనికుల సేవలు మరువ లేనివని రాష్ట్ర హోం మంత్రి నాయిని నరసింహరెడ్డి అన్నారు.శనివారం సిఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్ లో నిర్వహించిన పారా మిలిటిరీ, మాజీ సైనిక ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు చెందిన భారీ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. రిటైర్డ్ ఐన పారా మిలిటిరీ,బిఎస్ఎఫ్,సిఐఎస్ఎఫ్, ఐటిబిపి,ఎస్ఎస్బి, మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృాఎత నిచ్చయం తో ఉందని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా సెంట్రల్ ఆర్మీఫోర్సు,మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం విజ్ఞప్తుల పై మంత్రి సానుకూలంగా స్పందించారు.సంఘం చేసిన విజ్ఞప్తులను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకవెల్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని నాయిని హామీ ఇచ్చారు.అంతకు ముందు సంఘం జాతీయ కార్యదర్శి తుమ్మల రాజేష్ కుమార్ మాట్లాడుతూ మాజి జవాన్లకు విద్య,వైద్యం,ఆరోగ్య రంగాలలో రిజర్వేషన్లు అమలు చేయాలనీ,అన్ని జిల్లా కేంద్రాలలో రిటైర్డ్ పారామిలిటిరి సిబ్బందికి ఉచిత వైద్యం అందించాలని కోరారు.ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యం లో హోం మంత్రికి వినతి పత్రం సమర్పించారు.రాష్ట్ర సచివాలయం లో సైనిక బోర్డ్ కార్యాలయం మాదిరిగా రిటైర్డ్ పారామిలిటిరి సిబ్బందికి వారి సేవా నిమిత్తం కార్యాలయం ఏర్పాటు చేయాలనీ,కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ పారామిలిటిరి సిబ్బందికి కోసం జారి చేసిన జి.ఓ.లను అమలు చేయాలని,5 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాఇంచాలని,ప్రొఫెషనల్ టాక్స్ ,ఇంటి పన్ను రద్దు చేయాలనీ కోరారు.వీటి పై స్పందించిన నాయిని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న జి.ఓ లను ప్రభుత్వం దృాఎష్టికి తెస్తే పరిస్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోసి ఆర్.పి.ఎఫ్ అదనపు డి.జి. పంకజ్ కుమార్, సిఐఎస్ఎస్ఎఫ్ ఐ.జి.జగ్బీర్ సింగ్ ,ఎస్డి పాండే, ఆర్.పి.ఎఫ్ డిఐజి తదితరులు ప్రసంగించారు. జాతీయ అద్యక్షులు అహమ్మద్ అలీ,జాతీయ అదనపు కార్యదర్శి,రాష్ట్ర అద్యక్షులు జి.వి.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కే.పి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎపికి ప్రాధాన్యతతో కూడిన నిధులు కేటాయించాలి : రఘువీరా

విజయవాడ, సూర్య బ్యూరో : 2018 మార్చిలో జరగనున్న పార్లమెంటు సమావే శాల్లో కేంద్ర 5వ బడ్జెట్‌లో తగిన సవరణలు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యతతో నిధులు కేటాయించి న్యాయం చేయాలని భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఏపిసిసి అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి వినతి పత్రాన్ని శనివారం అందజేసినట్లు ఎపిసిసి కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా, నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ హామీలు, ఎ.పి. పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అన్ని అంశాల అమలుకు సంపూర్ణ బాధ్యత తీసుకుంటుందని, కాంగ్రెస్ (యుపిఎ) చేసినదానికన్నా ఎక్కువే చేస్తామని 2014 ఎన్నికల సందర్భంలో పార్లమెంటు లోపల, బయటా మీ పార్టీ (బాజాపా) చేసిన వాగ్దానాల, హామీల చరిత్రను మీకు మరోసారి మీ దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. ఈ నేపధ్యంలో కేంద్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా నికి ప్రాధాన్యతతో అమలు చేయాల్సిన అంశాలకు సంబంధించి ప్రతి బడ్జెట్ కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యతలు ఇస్తారని ఆశించిన రాష్ట్రప్రజలకు మీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీవ్ర నిరాసను మిగిల్చిందన్నారు. భారత పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు, చేసిన చట్టాలు అములు కాకపోవడం చూస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు మొదటిసారి భారత పార్లమెంటరీ ప్రజా స్వామ్య వ్యవస్థమీద, భారత సమాఖ్య వ్యవస్థమీద అవిశ్వాసాన్ని వ్యక్తంచేసే పరిస్థితులు నేడు రాష్ట్రంలో నెలకొంటున్నాయని చెప్పడానికి విచారిస్తున్నా మన్నారు. 2018 మార్చి నెలలో ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్‌లో సవరణలు తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం జరిగే విధంగా నిధులు కేటాయింపులు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజల తరవున కోరుతున్నామన్నారు.



సిఐఐ సదస్సులో కీలక ఒప్పందాలు

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వన్
- సన్‌రైజ్ స్టేట్ ఆఫ్ ఇండియాలో పెట్టుబడులు పెట్టాలి
- గూగుల్ కంపెనీ మధ్య ఒప్పందం


(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ ప్లీనరీ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత అనేక సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. కనీసం రాజధాని కూడా లేకుండా ప్రయాణం ప్రారంభించామన్నారు. ఇతర దక్షణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం తక్కువుగా ఉందన్నారు. కేవలం మూడున్నర ఏళ్లలోనే సమస్యలను అధిగమించి అభివ ద్ధి వైపు అడుగులు వేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ 2022 నాటికి దేశంలో అభివ ద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఒక్కటి గానూ,2029 దేశంలో నెంబర్ వన్ స్థానంలోనూ, 2050 కి ప్రపంచంతోనూ పోటీ పడాలి అని లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామన్నారు. లక్ష్యాలు సాధించాలి అంటే 15 శాతం వద్ధి సాధించాలన్నారు. ప్రస్తుతం 12 శాతం వృద్ధి సాధించామన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సైబరాబాద్‌ని నిర్మించారన్నారు. ఇప్పుడు నవ్యాంధ్ర ప్రదేశ్‌ను నిర్మిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రీన్ ఫీల్డ్ రాజధాని అమరావతి నిర్మిస్తున్నామన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం 35 వేల ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. రాజధాని మాస్టర్ ప్లాన్ సింగపూర్ చేసిందన్నారు. అమరావతి వరల్డ్ క్లాస్ సిటీగా మారబోతుందన్నారు. ముఖ్యమైన భవనాలను నార్మన్ ఫాస్టర్స్ రూపొందించిం దన్నారు. బ్లూ జోన్‌ని డచ్ రూపొందించిందన్నారు. అమరావతి హైటెక్ క్యాపిటల్‌గా మారబోతుందన్నారు. అధునాతన టెక్నాలజీల అభివద్ధి అమరావతిలో జరగబోతుందన్నారు. హెచ్‌సిఎల్ కంపెనీ అధునాతన టెక్నాలజీల పై అమరావతిలో పరిశోధన మరియు అభివృద్ధి చెయ్యబోతుందన్నారు. విశాఖపట్నం ఐటి హబ్‌గా మారుతుందన్నారు. విశాఖలో ఫింటెక్ వ్యాలీ ఏర్పాటుతో ఫైనాన్సియల్ టెక్నాలజీ కంపెనీలు అన్ని విశాఖపట్నంకు వస్తున్నాయన్నారు. రాయలసీమ జిల్లాలు తయారీ రంగానికి హబ్‌గా మారుతున్నాయన్నారు. అనంతవురంలో ప్రపంచంలోనే అతి పెద్ద కార్ల కంపెనీ కియా ఏర్పాటు అవుతుందన్నారు. కియా కంపెనీ పనుల ప్రారంభం నుండి మొదటి కారు ప్రొడక్షన్ కేవలం 15 నెలల్లో జరగబోతుందన్నారు. ఫాక్స్ కాన్ ,సెల్ కాన్, డిక్సన్,కార్బన్ లాంటి ఎలక్ట్రానిక్ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు ప్రారంభించా యన్నారు. అప్పుడే వుట్టిన బిడ్డలా కేవలం మూడున్నర ఏళ్లలోనే ఎంతో అభివృద్ధి సాధించగలిగామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్ ఒన్‌గా ఉన్నామన్నారు. కంపనీల ఏర్పాటుకు కావాల్సినంత ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉందన్నారు. 21 రోజుల్లోనే కంపనీల ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమతులు కేటాయిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వునరుత్పాదక శక్తిని అభివృద్ధి చేస్తు న్నామన్నారు. కర్నూలు లో అతి పెద్ద సోలార్ పార్క్ ఏర్పాటు చేసామన్నారు. దేశంలో విద్యుత్ చార్జీలు పెంచబోము అని ప్రకటించిన ఒకే ఒక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. కేవలం తొమ్మిది నెలల్లోనే నదుల అనుసంధానం చేసి చూపించామన్నారు. గోదావరి,క ష్ణా నదుల అనుసంధానం పూర్తి చేసామన్నారు. మరిన్ని నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రం లో నీటి కొరత లేకుండా చేయబోతున్నామన్నారు. పేపర్ లెస్ గవర్నమెంట్ అమలు చేస్తున్నామన్నారు. ప్రతి నెల ఫైల్స్ క్లీయరెన్స్ పై ముఖ్యమంత్రి సమీక్ష ఉంటుంది. మంత్రులుగా ఫైల్స్ క్లీయరెన్స్ పై పోటీ పడి మరీ పనిచేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న యువతి,యువకులను అధునాతన టెక్నాలజీల్లో ఉద్యోగాలు అందివుచ్చుకోవడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. నిరంతరం స్కిల్ డేవెలప్మెంట్ మరియు పరిశ్రమలకు కావాల్సిన శిక్షణ ఇస్తున్నామన్నారు. సన్‌రైజ్ స్టేట్ ఆఫ్ ఇండియాలో పెట్టుబడులు పెట్టాలి అని అందరిని ఆహ్వానిస్తున్నానన్నారు.





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ కంపెనీ మధ్య ఒప్పందం ముఖ్య మంత్రి చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒప్పందం చేసుకున్న ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ సెక్రెటరీ విజయానంద్, గూగుల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అంజలి జోషి గూగుల్ స్టేషన్ ప్రాజెక్టు కు సంబంధించి గూగుల్ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ గూగుల్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని పంచాయతీలలో 2018 పూర్తయ్యే నాటికి వైఫై సౌకర్యం మారుమూల గ్రామాలతో సహా రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు ఫ్రీ వైఫై సౌకర్యం వైఫై ద్వారా రాష్ట్రంలోని మారుమూల గ్రామలతో పాటు అన్ని పంచాయతీలకు అందుబాటులోకి గూగుల్ స్టేషన్ వైఫై గూగుల్ స్టేషన్ ఏర్పాటు చేసిన వైఫై ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజన గ్రామంలోని పాఠశాల విద్యార్ధులతో మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లాలోని బండా గ్రామ విద్యార్థులతో గూగుల్ స్టేషన్ వైఫై ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లుతుందని అందుకు రైతు పండించిన పంటను కాపాడటానికి సకాలంలో సరైన చర్యలు తీసుకుం టామని అందుకే ప్రకాశం బ్యారేజి నుంచి 700 వందల క్యూసెక్కుల నీరు విడుదల చేయడం జరుగుతుందని జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తమ సమీక్షలో తెలిపారు. శనివారం జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు జల వనరుల శాఖ కార్యాలయంలో నీటి విడుదలపై అధికారులతో సమీక్షిం చారు. మంత్రి ఆదేశాల మేరకు అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాలలో మొక్క జొన్న పంటను కాపేడేందుకు ప్రకాశం బ్యారేజ్ నుంచి ఏడు వందల క్యూసె క్కుల నీరును ఆయా ప్రాంతాలకు వదలినట్టు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. మొక్కజొన్న పంట నీరు లేక ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని, రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

బీజేపీతో జగన్ లాలూచీ పడ్డారు

ఎంపీ సీఎం రమేష్



విశాఖపట్నం, సూర్యబ్యూరో : ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్ర ప్రభుత్వం పడిపోదని ఎంపీ సీఎం రమేష్ వ్యాఖ్యానించారు.శనివారం ఆయన మాట్లాడుతూ అవిశ్వాసం పెడితే కేంద్ర ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి ఉండాలని, సమస్య పరిష్కారం అవుతుందంటే ఎప్పుడో రాజీనామా చేసే వాళ్లమన్నారు. బీజేపీతో జగన్ లాలూచీ పడ్డారని ఆయన దుయ్యబట్టారు. కేసుల నుంచి బయటపడేందుకే అవిశ్వాస తీర్మానాన్ని జగన్ తెరపైకి తెచ్చారని, అధికారులను బెదిరిస్తున్న విజయసాయిరెడ్డిపై కేసు పెట్టాలని సీఎం రమేష్ డిమాండ్ చేశారు.

వైసీపీ ఎంపీల రాజీనామాలు సరికాదు

మాజీమంత్రి కొణతాల రామకృష్ణ



విశాఖపట్నం, సూర్యబ్యూరో: ప్రత్యేక హోదా కోసం వైసీపీ ఎంపీల రాజీనామాలు సరికాదని, పార్లమెంటులో ఏపీ సంఖ్యాబలం తగ్గకుండా చూడాలని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో పార్టీలకతీతంగా మన వాణి వినిపించాలని కోరారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా కోసం జాతీయ స్థాయిలో చర్చ జరగాలని, గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రస్తుతం శిక్ష అనుభవిస్తోందని, ఇదే పరిస్థితి రాకుండా బీజేపీ చూసుకోవాలని కొణతాల రామకృష్ణ హితవు పలికారు

దళిత వాడల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



నెల్లూరు, సూర్య ప్రతినిధి : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీల్లో వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు దాటినా దళిత వాడల అభివృద్ధికి నోచుకోలేదని, గత ప్రభుత్వాలు, కొన్ని జాతీయ పార్టీలు దళితుల్ని ఓటు బ్యాంకులుగా మాత్రమే చూశాయని మంత్రి నారాయణ అన్నారు. గత మూడేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ. 19 వేల కోట్లు కేటాయించిదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం, ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యోన్నతి, అంబేద్కర్ స్మృతి వనం వంటి అనేక కార్యక్రమాల ద్వారా ఈ ప్రభుత్వం ఎస్టీల అభ్యున్నతికి పాటుపడుతోందని మంత్రి నారాయణ వివరించారు.

రెండవ దశలో 116 రోజుల జల సంరక్షణ ఉద్యమం

జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 116 రోజుల జల సంరక్షణ ఉద్యమంలో నీటి సంఘాల సభ్యుల లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని, లేనిపక్షంలో వారి పనితీరును సమీక్షించాల్సి ఉంటుందని జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం జలవనరుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 116 రోజుల జలసంరక్షణ ఉద్యమం రెండవ దశ కార్యక్రమం కార్యాచరణ ప్రణాళికపై సబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి హాజరై మాట్లాడుతూ మార్చి మూడవ తేదీన శ్రీరామ కృష్ణయ్య జన్మదినాన్ని వురస్కరించుకొని ఏర్పాటు చేసే కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులతో సమగ్రంగా 116 రోజుల జలసంరక్షణ ఉద్యమం రెండవ దశపై సమీక్షిస్తామన్నారు. రెండవ దశ జలసంరక్షణ చర్యలలో భాగంగా ఆయా ప్రాంతాలలో రూపొందించుకున్న కార్యాచరణ ప్రణాళికలు అమలు విధానంపై స్పష్టమైన విదివధానాలతో ఆ సమావేశానికి హాజరుకావాలన్నారు.

జలసంరక్షణ పనుల కోసం ప్రస్తుతం ఒక పనికి ఇస్తున్న 10 లక్షల బడ్జెట్‌ను 20 లక్షల వరకు పెంచటానికి ముఖ్యమంత్రి స్థాయిలో ఆమోదం కోసం ప్రతిపాదనలు రూపొందించి పంపించామని, అవి త్వరలోనే ఆమోదం పొందుతాయని తెలి పారు. జలసంరక్షణ కింద చేపట్టే పనులను సమర్ధవంతంగా వూర్తిచేయ టానికి గతంలో ఆయా ప్రాంతంలో పనిచేసి పదవీ విరమణ చేసిన సాంకేతిక పరిజ్ఞానం కల్గిన ఉద్యోగుల సేవలను సమయానుకూలంగా వినియోగించు కోవాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. అవ్పుడే మెరుగైన ఫలితాలను సాదించటంతోపాటు, అనుకున్న లక్ష్యాలను సాధించటంతోపాటు, వారి అనుభవాలు భవిష్యత్‌కు ఎంతో ఉపయుక్తంగా తోడ్పడతాయన్నారు. వివిధ నియోజకవర్గాలలో జలసంరక్షణ ప్రభుత్వం చేపడుతున్న రెండవదశ కార్యక్రమాలలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొని దిగ్విజయం చేయాలన్నారు.



జల సం రక్షణ కింద చేపట్టే పనులు ఒక పద్దతి ప్రకారంగా లక్ష్యానికి అనుగుణంగా అధికారుల కృషి చేయాలని, అనుకున్నవిధంగా పనులు పూర్తికాకపోతే ఉపేక్షించేది లేదన్నారు. కొత్తగా యువ ఇంజనీర్లు ఉద్యోగాలు పొందారని వారు సీనియర్ల నుంచి పనివిధానం తెలుసుకుని చేయాలని సూచించారు. 116 రోజుల జలసంరక్షణ ఉద్యమం రెండవ దశ కార్యక్రమం లో ఎస్‌ఈ రమేష్ బాబు, మైనర్ ఇరిగేషన్ ఛీఫ్ ఇంజనీర్ ఏజీ మల్లిఖార్జున్ రెడ్డి, కేడీఎస్ సీఈ సతీష్ కుమార్, స్పెషల్ డివిజన్ ఈఈ కే. శ్రీనివాస్ ఈఈ, డీఈ, ఏడబ్లూఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది నిరసన



విజయవాడ, సూర్య బ్యూరో : జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా సిబ్బంది ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం జరిగింది. విధులకు హాజరై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బి.మనోరంజని మాట్లాడుతూ ఎపి విభజన తర్వాత నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ ఎవ్వరికి పదోన్నతులు ఇవ్వకపోగా ఇతర శాఖల నుంచి శాఖపై అవగాహన లేని జూనియర్స్‌ను అధికారులుగా నియమిస్తున్నారన్నారు. దీనివలన పనిలో జాప్యం, సిబ్బందిలో అవగాహన లోపించడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా మార్పు చేర్పులు సరిదిద్ది తమకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.ఎల్. అన్నపూర్ణ మాట్లాడుతూ ఇటీవల కొత్తగా నియమించినబడిన జగదాంబ అనే అఫీసర్‌తో కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇప్పటికైనా తమ శాఖలో సరైన విధాన ప్రకియ ద్వారా మార్పులు నిర్వహించి తమ న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది మహిళా సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొని నిరసన తెలిపారు.

ఘనంగా ఇగ్లీష్ డే ఉత్సవాలు



విజయవాడ, సూర్య బ్యూరో : ఘనంగా 'ఇగ్లీష్ డే' ఉత్సవాలు నగరంలో జరిగాయి. శ్రీ గౌతమ్ హైస్కూల్ బ్రాంచ్‌లో అంగరంగ వైభవంగా స్కూల్ కరస్పాండెంట్ ఎన్. సూర్యారావు అధ్య క్షతన శనివారం జరిగాయి. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలచే ఇంగ్లీష్‌లో ప్రదర్శింపబడిన స్వచ్ఛభారత్, మంచి అలవాట్లు, ఉమెన్ ఎంపర్‌మెంట్ గురించి బాలల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి, జీవిత మార్గదర్శాల గురించి పిల్లలు చక్కగా చెప్పారని తెలుగు తోపాటు ఆంగ్ల మాధ్యమం కూడా ఈ రోజుల్లో అవసరమని తెలియజేస్తూ పిల్లలను అభినందించారు. అధినేత సూర్యారావు మాట్లాడుతూ ఇంగ్లీష్‌ను పిల్లలు సులభతరంగా నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఇగ్లీష్ అండ్గ స్పోకెన్ ఇంగ్లీష్ సంస్థతో ఒప్పందం కదుర్చుకొని వ్యాకారణ తప్పిదాలు లేకుం డా ఇంగ్లీష్ నేర్పాలనే ఉద్దేశ్యంతో ముందు టీచర్స్‌కి తర్ఫీదు ఇచ్చి పిల్లలకు నేర్పించే విధంగా అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి.ఆదిలక్ష్మి, స్కూల్ ఇన్‌ఛార్జి పి.శ్రీరామ్, తులసి, సునీత, సులోచన, లలిత, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొని పిల్లలు ప్రదర్శించిన ప్రదర్శనలు తిలకించి అభినందించారు.

దేవుడుచెరువులో ఇళ్ల పట్టాల పంపిణీ

జల వనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

మైలవరం, మేజర్‌న్యూస్ : దశాబ్దాలుగా దేవుడు చెరువులో పట్టాల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూసారని... ఇప్పుడు మీకు పసువు- కుంకుమ, చీర జాకెట్‌తో చంద్రన్న ఇంటి పట్టా అందిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఒక వారం రోజుల్లో 372 పట్టాలు ఎన్టీఆర్‌నగర్‌లో పంపిణీ చేస్తానని తెలిపారు. మైలవరం నియోజకవర్గ స్ఫూర్తి జిల్లాలో 1 లక్షా 17 వేల పట్టాలు అయ్యాయని ఆ విధంగా మన నియోజకవర్గం రాష్ట్రానికి ఆదర్శమయ్యిందన్నారు. పేదవాళ్లకు ఉచితంగా ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని, ఒక ఇంటివాళ్ళు అవ్వాలన్న సంకల్పంతో చంద్రన్న ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గ్రామంలో ఇంటి స్థలం అడిగే వారు లేకుండా పని చేస్తానని మంత్రి ఉమా స్పష్టం చేశారు. ఎక్కడా తప్పు జరగకుండా ప్రతి కుటుంబానికి ఇంటి పట్టా అంద జేస్తామన్నారు. ఒక్కో ఇంటి పట్టా ఖరీదు 5 లక్షల నుండి 10 లక్షల ఖరీదు చేస్తుందని, ఇంత విలువైన స్థలాలు దశాబ్దాలుగా మీకు రాలేదని, మంత్రి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ల గానే అన్ని రెగ్యులరైజ్ చేసి ఇవ్వమని స్పష్టం చేసారని తెలిపారు. పెండింగులో ఉన్న అన్నింటిని మంత్రి మండలి సమావేశంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిష్పక్షపాతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు అందజేయమని అధికారులను ఆదేశించినట్లు మంత్రి దేవినేని తెలిపారు.





రాబోయే రోజుల భవిష్యత్ నిర్దేశకులు విద్యార్థులే

సీపీ గౌతమ్ సవాంగ్

విజయవాడ, సూర్య బ్యూరో : రాబోయే రోజుల భవిష్యత్ నిర్దేశకులు నేటి తరం విద్యార్థులేనని విజయవాడ పోలీసు కమీషనర్ గౌతమ్ సవాంగ్ అన్నారు. సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్రటరీ స్టడీస్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫెలోషిప్స్‌పై వర్క్‌షాప్ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నోవా గ్రూప్ విద్యా సంస్థల సౌజన్యంతో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో ప్రతి అవకాశాన్ని అందివుచ్చుకున్న వారే సమాజంలో ముందుంటారన్నారు. సమయాన్ని ఏ మాత్రం వృధా చేసుకోకుండా సద్వినియోగం చేసుకొన్నవారే సమాజంలో మేధావులుగా గుర్తింవు పొందుతారన్నారు. మానవ వనరులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొదవ లేదన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాభి వృద్ధికి అవిరళ కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగరం ప్రపంచ స్థాయి నగరంగా రూవుదిద్దు కొంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అన్ని దేశాల లోనూ భారతీయులు ఆ, ఆ దేశా లలో ఉన్నతోద్యోగాలు చేస్తూ వున్నారని, అందులో ఆంధ్రులు ఎక్కువ శాతం మంది వున్నారన్నారు. నోవా విద్యా సంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి కృష్ణారావు, ఎపి, తెలంగాణా మాజీ సమా చార హక్కు కమీషనర్ ఎం. విజయ నిర్మల, సిహెచ్‌ఎస్‌ఎస్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కన్నెగంటి రమేష్‌బాబాబు మాట్లాడుతూ దేశ విదేశాలలో ఉన్నత విద్య నంది వుచ్చుకోవడానికి సిహెచ్‌ఎస్‌ఎస్ వేదిక అవుతుందన్నారు. సామర్థ్యాలుంటే ఎవరి సిఫార్సులు అవసరంలేదని, అవకాశం అందివుచ్చు కోవచ్చున్నారు. వారి మేధాశక్తే విదేశాలలో ఉన్నత విద్యకు పెట్టుబడి అన్నారు. కార్య క్రమంలో ప్రతినిధి పలుదేశాలలో వున్న విశ్వ విద్యాలయాలలో వారు చదువ గోరు కోర్సులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లు, అందుకు సులువైన మార్గాలు విద్యార్థు లకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించారు. ఏ దేశమేగినా ఎందుకా లిడినా పొగడరా నీ భూమి భారతి అనే దానిని భారతీయులందరూ గుర్తుంచు కోవాలి అవుడే దేశౌన్నత్యం ప్రపంచ దేశాలలో గుర్తింవు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్దులు, వివిధ శాఖలకు సంబంధిం చిన వారు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.






పెరుగుతున్న ఎండలు



విజయవాడ, సూర్య బ్యూరో : కోస్తా, రాయలసీమల్లో ఎండలు పెరిగాయి. సముద్రం నుంచి తేమగాలులు లేకపోవడం, ఆకా శం నిర్మలంగా వుండడంతో ఎండ తీవ్రత కొనసాగింది. పలుచోట్ల 35 డిగ్రీలు, అంత కంటే ఎక్కువగా నమోదయ్యాయి. కర్నూలులో 36 డిగ్రీ లు నమోదైంది. ఇక శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో చలి ప్రభావం కొనసాగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆరోగ్యవరంలో 16 డిగ్రీలు నమోదైంది. రానున్న రెండు రోజుల వరకు ఇదే మాదిరిగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవు తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇక కోస్తా, రాయలసీమలో పొడి వాతా వరణం కొనసాగుతుందని పేర్కొంది.

నేటి నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు



తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు ఆదివారం రాత్రి 7 గంటలకు తెప్పోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం తెప్పను సిద్ధం చేసి విద్యు ద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వుష్కరిణిని అందంగా అలంకరించా రు. ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామి, అమ్మవారు వుష్కరిణిలో ఆనందవిహారం చేస్తారు.తెప్పోత్సవాల్లో తొలిరోజు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్ర మూర్తి తెప్పలపై వుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు.

మనటీవీ ఛైర్మన్‌గా ఇనగంటి అనిల్, సీఈఓగా కేశవరావు నియామకం

విజయవాడ, సూర్య బ్యూరో : మనటీవీ ఆంధ్రప్రదేశ్ ఛానళ్ల నిర్వహణ కోసం ఛైర్మన్, సీఈఓలని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఛైర్మన్‌గా ఇనగంటి అనిల్, సీఈఓగా బి.కేశవరావుని ప్రభుత్వం ఎంపిక చేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులని వెలువరించింది. మీడియా రంగంలో దశాబ్దంపైగా అనుభవం ఉన్న అనిల్, గతంలో మహాటీవీ ఎండీగా బాధ్యతలు నిర్వహించారు. ఇరవైయేళ్లుగా టీవీ జర్నలిజంలో విశేష కృషి చేసిన కేశవ్, ఎలక్ట్రానిక్ మీడియాలో భాష గురించి పలు వుస్తకాలు రాశారు. దూరవిద్య, గ్రామీణ అభివృద్ధి, టెలిమెడిసిన్, డిజిటల్ ఎడ్యుకేషన్ వ్యాప్తి కోసం మనటీవీ ఛానళ్లు ప్రసారాల్ని రూపొందిస్తాయి. మనటీవీ నెట్‌వర్క్‌ని శాప్ నెట్ పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారు. అమరావతి కేంద్రంగా మనటీవీ ఆంధ్రప్రదేశ్ ప్రసారాలని వూర్తిస్థాయిలో అందుబాటు లోకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కతనిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ)ని అమల్లోకి తేవడంతో ప్రభుత్వ సేవలు, దూరవిద్య, డిజిటల్ ఆంధ్రప్రదేశ్‌ని విస్తృతంగా ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు శాప్ నెట్ విశేషంగా కృషి చేయనుంది.



విశ్వకవి 'జనగణమన'కు శతవసంతాలు

మదనపల్లిలో ఘనంగా ఉత్సవాలు

రవీంద్రుడు తన జనగణమనను చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో రాశారు. బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని రాసింది కూడా రవీందడే. జనగణమనను మన భారత రాజ్యాంగం 1950 జనవరి 24న జాతీయ గీతంగా స్వీకరించింది. ఆయన మొదటిసారి బెంగాలీలో ఈ గీతాన్ని ఆలపించారు. ఈ గీతానికి బాణీలు కట్టింది కూడా విశ్వకవే. ఆ తర్వాత ఇంగ్లీషులోకి అనువదించారు. భారత జాతీయ గీతం జనగణమనను ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గీతంగా యునెస్కో గుర్తించింది. వందేళ్లు పూర్తి చేసుకున్న జనగణమనకు మదనపల్లిలో భారీగా సంబరాలు నిర్వహిస్తున్నారు స్థానికులు.

భారతీయ జాతీయ ఉద్యమానికి స్ఫూర్తిరగిల్చిన జనగణమణ గీత రచనకు మన తెలుగురాష్ట్రమే వేదికగా నిలచిందన్నది చాలా మందికి తెలియని నిజం. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని మదనపల్లెలో హోమ్రూల్స్ వ్యవస్థాపకురాలు అనీబీసెంట్ స్థాపించిన బీసెంట్ థియోసాఫికల్ (బీటీ) కళాశాల విద్యార్థులతో కలిసి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. 1919 లో నేషనల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న విశ్వకవి రవీంథ్రనాథ్ ఠాగూర్ బెంగళూరుకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న బీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఉన్న డాక్టర్ కజిన్స్ బెంగళూరుకు వెళ్లి శాంతినికేతన్ స్ఫూర్తితో తాము నిర్వహిస్తున్న కళాశాలను సందర్శించాలని ఠాగూర్‌ను ఆహ్వానించారు. కజిన్స్ ఆహానం అంగీకరించిన రవీంద్రనాథ్ ఠాగూర్ 1919 ఫిబ్రవరి 24నచిత్తూరు జిల్లాలోని మదనపల్లెకు వచ్చారు. ఇక్కడి కళాశాల వాతావరణం విద్యార్థుల ప్రవర్తన పట్ల ముగ్ధుడయిన ఆయన ఇక్కడే ఆరురోజుల పాటు గడిపాలని అనుకున్నారు. రవీంద్రుని రాక సందర్భం గా కళాశాలలో నిర్వహించిన ఇండోర్ గేమ్స్, సంగీత పోటీలకు ఆయన హాజరయ్యారు. ఈ పోటీల సందర్భంగా జాతిని స్ఫూర్తిని నింపేలా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలకు స్పందించిన ఠాగూర్ తనని తానే మైమరచిపోయారు. విద్యార్థుల సంగీత భరిత దేశభక్తి గీతాలకుతోడూ అద్భుత వాతావరణంతో ఈ కళాశాలలోని లైబ్రరీలో కూర్చున్న రవీంద్రుడు విద్యార్థులను ఉత్తేజపరచడానికి బెంగాలీ భాషలో తను రచించిన జనగణమనను ద మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా భారతదేశ సుప్రభాతం పేరిట ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. జాతీయగీతాన్ని బీటీ కళాశాలలోని అప్పటి విద్యార్థులచే ఆంగ్లంలోకి అనువదించి బీటీ కళాశాల ప్రిన్సిపాల్ జేమ్స్ హెచ్.కజిన్స్‌కు ఇవ్వగా కళాశాలలో సంగీత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భార్య మార్గరేట్ కజిన్స్‌కు అనువదించిన జనగణమణ గీతాన్ని అందించారాయన. ఈ గీతానికి అలా మార్గరేట్ కజిన్స్ బాణి సమకూర్చడంతో పాటు. కళాశాలలో పోటీలలో ముగింపు సమావేశంలో ఈ గీతాన్ని తొలిసారిగా తానే స్వయంగా ఆలపించడంతో ఆ ప్రాంతమంతా హర్షాతిరేకమైంది.

కాగా విశ్వకవి రవీంద్రుడు జనగణమన గీతాన్ని 31చరణాలతో రచన సంస్కృత భాష కలగలిసిన బెంగాలీ భాష రచించారు. దైవానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే భారతీయులంతా దీనిని అమోదించేందుకు వీలుగా ఆయన నదీమతల్లులను తన గీతంలో పొందు పరిచారు. ముఖ్యంగా భగవంతుని ఎడ విశ్వాసం ఉంచే వారు జనగణమన ని ఆలయా లలో సైతం కీర్తించుకునేలా రూపొందిం చారంటే అతి శయెక్తి కాదేమో. అయితే భారతీయులంతా దీనిని తమ మాతృ గీతంగా అనుభూతి చెంది పాడుకునేలా రూపుదిద్దా లని అప్పటి స్వతంత్ర్య సమరయోధుల సూచనలతో రవీంద్రుడు తన గీతాన్ని పూర్తిగా తగ్గించారు. వీటిలో ఏడు చరణాలతో మనం ప్రస్తుతం జాతీయగీతంగా ఆలపిస్తున్నాము.

జనగణమన భావం ఇది...

జనులందరి మనస్సుకూఅధినేతవు.
భారత భాగ్య విధాతవు అయిన నీకు జయమగుగాక.
పంజాబు, సింధు, గుజరాత్, మహారాష్ట్ర, ద్రావిడ, ఉత్కళ,
వంగ దేశాలతోనూ వింధ్య, హిమాలయ పర్వతాలతోనూ,
యమునా గంగ ప్రవాహాలతోనూ, ఉవ్వెత్తుగా లేచే
సముద్ర తరంగాలతోనూ శోభించే ఓ భారత విధాతా!
వాటికి నీ శుభ నామం ఉద్భోద కలిగిస్తుంది.
అవి నీ ఆశీస్సులు అర్థిస్తాయి.
నీ జయగాథల్ని గానం చేస్తాయి.
సమస్త జనులకూ మంగళ ప్రదాతవు.
భారత భాగ్య విధాతవయిన నీకు జయమగు గాక!
జయమగుగాక! జయమగుగాక!


చిత్తూరు జిల్లా మదనపల్లెలె రవీంద్రనాథ్ ఠాగూర్ జనగణమన గీతరచన గావించినది ఇక్కడే

జాతీయ గీతంగా

జనగణమనను 1950 జనవరి 24న జాతీయగీతంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. రాజ్యాంగ పరిషత్తు సమావేశంలో భారతీయ రిపబ్లిక్‌కు తొలి రాష్టపత్రిగా డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ ఎన్నికైన రోజునే జనగణమనను జాతీయగీతంగా ప్రకటించారు. 1950 జనవరి గణతంత్ర దినోత్సవాల్లో జాతీయగీతాన్ని అధికారికంగా మెట్టమొదటగా ఆలపించారు.


వివాదాలు కూడా


ఎన్నో ప్రశంసలు పొందిన ఈ గీతంపై వివాదాలు కూడా లేక పోలేదు. ఇందులోని సింధు పదాన్ని తొలగించాలని కొందరు కోర్టుకెక్కగా దానిని కోర్టు తిరస్కరించింది. అలాగే తెల్లదొర ల కోసం ఈ గీతం రాశారని వారిని కీర్తిస్తూ రాసిన గీతం కాబట్టి దానిని ఎలా ఆమోదించాలని ప్రశ్నించే వారూ ఉన్నా రు. అంతేకాకుండా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మే రకే రవీందడు ఈ గీతాన్ని రాశారని, ఆయన స్వతహాగా రాయ లేదని అంతేకాకుండా గీతానికి బాణీలు కట్టింది తానేనని నేతాజీ అనుచరుడు ఆ మధ్య ఒకరు తెరపైకి వచ్చారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్ట్సులో...

వందేళ్లు పూర్తి చేసుకున్న మన జాతీయగీతం జనగణమనకు ప్రపంచ రికార్డు కూడా దక్కింది ప్రముఖ విద్యావేత్త, న్యాయ వాది కె ఎస్ వాసు ఆధ్వర్యంలో ఈ గీతాన్ని ఆలాపన చేసేందుకు పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలోని మహతి కళామందిరం వేదిక అయ్యింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన జనగణమన గీతాలాపన సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగించిన ఈ వేడుకను వీక్షించేందుకు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్ట్సు ప్రతినిధులు సైతం హాజరయ్యారు. ఆద్యంతం ఆలకించారు. ఈ ఆలాపనని రికార్డులలో నమోదు చేసారు కూడా.

జనగణమన గీతానికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 24నుంచి 28 వరకు మదనపల్లెలో భారీస్థాయిలో ఉత్సవాలు నిర్వహిస్తుండటం విశేషం. ఇందుకు దక్షిణ భారతదేశంలో శాంతి నికేతన్‌గా పేరుపొందిన బీసెంట్ దివ్యజ్ఞాన కళాశాల(బి.టి) వేదిక కావటం మరో విశేషం. మదనపల్లె పట్టణంలోని బీటీ కళాశాల ప్రస్తుత కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి ఈ ఉత్సవాలకు సారధ్యం వహిస్తున్నారు. నాలుగురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను బీటీ కళాశాల మైదానంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తుండగా ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు, రాష్ట్ర మంత్రు లు అచ్చెన్నాయుడు, మంత్రులు గంటా శ్రీనివాసరావు, అమరనాధరెడ్డి, కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి తదితరులు హాజరవు తున్నారు.















కరకర మురుకులు



కావాల్సిన పదార్థాలు:

పాలు : అర కప్పు, కొబ్బరి పాలు : 2 స్పూన్లు, జీలకర్ర : 2 స్పూన్లు, నూనె : పావు కిలో, ఉప్పు : స్పూన్, బియ్యప్పిండి : అర కిలో, సోయా పిండి : 2 స్పూన్లు, శనగపిండి : అర కప్పు, రసం : 2 స్పూన్లు.

తయారు చేసే విధానం:

ముందుగా వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, శనగపిండి, సోయాపిండి, ఉప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి, రసం వేసి బాగా కలపాలి. తర్వాత అర కప్పు కాచిన నూనె పోసి కలపాలి. వేడి నూనె పోయగానే పిండి బుసబుస పొంగుతుంది. దీన్ని బాగా కలపాలి. తర్వాత పిండిలో కాచిన పాలు, కొబ్బరి పాలు పోసి కలపాలి. వేడినీళ్లు కూడా పోసి కలపాలి. పిండి మెత్తగా వెన్నలా అవుతుంది. దీన్ని మురుకుల గొట్టంలో వేసి కాగిన నూనెలో చుట్టలుగా వేసి ఎర్రగా వేయించి తీయాలి. కరకరలాడుతూ ఎంతో రుచిగా ఉంటాయి.

నిన్న జాతీయ చాంపియన్... నేడు టాక్సీ డ్రైవర్

ఐదు సార్లు జాతీయ ఛాంపియన్ షిఫ్, ఏషియన్ గేమ్స్ బ్రాంజ్ మెడలిస్ట్, మాజీ సైనికుడు అయిన బాక్సర్ లక్ష్య సింగ్ ట్యాక్సీ డ్రైవర్ పనిచేస్తున్నాడు.


తనకి వచ్చిన మెడల్స్ చూపిస్తున్న లక్ష్యాసింగ్

భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయాల్సిన ఈ మాజీ బాక్సర్ పొట్టకూటీ కోసం స్టీరింగ్ పట్టాడు. అదీ నెలకు రూ. 8 వేల వేతనంపై. తన ఆర్థిక పరిస్థితి గురించి బాక్సింగ్ ఫెడరేషన్‌కు అదే విధంగా పంజాబ్ ప్రభుత్వానికి పలుమార్లు లేఖ రాసినట్లు తెలిపాడు. కానీ ఇంతవరకు అటువైపు నుంచి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

పంజాబ్‌లోని లూథియానాకు చెందిన లక్ష్యసింగ్ 1984లో తన 19 ఏళ్ల వయస్సులో ఇండియన్ ఆర్మీలో జవానుగా చేరాడు. 1994లో టెహ్రాన్లో జరిగిన ఏషియన్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్ గెలుపొందాడు. ఇదే క్రమంలోనే మరుసటి ఏడాది తాష్కెంట్లో జరిగిన ఛాంపియన్ షిప్లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. కాగా 1998 సమయంలో సింగ్ జీవితం పెద్ద కుదుపునకు గురైంది. ఇతనితో పాటు మరో బాక్సర్ దేవేంద్ర తప్పా వరల్డ్ మిలటరీ బాక్సింగ్ ఛాంపి యన్షిప్‌లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ జంట టెక్సాస్ ఎయిర్ పోర్టులో కనిపించకుండా పోయారు. దీంతో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆర్మీ వీరిని బహిష్కరించింది. దీనిపై లక్ష్యసింగ్ స్పందిస్తూ.. తాను చేసిన పొరపాటు ఒక్కటేనన్నారు. ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్న సమయంలో టెక్సాస్ ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి తనను మోసగించి బయటకు తీసుకువెళ్లినట్లు చెప్పాడు. దీనిపై ప్రభుత్వానికి, ఆర్మీకి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తన విజ్ఞాపనలు పట్టించుకోకుండా బహిష్కరించినట్లు పేర్కొన్నాడు. తన సేవలను గుర్తించి, ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తనను ఆదుకోవాల్సిందిగా ఈ మాజీ ఛాంపియన్ కోరుతున్నాడు.

ప్రభుత్వాదరణ లేని ఏషియన్ గేమ్స్ మెడలిస్ట్

సూర్య సినిమా

నింగిలో పాగా వేసేందుకు



“గఘ మేఘ .. నింగే మనకు నేడు పాగ” అంటూ యువ కథానాయకుడు నితిన్ కథా నాయిక మేఘా ఆకాష్‌తో కలసి తన ప్రయాణం మొదలు పెట్టాడు. వీళ్లిద్దరు నటిస్తున్న చిత్రం “ఛల్ మోహన్ రంగ”. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తుండగా, శ్రీమతి నిఖితా రెడ్డి సమర్పణలో, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్ మరియు శ్రేష్ఠ్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇంతకుముందే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్స్ మరియు టీజరుకు మంచి స్పందన రావడంతో చిత్ర బృందం చాలా ఆనందంగా ఉన్నారు. మెలోడీల విషయంలో థమన్‌ది ప్రత్యేక బాణి. ఆయన స్వరపరచిన ఈ పాట కూడా ఎంతో వినసొంపుగా ఉంటుంది.

నాగార్జుని యుద్ధం







కింగ్ నాగార్జున, నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో వైజయంతి మూవీస్ పతాకంపై టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న భారీ మల్టీస్టారర్ పాటల రికార్డింగ్ నాని పుట్టినరోజు సందర్భంగా మహతి రికార్డింగ్ స్టూడియోలో ప్రారంభమైంది. గతంలో వైజయంతి మూవీస్ బేనర్‌లో ‘ఆఖరిపోరాటం, ఆజాద్, రావోయి చందమామ’ వంటి ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలు చేసిన కింగ్ నాగార్జున మరోసారి వైజయంతి బేనర్‌లో ఈ మల్టీస్టారర్ చేస్తున్నారు. నేచురల్ స్టార్ నాని మొదటిసారి ఈ బేనర్‌లో నటిస్తున్నారు. గతంలో అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ ఎన్నో మల్టీస్టారర్స్ చేశారు. ఇప్పుడు కింగ్ నాగార్జున, నేచురల్‌స్టార్ నానిలతో ఈ భారీ మల్టీస్టారర్‌ను వైజయంతి మూవీస్ బేనర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా అగ్రనిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ ‘నాగార్జున, నాని కాంబినేషన్‌లో ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్‌తో ఎంటర్‌టైనింగ్ వేలో చాలా భారీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా బేనర్‌లో వచ్చిన ఎన్నో మల్టీస్టారర్స్‌ని ఆదరించిన ప్రేక్షకుల్ని ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. మా బేనర్‌లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన మణిశర్మ సంగీత సారథ్యంలో పాటల రికార్డింగ్ ప్రారంభించాం. మార్చిలో షూటింగ్‌ని స్టార్ట్ చేస్తాం. మిగతా నటీనటుల ఎంపిక జరుగుతోంది” అన్నారు. దర్శకుడు టి.శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ ‘నాగార్జునగారు, నాని కాంబినేషన్‌లో సినిమాని డైరెక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. అందులోనూ వైజయంతి మూవీస్ వంటి పెద్ద బేనర్‌లో సినిమా చేయడం మరింత ఆనందంగా ఉంది. ఇది దర్శకుడుగా నాకు ఓ ప్రెస్టీజియస్ మూవీ’ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, మాటలు: వెంకట్ డి. పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం, కో-డైరెక్టర్: తేజ కాకుమాను, ప్రొడక్షన్ కంట్రోలర్: మోహన్!!

అర్జున్‌రెడ్డి అలా పడిపోయాడు!



పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి’ చిత్రాలతో యువతలో విజయ్ దేవరకొండ సంపాదించిన పావు లారిటీ అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ‘అర్జున్ రెడ్డి’ చిత్రంతో విజయ్ దేవరకొండ యువతలో మోస్ట్ క్రేజీయస్ట్ హీరోగా మారాడు. ఇప్పుడు ఈ యువ హీరో ‘ఏ మంత్రం వేశావే’ అంటున్నాడు. ఈ చిత్రంలో విజయ్ సరసన శివానీసింగ్ నాయికగా నటిస్తుంది. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్ టైన్‌మెంట్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని మార్చి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ.. ‘గేమ్ నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథ ఇది. విజయ్ దేవరకొండ ఇందులో చాలా వైవిధ్యంగా, నేటి యువతరానికి ప్రతినిధిగా కనిపించబోతున్నాడు’ అన్నారు!!

ఆ ఇద్దరు హీరోలు.. ఈ ఇద్దరు దర్శకులతో?



ఒకే ఒక సక్సెస్.. మొత్తం సమీకరణాలను మార్చేస్తుంది. అప్పటివరకు పడిన కష్టాలు దూదిపింజలైపోతాయి. హంసతూలికాతల్పాలు వెతుక్కుంటూ వచ్చేస్తాయి. సకల సౌకర్యాలు ఒక్కసారి సమకూరిపోతాయి.

ముఖ్యంగా సినిమా ఫీల్డ్‌లో దర్శకులుగా తమ ప్రతిభను నిరూపించుకోవడం కోసం కుర్రాళ్లు ఎన్నో త్యాగాలు చేస్తారు. వాళ్లు కష్టపడుతుండడమే కాకుడా.. తమవాళ్ల మనసులు కూడా కష్టపెడుతుంటారు.

కానీ ఒకసారి సక్సెస్ సాధిస్తే.. ముప్పై.. ముప్పై అయిదేళ్లు గవర్నమెంట్ జాబ్ చేసి రిటైరైతే ఎంత వస్తుందో.. అంత మొత్తం రెండో సినిమాకే వచ్చేస్తుంది.

డబ్బు పక్కన పెట్టండి. దానికి పదింతలు చేసే గౌరవం ఒక్క రోజులో వచ్చేస్తుంది. అందుకే కొంచెం కష్టపడితే సివిల్స్‌లో సెలెక్ట్ అయ్యేంత తెలివితేటలున్నా సరే .. సినిమాలంటే ఇంట్రెస్ట్ ఉన్న కుర్రాళ్లు సినిమా కష్టాలు పడడానికి సిద్ధపడిపోతున్నారు. రేపు దర్శకులు అయ్యాక ఇంటర్వ్యూలో చెప్పుకోవడానికి బాగుంటాయిలే అని.. కష్టాల్ని కూడా ఇష్టంగా పడుతున్నారు.

ఇక విషయానికొస్తే.. ‘ఛలో’తో దర్శకుడిగా పరిచయమైన వెంకీ కుడుముల.. ‘తొలిప్రేమ’తో డైరెక్టర్‌గా ఇంట్రడ్యూస్ అయిన వెంకీ అట్లూరికి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయని తెలుస్తోంది.

తాజా సమాచారం ప్రకారం.. వెంకీ కుడుములను నితిన్‌ని డైరెక్ట్ చేసే ఛాన్స్ వరించగా.. వెంకీ అట్లూరికి నాగార్జున అక్కినేని నుంచి పిలుపు వచ్చిందని తెలుస్తోంది.

అఖిల్ మూడో చిత్రానికి దర్శకుడిగా వెంకీ అట్లూరిని నాగార్జున ప్రిఫర్ చేస్తున్నారని సమాచారం!!

ఆలశ్యమైనా అభినందించాల్సిందే



నిర్మాతలకు...డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డి సంస్థలకు మధ్య శుక్రవారం బెంగుళూరులో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో నాలుగు భాషల నిర్మాతలు ఒకే తాటి పైకొచ్చి మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్ చేస్తూ ఆ మూడు సంస్థలకు సినిమా కంటెంట్ ఇవ్వకూడదని నిర్ణయించారు. దీనికి తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ తరవున మేము కూడా మద్ధతు ప్రకటిస్తున్నాం’ అన్నారు టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్.

టిఎఫ్‌సిసి సెక్రటరీ లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ... ‘గత పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థపై మేము పోరాటం చేస్తున్నాం. ఇప్పటికైనా ముందుకొచ్చి సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ అంతా డిజిటల్ వ్యవస్థపై పోరాటం చేయటం మంచి పరిణామం. గతంలో మేము డిజిటల్ రేట్లను తగ్గించాలంటూ నిరహార దీక్ష చేయడం కూడా జరిగింది. కానీ అప్పట్లో పెద్దగా ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. కొంతమందికైతే డిజిటల్ రేట్లపై అంత అవగాహన కూడా ఉండేది కాదు. ఆ మూడు డిజిటల్ సర్వీస్ సంస్థలు వారు 9శాతానికి మించి తగ్గించే ప్రస్తకే లేదని తేల్చి చెప్పారు. అసలు డిజిటల్ ఛార్జెస్ ఐదేళ్లుకు మించి ఉండకూడదు. పదమూడేళ్లైనా కూడా అదే రేట్లు తీసుకుంటూ నిర్మాతలను ఇబ్బంది పెడుతున్నారు. మన సౌత్ ఇండియా ఫిలిం ఇండస్ట్రీలలో తప్ప హాలీవుడ్, బాలీవుడ్‌లో ఈ విధంగా లేదు. గతంలో 2500లకే డిజిటల్ సర్వీసెస్ ప్రొవైడ్ చేస్తామంటూ కొన్ని సంస్థలు ముందుకొచ్చినా కానీ, వారిని రానివ్వకుండా చేశారు కొంతమంది. ఇప్పటికే డిజిటల్ అత్యధిక రేట్ల వల్ల రిలీజ్ కాకుండా ఎన్నో చిత్రాలు ఆగిపోయాయి. క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డి సంస్థలతో అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసుకుంటే తక్కువ రేట్లకే డిజిటల్ సర్వీసెస్ ప్రొవైడ్ చేస్తామంటూ అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. కాబట్టి మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్ కు అందరూ సహకరించాలని కోరుకుంటున్నాం’ అన్నారు!!

నన్నలా ఇష్టపడరు.. నాకూ ఇష్టముండదు



ఎక్స్‌పోజింగ్‌పై మీ అభిప్రాయమేంటి? సిట్యుయేషన్ డిమాండ్ చేస్తే బికినీ వేసుకుంటారా?’ అనే ప్రశ్నలు దాదాపుగా అందరు ప్రామినెంట్ హీరోయిన్స్‌నీ మీడియావారు అడుగుతుంటారు. అనుష్క, నయనతార వంటి టాప్ హీరోయిన్స్ బికినీ యాక్ట్ చేసినప్పుడు అప్ కమింగ్ హీరోయిన్స్‌కు ఎలా తప్పుతుంది?అయితే అనుపమ పరమేశ్వరన్ మాత్రం చాలా తెలివిగా తప్పించుకుంటోంది. ‘నేను ఓవర్‌గా ఎక్స్‌పోజింగ్ చేసినా, బికినీ వేసుకున్నా ఇప్పుడు నన్ను ఇష్టపడేవాళ్లు నాకు దూరమౌతారు. అలా యాక్ట్ చేయడం నాకూ ఇష్టముండదు’ అంటోంది అనుపమ. ‘ప్రేమమ్, అ ఆ, శతమానం భవతి’ చిత్రాలతో తెలుగులో పాగా వేసిన ఈ మలయాళ కుట్టి తన కెరీర్‌ని జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటోంది!



కిస్ కహానీ

లక్ష్మీ సుచిత్ర క్రియేషన్స్ బ్యానర్‌పై విజయ్‌కిరణ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ విజయ్‌జగత్ నిర్మిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ ‘పైసా పరమాత్మ’. సంకేత్, సుధీర్ హీరోలుగా అనూష, బనీష హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుని రెండవ షెడ్యూల్‌కి రెడీ అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత, దర్శకులు చిత్ర విశేషాలను తెలియచేసారు. నిర్మాత విజయ్‌జగత్ మాట్లాడుతూ – ‘డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సస్పెన్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇటీవల షూటింగ్ ప్రారంభించి నాన్ స్టాప్‌గా హైద్రాబాద్‌లో రిచ్ లోకేషన్‌లలో షూటింగ్ చేశాం. ఇందులో రెండు పాటలు వున్నాయి. రీ రికార్డింగ్‌కి ఎక్కువ స్కోప్ వున్న చిత్రం ఇది అన్నారు.

చిరుత పిల్ల చిరు ప్రయత్నాలు చేస్తోంది



చిరుత’తో చిత్ర రంగ ప్రవేశం చేసిన బాలీవుడ్ భామ నేహా శర్మ, ఆ తర్వాత తెలుగులో ‘కుర్రాడు’ సినిమా చేసినా ఆశించిన స్థాయిలో గుర్తింపు లభించలేదు. అయితే ఇప్పుడు ఏ హీరోయిన్‌కైనా ఆప్షన్స్ చాలా ఎక్కువగా ఉన్నాయి. ఒక భాషలో హిట్టవ్వకపోయినా వేరే భాషలో అవకాశాలు వస్తున్నాయి. నేహా శర్మకు కూడా అలానే వేరే భాషలో అవకాశాలు వచ్చాయి. అయితే అక్కడ కూడా ఆమెను విజయం వరించలేదు. అంతమాత్రాన ఆమె ఆశాభంగం చెందిందనుకుంటే పప్పులో కాలేసినట్లే. విజయాలు అంత త్వరగా వరించవని ఈ భామకు బాగానే తెలిసినట్లుంది. అందుకే ఓపిగ్గా ఎదురు చూస్తూ.. అందాకా ఎవరూ తనని మర్చిపోకుండా ఇలా హాట్ హాట్‌గా ఫోటో షూట్ చేస్తూ తన ఉనికిని గుర్తు చేసుకుంటూ ఉంది!



పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్స్‌పై సల్మాన్ ఖాన్ సీరియల్

దబంగ్ సిరీస్‌లో, వాంటెడ్ (తెలుగు పోకిరి)లో స్ట్రిక్ట్ పోలీస్ ఆఫీసర్‌గా అలరించిన కండలవీరుడు సల్మాన్‌ఖాన్ నిజాయితీ కలిగిన పోలీసు ఆఫీసర్స్ నిజ జీవితంలో జరిగిన సంఘటలను స్ఫూర్తిగా తీసుకొని టీవీ సీరియల్ తీస్తున్నాడని తెలుస్తోంది. అందులో సల్మాన్ ఖాన్ సోదరుడు నటించనున్నాడు. పోలీసులంటే తనకు అమితమైన గౌరవమని, అందుకే వారిపై సీరియల్ తీసేందుకు సన్నాహాలు చేస్తున్నానని ఈ కండల వీరుడు చెబుతున్నాడు. నిజమే.. అవినీతిపరులైన ఏ కొందరినో మినహాయిస్తే.. నిజాయితీగా తమ బాధ్యతలు నిర్వహించే పోలీసుల వల్లే మనమంతా ప్రశాంతంగా బ్రతకగలుగుతున్నామనే విషయాన్ని అందరూ అంగీకరించాల్సిందే!!





బిడ్డను ఎత్తుకొని భర్త అంత్యక్రియలకు..సెల్యూట్ ఆర్మీ మేజర్

గువాహటి : మనకు ఇష్టమైన వ్యక్తులు దూరమైతే ఆ బాధను భరించడం చాలా కష్టం. కానీ అటువంటి పరిస్థితుల్లో కూడా ఆమె తన వృత్తి ధర్మాన్ని మరువలేదు. విమానం కూలిన ఘటనలో మృతి చెందిన తన భర్త అంత్యక్రియలకు తన ఐదు రోజుల చిన్నారిని ఎత్తుకొని వచ్చి విధుల్లో పాల్గొంది. ఆమె మేజర్ కుముద్ డోగ్రా. ఈ దృశ్యం అక్కడి వారి హృదయాలను కలచివేసింది. బిడ్డను ఎత్తుకొని ఆమె మార్చ్‌లో పాల్గొని తన భర్తకు నివాళులు అర్పించింది. ఈ దృశ్యాలను చూసిన నెటిజన్లు మేజర్ డోగ్రాకు సెల్యూట్ చేస్తున్నారు. ఈ నెల 15న అసోంలో ఐఏఎఫ్‌కు చెందిన మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో డోగ్రా భర్త వింగ్ కమాండర్ డి. వాట్స్ కూడా ఉన్నారు. విమానాన్ని ల్యాండ్ చేసే సమయంలో అది అదుపు తప్పి ఒక్కసారిగా కూలిపోయి మంటలు రావడంతో అందులో ఉన్న ఇద్దరు పైలట్లు అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం వింగ్ కమాండర్ డి. వాట్స్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడికి ఆయన భార్య ఆర్మీ యూనిఫామ్‌లో తన ఐదు రోజుల కుమార్తెను ఎత్తుకొని వచ్చారు. తన భర్తకు నివాళులు అర్పించి మార్చ్‌లో బిడ్డతో పాటే పాల్గొన్నారు. భర్త మరణాన్ని దిగమింగుకొని ఆమె తన విధుల పట్ల చూపించిన నిబద్ధతను అక్కడి వారందరూ ప్రశంసించారు. బిడ్డను ఎత్తుకొని వెళుతున్న ఆమె ఫోటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నెటిజన్లు ఆమెను అభినందిస్తూ సెల్యూట్ చేస్తున్నారు. ఆర్మీని తక్కువ చేసి చూపించే వారు ఈ దృశ్యాన్ని చూసైనా వారి విధులు ఎంత కష్టంగా ఉంటాయో అర్థం చేసుకోవాలని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

నన్ను ఎన్‌కౌంటర్ చేసి చంపే కుట్ర జరుగుతోంది

- జిగ్నేశ్ మేవానీ సంచలన ఆరోపణ
- దళితుడి మరణంతో అహ్మదాబాద్ బంద్‌కు పిలుపు ఇచ్చిన జిగ్నేశ్
- బంద్ నేపథ్యంలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన జిగ్నేశ్
- వాట్స్‌యాప్‌లో హింస, ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన రెండు వీడియోలు పోస్టు చేసిన అహ్మదాబాద్ డీఎస్పీ



అహ్మదాబాద్ : తనను ఎన్‌కౌంటర్ చేసి చంపేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని గుజరాత్ దళిత యువ నేత, ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ సంచలన ఆరోపణలు చేశారు. తన ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించిన జిగ్నేశ్ మేవానీ తన ఎన్‌కౌంటర్ కుట్రకు సంబంధించిన సాక్ష్యంగా పోలీస్ వాట్స్‌యాప్ గ్రూప్ (ఏడీఆర్ అండ్ మీడియా)లో ఇద్దరు అధికారుల మధ్య జరిగిన సంభాషణ లింక్‌ను తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. జిగ్నేశ్ మేవానీ చెప్పిన ఏడీఆర్ అండ్ మీడియా గ్రూప్‌లో సీనియర్ పోలీసు అధికారులతో పాటు, మీడియా ప్రతినిధులు కూడా ఉండడం విశేషం. ఈ గ్రూప్‌లో ఇటీవల అహ్మదాబాద్ డిప్యూటీ ఎస్పీ ఆర్బీ దేవ్‌దా రెండు వీడియోలను పోస్టు చేశారు. వాటిలో ఒక వీడియోలో కొంత మంది పోలీసులు ఒక రాజకీయ నాయకుడ్ని చితక బాదుతుండగా, మరొక వీడియోలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్‌కౌంటర్లపై పోలీసులను ప్రశంసిస్తూ ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఇచ్చిన ఇంటర్వ్యూ ఉంది. ఈ రెండు వీడియోలను గ్రూప్ సభ్యులకు పరిచయం చేస్తూ, పోలీసుల పట్ల అనుచితంగా గాని, వారికి వ్యతిరేకంగా గాని వ్యవహరిస్తే ఇలాంటి చర్యలే తీసుకోవాల్సి ఉంటుందంటూ ఆ డీఎస్పీ క్యాప్షన్ ఇచ్చారు. కాగా, ఇటీవల గుజరాత్‌లో దళిత కార్యకర్త మరణం నేపథ్యంలో జిగ్నేశ్ అహ్మదాబాద్ బంద్‌కు పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులతో మేవానీకి వాగ్వాదం జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారి ఆ వీడియోలను పోస్టు చేయడంతో తనపై ఎన్‌కౌంటర్ కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ వీడియోలతో గుజరాత్ హోమ్ శాఖ మంత్రి, హోమ్ శాఖ కార్యదర్శి, డీజీపీలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసే యోచనలో జిగ్నేశ్ మేవానీ ఉన్నారు. కాగా, ఈ వీడియోలపై డీఎస్పీ ఆర్బీ దేవ్‌దా వివరణ ఇస్తూ, ఆ రెండు వీడియోలు ఫార్వర్డ్ మెసేజ్‌లేనని, వాటిలో ఎలాంటి దురుద్దేశమూ లేదని చెప్పారు.

'రాహుల్ అసలు నాయకుడే కాదు'



అహ్మదాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై పాటిదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన దృష్టిలో రాహుల్ నాయకుడే కాదని అన్నారు. ఓ వ్యక్తిగా రాహుల్ అంటే తనకు ఇష్టమని, అయితే, ఓ నేతగా ఆయనను తాను ఎన్నడూ చూడలేదని చెప్పారు. ఆయన చెప్పే విషయాలను పాటించడానికి ఆయన తనకు అధిష్ఠానం కాదని అన్నారు. ఆయన సోదరి ప్రియాంక వాద్రా రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. ప్రియాంకలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. 2019 సాధారణ ఎన్నికల్లో పాటిదార్ అనామత్ ఆందోళన్ సమితి తరపున తాను పోటీ చేయబోనని హార్దిక్ స్పష్టం చేశారు. గత గుజరాత్ ఎన్నికల్లో కూడా ఆయన పోటీ చేయలేదు. హార్దిక్‌కు 24 ఏళ్లు మాత్రమే ఉండడంతో ఆయన పోటీ చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా హార్దిక్ పోటీ చేయబోతున్నారనే కథనాలు వచ్చాయి. ఈ వార్తలపై హార్దిక్ స్పందిస్తూ, ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు.

పార్టీ కార్యాలయంలో జయలలిత కాంస్య విగ్రహం



చెన్నై : తమిళనాడు మాజీ సీఎం జయలలిత 70వ జయంతి సందర్భంగా పాలక ఏఐఏడీఎంకే పార్టీ ప్రధాన కార్యాలయంలో దివంగత నేత భారీ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది. ముఖ్యమంత్రి ఎడప్పాడి కె పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి ఒపన్నీర్‌సెల్వం విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం దివంగత నేత స్మృతిచిహ్నంగా 'నమదు పురట్చి తలైవి అమ్మ' పత్రిక ను ప్రారంభించారు. పార్టీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఎంజీఆర్ విగ్రహానికి సమీపంలోనే జయలలిత విగ్రహం అమర్చారు. నెల్లూరులో రూపుదిద్దుకున్న జయ విగ్రహాన్ని గత ఏడాదే పార్టీ కార్యాలయంలో ప్రతిష్ఠించాల్సి ఉండగా, పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లడంతో ఆకార్యక్రమం వాయిదా పడింది. గతంలో 1980లో పార్టీ నేత ఎం జీ రామచంద్రన్ మరణానంతరం 'నమదు ఎంజీఆర్' పేరిట పార్టీ పత్రికను జయలలిత ప్రారంభించారు. ఆ పత్రిక 2016లో జయలలిత మరణించే వరకూ ఏఐఏడీఎంకే అధికార పత్రికగా కొనసాగింది.

తుపాకులున్న టీచర్లకు ట్రంప్ 'బోనస్' ఆఫర్

- ఒక్కో టీచర్‌కు రూ. 67 వేల బోనస్‌కు యోచన
- ఫ్లోరిడా తరహా ఘటనలు తగ్గుతాయని ఆశ
- అసాల్ట్ రైఫిల్ కొనుగోలుదారుల వయసు పెంపుపై పరిశీలన
- నిధుల సమీకరణకు కాంగ్రెస్ సభ్యులతో చర్చించే చాన్స్



వాషింగ్టన్ : అమెరికా వ్యాప్తంగా ఇటీవలి కాలంలో పాఠశాలలలో తుపాకీ కాల్పుల ఘటనలు అధికమవుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టీచర్లకు తుపాకులు ఇస్తే ఇలాంటి ఘటనలను అడ్డుకోవచ్చనే ఐడియాను తెరపైకి తెచ్చారు. ఆయన ఆలోచన త్వరలోనే కార్యరూపం దాల్చబోతోంది. దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది టీచర్లకు ఆయుధాలు అందించి, వారికి తగు శిక్షణ ఇవ్వనుందని వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమీకరించే అవకాశం ఉందని ఆ వర్గాలు సూచించాయి. తుపాకులను కలిగి ఉన్న టీచర్లకు రూ. 67 వేల చొప్పున బోనస్ ఇస్తే మొత్తం పది లక్షల మందికి రూ. 6700 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశాయి. దీనికి సంబంధించి శాసన- బడ్జెట్ సంబంధిత ప్రతిపాదనపై కాంగ్రెస్ సభ్యులతో ట్రంప్ త్వరలోనే మాట్లాడుతారని తెలిపాయి. మరో వైపు అసాల్ట్ రైఫిల్ కొనుగోలుదారుల వయో పరిమితిని పెంచే ప్రతిపాదనను కూడా ట్రంప్ పరిశీలిస్తున్నారని ఆ వర్గాలు వెల్లడించాయి. పాఠశాలల భద్రతపై ఆయన తన కేబినెట్ సహచరులతో వైట్ హౌస్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. టీచర్లకు తుపాకులు ఇవ్వడం వల్ల ఫ్లోరిడా స్కూల్ తరహా ఘటనలను తగ్గించవచ్చని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. స్కూళ్లలో తుపాకులు లేనందున హంతకులు సులభంగా లోపలకి ప్రవేశించి నరమేధాలు సృష్టిస్తున్నారని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

అరుణాచల్ ప్రదేశ్ సీఎంపై అత్యాచార ఆరోపణలు



ఈటానగర్ : అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ చిక్కుల్లో ఇరుక్కున్నారు. ఖండూ తనపై అత్యాచారం చేశారని ఓ మహిళ తీవ్ర ఆరోపణలు చేసింది. 10 ఏళ్ల క్రితం పెమా, మరికొందరు కలసి తనపై గ్యాంగ్ రేప్ చేశారని ఆమె తెలిపింది. దీనిపై తాను ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు, జాతీయ మహిళా కమిషన్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదని ఆమె తెలిపింది. దీంతో, తగిన ఆధారాలతో మీడియా ముందుకు వచ్చేందుకు సిద్ధపడింది. ఆమె చెబుతున్న వివరాల ప్రకారం, 2008లో పెమా, మరి ముగ్గురు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ సమయంలో తాను స్పృహలో లేనని, జరిగిన ఘటనపై తాను ఎంతో మందికి విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని చెప్పింది. ఘటన జరిగిన 7 ఏళ్ల తరువాత (2015లో ఖండూ సీఎం పదవిని చేపట్టడానికి కొన్ని నెలల ముందు) ఆమె ఈటానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు అదంతా ఉత్తిదేనని తేల్చారు. గత ఏడాది కాలంగా తనను చంపుతామని బెదిరింపులు కూడా వస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. మరో వైపు, బాధితురాలి ఆరోపణలను ఖండూ తీవ్రంగా ఖండించారు. ఆమె ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర ఉందని అన్నారు. ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని బీజేపీ మండిపడింది.

హిందువులు పిల్లల్ని కంటూనే ఉండాలి

- బీజేపీ ఎంఎల్‌ఏ వివాదాస్పద వ్యాఖ్యలు
- జనాభా నియంత్రణ చట్టం అమలయ్యేంత వరకు కంటూనే ఉండాలి
- నలుగురైదుగురు పిల్లలు కావాలని నా భార్యతో చెప్పా
- ముజఫర్‌నగర్ బహిరంగ సమావేశంలో ఎంఎల్‌ఏ సైనీ వ్యాఖ్యలు



ముజఫర్‌నగర్ : ఉత్తర ప్రదేశ్‌లోని ఖతౌలీ నియోజకవర్గం బీజేపీ ఎంఎల్‌ఏ విక్రమ్ సైనీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జనాభా నియంత్రణకు ప్రభుత్వం ఓ చట్టం తీసుకువచ్చేంత వరకు హిందువులు పిల్లలను కంటూనే ఉండాలని ఆయన అన్నారు. తన భార్యకు ఇదే విషయాన్ని చెప్పానని ఆయన తెలిపారు. జనాభా నియంత్రణపై ముజఫర్‌నగర్‌లో జరిగిన ఓ బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఇద్దరు పిల్లలు ముద్దు' పాలసీ మనకు సమ్మతమే. కానీ ఇతరులు దానిని పాటించడం లేదు. చట్టం అందరికీ సమానమే. హిందువులు పిల్లల్ని కనడం ఆపరాదు. మనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు కదా. మూడో బిడ్డ ఎందుకని నా భార్య నన్ను అడిగింది. కానీ మనకి నలుగురైదుగురు పిల్లలు కావాలని ఆమెతో నేను అన్నాను' అని సైనీ చెప్పారు. ఆయన ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలోనూ నూతన సంవత్సర వేడుకలు, వేలంటైన్స్ డే క్రైస్తవుల పండుగ అని, దానిని హిందువులు చేసుకోరాదని ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాక 'హిందూస్థాన్ హిందువులది... ముస్లింలు పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలి' అని గత నెలలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

స్కూలులోకి దూసుకెళ్లిన వాహనం

పాట్నా : బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఓ వాహనం అదుపు తప్పి స్కూలు భవనంలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా మరి 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలికి పోలీసులు చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ దీనిపై స్పందించి మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఇంటి వద్ద ఉద్రిక్తత

- ఆప్ నేతలు తనపై దాడి చేశారని ఢిల్లీ చీఫ్ సెక్రటరీ ఇటీవల ఫిర్యాదు
- సీసీ ఫుటేజ్ కోసం కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు
- భారీగా చేరుకున్న పోలీసులు, ఆప్ కార్యకర్తలు
- పోలీసులు ఇంతటి శ్రద్ధ జడ్జి బీహెచ్ లోయ మృతిలో దర్యాప్తుపై చూపితే బాగుండేది : కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఇటీవల ఓ సమావేశానికి హాజరైన తనపై ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు దాడి చేశారని ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు సంచలనం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్న ఢిల్లీ పోలీసులు శుక్రవారం ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లడంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆ రోజు రాత్రి ఏం జరిగిందో తెలుసుకోవడానికి సీసీటీవీ ఫుటేజీని కూడా స్వాధీనం చేసుకోవాలని పోలీసులు అనుకున్నారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో అలజడి రేగింది. ఈ క్రమంలో పోలీసులకు వ్యతిరేకంగా ఆప్ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఢిల్లీ ప్రభుత్వ అధికార ప్రతినిధి అరుణోదయ ప్రకాశ్ ఈ విషయంపై ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ, సుమారు 60 నుంచి 70 మంది పోలీసులు కేజ్రీవాల్ నివాసానికి వచ్చారని చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఢిల్లీ పోలీసులు శుక్రవారం తన ఇంటిలో సోదాలు చేయడంలో చూపించినంత శ్రద్ధ జడ్జి బీహెచ్ లోయ మృతిలో దర్యాప్తుపై చూపితే బాగుండేదని, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఇంటిలోనూ సోదాలు చేస్తే పోలీసులను చూసి దేశ ప్రజలు గర్వించేవారని వ్యాఖ్యానించారు.

జడ్జీల కొరత తీవ్రతరం

న్యూఢిల్లీ : న్యాయమూర్తుల కొరతతో పలు కేసులు పెండింగ్‌లో ఉంటున్న క్రమంలో ఈ ఏడాది ఏకంగా ఏడుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు రిటైర్ కానుండడంతో సమస్య మరింత జటిలం కానుంది. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే ఆరుగురు న్యాయమూర్తుల కొరతతో సతమతమవుతోంది. ఇద్దరు న్యాయమూర్తుల నియామకం సత్వరమే చేపట్టాలన్న సూచన ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లోనే ఉంది. మార్చి 1న జస్టిస్ అమితవ రాయ్ పదవీ విరమణ చేయనుండగా, మే 4న జస్టిస్ రాజేష్ అగర్వాల్ రిటైర్ కానున్నారు. ఇక చీఫ్ జస్టిస్ తరువాత సుప్రీం కోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ జూన్ 22న, జస్టిస్ ఆదర్శ్ గోయల్ జులై 6న పదవీ విరమణ చేయనున్నారని సుప్రీం కోర్టు, న్యాయ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్లు తెలియజేశాయి. ఇక సీజేఐ దీపక్ మిశ్రా అక్టోబర్ 2న, జస్టిస్ కురియన్ జోసెఫ్ నవంబర్ 29న, జస్టిస్ మదన్ బీ లోకూర్ డిసెంబర్ 30న పదవీ విరమణ చేయనున్నారు. న్యాయమూర్తులు పెద్ద సంఖ్యలో రిటైర్ కానుండడం, ఇప్పటికే ఆరుగురు న్యాయమూర్తుల కొరత నెలకొనడంతో కొలీజియం జడ్జీల ఎంపికపై ఒత్తిడి ఎదుర్కోనుంది. న్యాయమూర్తుల నియామకంపై ప్రభుత్వం సత్వరమే స్పందించి పెండింగ్ కేసులు పేరుకుపోకుండా చూడాల్సి ఉంది.

రాజస్థాన్ అసెంబ్లీలో విడ్డూరం

- దెయ్యాలపై చర్చించిన నేతలు
- అసెంబ్లీ ప్రాంగణంలో దెయ్యాలున్నాయని ఆందోళన
- గత ఆరు నెలల్లో ఇద్దరు శాసనసభ్యుల మృతి
- శుద్ధి కార్యక్రమాలు జరిపించాలని స్పీకర్‌కు వినతి
- ఇదే అంశంపై ప్రత్యేక కమిటీ వేయాలని చీఫ్ విప్ సరదా వ్యాఖ్య



జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీలో శుక్రవారం ఓ చిత్రమైన అంశంపై చర్చ జరిగింది. శాసనసభ ప్రాంగణంలో ఎంఎల్‌ఏలు దెయ్యాల ఉనికి గురించి మాట్లాడారు. శుద్ధి కార్యక్రమాలను జరిపించాలని స్పీకర్‌ను కోరారు. మధ్యాహ్నం 12 గంటల లోపు సమావేశాలను ముగించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి రాజేంద్ర రాథోడ్ స్పీకర్‌ను కోరారు. అసెంబ్లీ భవనంలో దెయ్యాలు ఉన్నట్లు చర్చ జరుగుతోందని, శుద్ధి కార్యక్రమాలను జరపాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి ఓతారామ్ దేవసిని పలువురు సభ్యులు కోరినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో దీనిపై ఓ విచారణ కమిటీని వేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ కాలులాల్ గుర్జర్ సరదాగా వ్యాఖ్యానించడం గమనార్హం. చర్చ సాగుతుండగా స్పీకర్ మేఘ్వాల్ జోక్యం చేసుకుని దెయ్యాల అంశంపై ప్రత్యేకంగా చర్చ జరగాలని చెప్పారు. కాగా, గురువారం బీజేపీ ఎంఎల్‌ఏ హబీబుర్ రెహ్మాన్ అసెంబ్లీలో మాట్లాడుతూ, ఈ ప్రాంగణంలో లోపల కొంత భాగంలో ఒకప్పుడు శ్మశానవాటిక ఉండేదని, అందువల్ల అసెంబ్లీ భవనంలో దెయ్యాలు ఉండవచ్చనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఆయన మాటలతో మిగతా ఎంఎల్‌ఏలు కూడా ఏకీభవించారు. రాజస్థాన్ అసెంబ్లీ భవనాన్ని జ్యోతి నగర్ లోని దాదాపు 16.96 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌ను ఆనుకునే లాల్ కోఠి శ్మశాన వాటిక ఉంది. కాగా, గత ఆరు నెలల్లో ఇద్దరు శాసనసభ్యులు మరణించిన నేపథ్యంలో సభ్యులు ఇలా దెయ్యాల ఉనికిపై చర్చించడం ఇప్పుడు చర్చనీయమైంది.

రక్తమోడిన అఫ్గాన్: 18 మంది సైనికులు మృతి



కాబూల్ : వరుస ఉగ్రదాడులతో శనివారం అఫ్గనిస్థాన్ ఉలిక్కిపడింది. రాజధాని కాబూల్‌లో ఆత్మాహుతి దాడి జరిగిన గంటల వ్యవధిలోనే ఉగ్రవాదులు ఆర్మీ చెక్ పాయింట్ వద్ద దాడికి తెగబడ్డారు. ఫరాహ్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ దాడిలో దాదాపు 18 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయినట్టు అక్కడి అధికారు లు తెలిపారు. పలువురు సైనికులు తీవ్రంగా గాయపడినట్లు అఫ్గాన్ రక్షణ మం త్రిత్వశాఖ వెల్లడించింది. రక్తసిక్తమైన ఆర్మీ చెక్ పాయింట్ వద్ద పరిస్థితి భీతావహంగా ఉంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలు ఆసుపత్రులకు తరలించారు. తాలిబన్ల ప్రాబల్య ప్రాంతం కావడంతో వా రే ఈ దాడికి పాల్పడి ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

కాబూల్‌లోని దౌత్య కార్యాలయాలకు సమీపంలో ఆత్మాహుతి దళ సభ్యుడు తనను తాను పేల్చుకున్నాడు. ఈ దాడిలో ఇద్దరు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా మరి ఆరుగురు తీవ్రంగా గాయపడినట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల శాఖ ప్రతినిధి తెలిపారు. ఈ దాడికి తామే చేశామని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ప్రకటించుకున్నారు. గత ఏడాది డిసెంబరులో ఇదే కాంపౌండ్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. అప్పుడు ఆరుగురు పౌరులు మృతి చెందారు.

కమల్! నాస్తికత్వంతో ఎలా?

చెన్నై : రాజకీయ అరంగ్రేటంపై ఊరిస్తూ వచ్చిన లోకనాయకుడు మక్కళ్ నీది మయ్యం పేరిట పార్టీని ప్రకటించి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని తన వైపు తిప్పుకున్నాడు. పార్టీ విధి విధానాల్లో వైవిధ్యత ఉంటుందని చెబుతున్నప్పటికీ అది ఎంతవరకు ఆచరణ సాధ్యమో తెలియాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. అయితే, ఈ క్రమంలో ద్రవిడ భావజాలాన్ని తన పార్టీ అనుసరించే తీరుతుందన్న సంకేతాలను ఆయన అందించారు.

గతాన్ని ఓసారి పరిశీలిస్తే...

ద్రవిడ పార్టీలకు ప్రధాన పునాది నాస్తికత్వం. మతం, ఆధ్యాత్మికతకు తీవ్రంగా వ్యతిరేకం. బ్రాహ్మణ వాదానికి వ్యతిరేకంగా, కుల వివక్షపై పోరాటం దిశగా అవి పుట్టుకువచ్చాయి. అయితే, ఆ క్రమంలో పార్టీలు (డీఎంకే తప్ప) తమిళ రాజకీయాల్లో పెద్దగా రాణించిన దాఖలాలు లేవు. డీకే (ద్రవిడ కగళమ్)ను ఇందుకు ఉదాహరణగా విశ్లేషకులు చూపిస్తుంటారు. డీఎంకే నుంచి అన్నా డీఎంకే ఏర్పడిన తరువాత ఎంజీఆర్ కొంత ఉదారంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. స్వతహాగా దేవుడ్ని నమ్మే ఆయన రహస్యంగా ఆయన దేవాలయాలను సందర్శించేవారన్న వార్త బయటకు పొక్కడంతో ఆయన వ్యవహార శైలిపై విమర్శలు వచ్చాయి. పది సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కరుణానిధి శ్రీపురం స్వర్ణ దేవాలయం సందర్శించుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా ఎదిగే క్రమంలో శివాజీ గణేశన్‌కు ఇలాంటి సమస్యే ఎదురైంది. ఆస్తికుడు అయినప్పటికీ తొలి నాళ్లలో ఆయన డీఎంకే మద్ధతుదారుడిగా ఉన్నారు. ఓసారి తిరుమలకు వెళ్లి దేవుడ్ని దర్శించుకోగా డీఎంకే ఆయనను తీవ్రంగా మందలించింది. తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం, 1987లో తమిళ మున్నేట్ర ముణ్ణాని పార్టీ స్థాపన, ప్రత్యర్థుల దెబ్బకు అది మనుగడ కొనసాగించలేకపోవడం.. ఇలా అస్తికత్వం మూలంగానే ఆయన విఫలం అయ్యారని చెబుతుంటారు. మరి అలాంటప్పుడు ఆధ్యాత్మిక పాలన నినాదంతో రాజకీయాల్లోకి వస్తున్న రజనీకాంత్ ఎలా రాణిస్తాడో?

జయ విషయంలో మాత్రం ...

ఇక జయలలిత అయితే మొదటిసారి అధికారం చేపట్టగానే ద్రవిడ సిద్ధాంతాలకు, దాని భావజాలానికి కాస్త దూరంగా ఉన్నారు. దే వాలయ ాలక ు విరాళాలు ఇచ్చారు. దేవుడి సాక్షిగా ప్రమాణం చేశారు. అలా అని ఆమె పూర్తిగా ఆ సిద్ధాంతాన్ని విస్మరించలేదు. దీనితో ఆమె ద్వంద్వ వైఖరి పైనా ద్రవిడ భావజాల పార్టీలు విమర్శలు గుప్పించేవి. కానీ, ప్రజలను ఆకర్షించడమే ధ్యేయంగా పెట్టుకున్న జయలలిత అనేక జనాకర్షక పథకాలు రూపొందించి విజయవంతం అయ్యారు. కాలక్రమేణా ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో సిద్ధాంతాల కన్నా జనాకర్షణ మీదే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించవలసి ఉంటుంది. ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో దినకరన్ గెలుపునకు ఎన్ని కారణాలు ఉన్నా ప్రజల్లో దినకరన్‌పై సానుభూతి ఒకటి నెలకొందన్న విషయం అర్థమైంది. ఆ క్రమంలో నటుడిగా చరిష్మా ఉన్న కమల్ రాజకీయాల్లో సమతుల్యత పాటించాల్సి ఉంటుంది. అలా కాని పక్షంలో రాజకీయ చదరంగంలో మరో ఫెయిల్యూర్ స్టార్‌గా కమల్ మిగిలిపోవాల్సి వస్తుందన్న అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.



ఎంజీఆర్ తరహాలోనే కమల్ హాసన్ కూడా

తమిళనాడులో రాజకీయాలు, సినిమాలు అన్నదమ్ముల వంటివనే విషయం అందరికి తెలిసిందే. అందుకే సినిమా నటులు ఎక్కువగా రాజకీయాల్లోకి వచ్చి హిట్టవుతుంటారు. అలాంటి హిట్లను ఆశిస్తూ ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఎంజీ రామచంద్రన్ సినిమా రంగం నుంచి రాజకీయ రంగంలోకి వచ్చి ఇలాంటి వారికి ముందుగానే మార్గదర్శకం చేశారు. ఎంజీఆర్ రాజకీయాల్లో రాణించేందుకు ఆయన సినిమాల్లోని పాటలు ఆయనకు ఎక్కువగా ఉపయోగపడ్డాయి. ఎంజీఆర్‌ను సినిమాల్లో ఎక్కువగా నిలబెట్టింది ఎంఎస్ విశ్వనాథన్ సమకూర్చిన పాటలు కాగా, ఆ పాటలను రాసింది కన్నదాసన్, వాలీ. 1965లో వచ్చిన 'ఉంగల్ వీటు పిల్లయ్' సినిమాలోని 'నాన్ అనయిట్టల్ అతు నాదంతువిట్టాల్' (నేను ఏది ఆదేశిస్తే అది అవుతుంది) అన్న పాట అప్పట్లో ఉర్రూతలూగించింది. ఆయన డీఎంకే నుంచి విడిపోయి అన్నా ద్రావిడ మున్నేట్ర కళగం పార్టీని పెట్టినప్పుడు ఈ పాట పార్టీ గీతంగా ఊరు, వాడ మారుమోగిపోయింది. ఇప్పుడు ఆయన తరహాలోనే రాజకీయాల్లో రాణించేందుకు కమల్ హాసన్ తాను నటించిన సినిమాల్లోని, ముఖ్యంగా రాజకీయ సినిమాలు లేదా సినిమాల్లోని రాజకీయపరమైన పాటలను ప్రచారం కోసం వాడుకోవాలని చూస్తున్నారని తెలిసింది. ఎంజీఆర్‌కు ఎంఎస్ విశ్వనాథన్ సంగీత దర్శకుడిగా ఉన్నట్లుగా, కమల్ హాసన్‌కు కూడా ఇళయరాజా సమకూర్చిన పాటలే ఎక్కువగా ఉన్నాయన్న విషయం తెల్సిందే. నిజంగా చెప్పాలంటే ఆయన నటించిన చాలా సినిమాల్లో ఇళయరాజా సమకూర్చిన పాటలే ఆయనకు ప్రాణం పోశాయి. కమల్ హాసన్ గత బుధవారం తన కొత్త పార్టీని ప్రకటించినప్పుడు తమిళనాడులోని ఎనిమిది గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. తాను హీరోగా నటించిన దర్శకుడు కె. బాలచందర్ 1988లో తీసిన 'ఉణ్ణాళ్ ముడియం తంబీ' (నీవు సాధించగలవు, సోదరా!) చిత్రంలోనిదే ఆ ఐడియా. అదే సినిమాను బాలచందర్ అదే ఏడాది తెలుగులో చిరంజీవి హీరోగా 'రుద్రవీణ'గా తీశారు. మద్యం మత్తును వదిలించుకోవాలంటూ ఆ సినిమాలో టైటిల్ సాంగ్ సాగుతుంది. రాజకీయ నాయకులు మద్యాన్ని ప్రోత్సహించడాన్ని తూర్పార పడుతుంది. ఈ పాటను కూడా ఆయన తన ప్రచారానికి ఎక్కువ వాడుకుంటారని తెలిసింది. అలాగే సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో 1989లో వచ్చిన 'అపూర్వ సహోదరర్‌గళ్' (తెలుగులో అపూర్వ సహోదరులు) చిత్రంలోని అవినీతికి వ్యతిరేకంగా సాగే ఓ పాటను కూడా ప్రచారానికి వాడుకోవాలని చూస్తున్నారు. రాష్ట్రంలో తరతరాలుగా పెరుగుతూ వస్తున్న అవినీతిని అంతం చేయాల్సిన అవసరం కూడా తనను పార్టీని పెట్టేలా ప్రేరేపించిందని కూడా పార్టీ ఆవిర్భావ సభలో కమల్ హాసన్ ప్రకటించారు. ఇక 'దేవర్ మగన్' (తెలుగులో క్షత్రియ పుత్రుడు) చిత్రంలో శివాజీ గణేశన్‌తో కలసి ఆయన నటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న తేవర్ కులస్థుల దర్పానికి ప్రతిబింబంగా పేరు పొందిన ఈ సినిమాల్లోని పాటలను కూడా ఆయన ప్రచారానికి వాడుకుంటారనడంలో సందేహం లేదు.

ఉత్తర కొరియాకు ఊహించని షాక్

వాషింగ్టన్ : ఉత్తర కొరియాకు ఊహించని దెబ్బ తగిలింది. కొంత కాలంగా మౌనంగా ఉంటూ వస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన ప్రకటన చేశారు. ఉత్తర కొరియాపై పెద్ద ఎత్తున ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన నిపుణుల సంఘం భేటీలో ట్రంప్ ప్రసంగిస్తూ, 'ఈ రోజు నేను కీలక ప్రకటన చేస్తున్నా. ఉత్తర కొరియాపై ఎవరూ ఊహించని రీతిలో అమెరికా పెద్ద ఎత్తున ఆంక్షలు విధిస్తోంది' అని ప్రకటించారు. ఖజానా శాఖ ఈ మేరకు చర్యలు ప్రారంభించిందని ఆయన వెల్లడించారు. నౌకాయానానికి సంబంధించిన వాటితో పాటు మొత్తం 50 కంపెనీలపై ఆంక్షలు అమలు కానున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ కూతురు, వ్యక్తిగత సలహాదారు ఇవాంక ట్రంప్ కొరియా ప్రతినిధులతో భేటీ అయిన తరువాత ఈ ప్రకటన వెలువడడం విశేషం. క్షిపణి పరీక్షలతో కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌పై ఒత్తిడి పెంచేందుకే అమెరికా ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. తాజా ఆంక్షలు ఉత్తర కొరియా మిలిటరీ, అణు పరీక్షలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

సమయం లేకనే... : గంగూలీ



న్యూఢిల్లీ : రాష్ట్ర సంఘాల రాజ్యాంగాల్లో సవరణలు చేయడం, జస్టిస్ ఆర్ఎం లోధా కమిటీ సిఫార్సుల అమల్లో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ, సౌరాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు మధుకర్ వోరా బీసీసీఐకి తెలిపారు. పదమూడు సంఘాలు రాజ్యాంగ సవరణ గురించి నిర్ణయం తీసుకున్నాయని, ప్రమాణ పత్రాలు దాఖలు చేశాయని, మరి మీ సంగతేమిటని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి అన్ని రాష్ట్ర సంఘాలకు మెయిల్ పంపించారు. దీనికి గంగూలీ బదులిచ్చారు. కొన్ని నెలల క్రితం ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ బీసీసీఐ నిర్ణయంతో ఏకీభవించారు. బీసీసీఐ, రాష్ట్ర స్థాయిలో అమలు చేయడంలో ఉన్న ఇబ్బందుల గురించి గౌరవనీయ సుప్రీం కోర్టులో ప్రమాణ పత్రాలు దాఖలు చేస్తాం అని దాదా అన్నారు. గత సమావేశంలో సభ్యులంతా కలిసి ఒక నిర్ణయం తీసుకున్నారు. మరోసారి ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగితేనే మీరు పంపిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలం. గత వారమే మీ మెయిల్ వచ్చింది. ఇంతలోనే ఎస్‌జీఎంను ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకునేందుకు సమయం కుదరలేదు అని బీసీసీఐకి గంగూలీ సమాధానం ఇచ్చాడు.

కెప్టెన్ పేరును లైవ్‌లో ప్రకటించిన రాయల్స్

యాజమాన్యం మనస్సును గెలిచిన స్మిత్



న్యూఢిల్లీ : రెండేళ్ల నిషేధం తర్వాత ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో అడుగుపెడుతోన్న రెండు జట్లలో ఒకటి రాజస్థాన్ రాయల్స్. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ ఏడాది కోసం రాజస్థాన్ శనివారం నాటి వరకు తన జట్టుకు ఎవరు నాయకత్వం వహిస్తారో వెల్లడించలేదు. అయితే తాజాగా ఆ ఫ్రాంఛైజీ చేసిన ప్రకటన ప్రకారం స్టార్ స్పోర్ట్స్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తమ కెప్టెన్ పదవిలో కొనసాగే వ్యక్తి పేరును ప్రకటించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టును ఎంతో సమర్థవంతంగా ముందుకు నడుపిస్తోన్న స్టీవ్ స్మిత్. ఆ తర్వాత రహానె, బెన్ స్టోక్స్, జోస్ బట్లర్ పేర్లు చర్చకు వచ్చాయి. స్టోక్స్ గత ఏడాది రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌కు నాయకత్వం వహించాడు. జట్టును ఫైనల్స్‌కు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించాడు. అందుకే స్టోక్స్‌కే సారథ్య బాధ్యతలు వహించాలని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినప్పటికీ... ఆఖరుకు ఆ నలుగురిలో స్మిత్‌నే వరించింది రాయల్స్ కెప్టెన్ స్థానం. దీంతో ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్‌ను స్టీవ్ స్మిత్ ముందుండి నడిపించనున్నాడు. 2014, 15 సీజన్లలో స్మిత్ రాజస్థాన్ రాయల్స్ తరవున మ్యాచ్‌లు ఆడాడు.

ధోనీకి కూడా విశ్రాంతేనట!



ముంబయి : శ్రీలంకతో ముక్కోణపు టీ20 సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీకి కూడా విశ్రాంతి ఇవ్వనున్నట్లు సమాచారం. మార్చి 6న కొలంబోలో ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో ఆడే జట్టును ఎంపిక చేయడం కోసం ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ ఆదివారం సమావేశం కానుంది. త్వరలో ఐపీఎల్.. ఆ తర్వాత కీలక సిరీస్‌లు ఆడాల్సివున్న నేపథ్యంలో పేసర్లకు అవసరమైనంత విశ్రాంతి కల్పించాలని సెలక్టర్లు భావిస్తున్నారు. దీంతో మహేంద్ర సింగ్ ధోనీకి కూడా విశ్రాంతి కల్పించాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పేసర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతి ఇవ్వాలని చూస్తోంది. మరో పక్క సారథి విరాట్ కోహ్లీ విశ్రాంతి కోరితే.. అతన్ని సెలక్షన్‌లో పరిగణలోకి తీసుకోమని ఓ బీసీసీఐ అధికారి ఇప్పటికే వెల్లడించారు. సెలక్టర్లు ప్రకటించే 15మంది ఆటగాళ్ల జాబితాలో ఎవరి స్థానంలో ఎవరు చోటు దక్కించుకుంటారో తెలియాలంటే ఆదివారం వరకు వేచి ఉండాల్సిందే. భారత్-బంగ్లాదేశ్-శ్రీలంక మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ జరగనుంది. మార్చి 18న ఫైనల్ జరగనుంది.

సిగ్గుతో తల దించుకుంటున్నా : సెహ్వాగ్



న్యూఢిల్లీ : కేరళలో సంచలనం కలిగించిన ఆదివాసి మధు హత్య కేసుపై భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందించాడు. కేజీ బియ్యం దొంగతనం చేశాడని దాడిచేసిన ఉబైద్, అబ్దుల్ కరీం, హుస్సేన్‌లు మధు మరణానికి కారణం అయ్యారంటూ తన ట్విటర్ అకౌంట్‌లో రాసుకొచ్చాడు. ఇది ఆధునిక సమాజంలో జరిగిన అవమానకరమైన సంఘటనగా అభిప్రాయపడ్డాడు. ఈ ఘటనపై సిగ్గుతో తల దించుకుంటున్నానని సెహ్వాగ్ అన్నాడు. కేరళలో తినుబండారాలు దొంగిలించాడని ఒక 27 ఏళ్ల మతిస్థిమితం లేని ఆదివాసిని స్థానికులు దారుణంగా కొట్టి చంపిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై పలు మానవహక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

బెన్‌స్టోక్స్ పునరాగమనం



లండన్ : ఓ వ్యక్తిపై దాడి కేసులో విచారణ కారణంగా దాదావు ఆరు నెలల పాటు జట్టుకు దూరమైన ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ పునరాగమనం ఖాయమైంది. ఆదివారం నుంచి న్యూజిలాండ్‌తో ఆరంభమయ్యే ఐదు వన్డేల సిరీస్‌కు స్టోక్స్ సిద్ధమయ్యాడు. దీనిలో భాగంగా హామిల్టన్‌లో జరిగే తొలి వన్డేలో స్టోక్స్ ఆడే విషయాన్ని ఈసీబీ మేనేజ్‌మెంట్ ఖరారు చేసింది. ముందుగా ప్రకటించిన ఇంగ్లండ్ జాబితా ప్రకారం తొలి వన్డేకు స్టోక్స్‌ను ఎంపిక చేయలేదు. కేవలం స్వల్ప ప్రాక్టీస్‌కు మాత్రమే పరిమితమైన కారణంగా స్టోక్స్‌ను తొలి వన్డేకు ఎంపిక చేయలేదు. అయితే ఇంగ్లండ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ సూచన మేరకు స్టోక్స్‌ను తొలి వన్డేలో ఆడించాలని నిర్ణయించారు. దాంతో ఇంగ్లండ్ స్క్వాడ్‌లో స్టోక్స్ పేరును చేర్చారు.

భారత్ రికార్డు విజయం

- అర్ధసెంచరీతో చెలరేగిన మిథాలీరాజ్
- భారత బౌలింగ్‌కు సఫారీల విలవిల
- సఫారీ గడ్డపై సిరీస్ గెలిచిన తొలి మహిళా జట్టుగా రికార్డు



కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికా పర్యటనలో భారత మహిళా క్రికెట్ జట్టు రికార్డు సృష్టించింది. సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన ఆఖరిదైన ఐదవ టీ20 మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. అయిదు టీ20 సిరీస్‌ను 3-1 తేడాతో (ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది) గెలుచుకుంది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్, టీ20 సిరీస్‌లను సాధించిన మొదటి భారత మహిళా జట్టుగా నిలిచింది. శనివారం నాటి మ్యాచ్‌లో టాస్ కోల్పోవడంతో ప్రత్యర్థి కెప్టెన్ నిర్ణయం మేరకు తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఓపెనర్ మిథాలీ రాజ్ 62 పరుగులతో చెలరేగింది. 50 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో అద్భుతంగా ఆడింది. కాగా... మందాన మరోసారి నిరాశపరిచింది. తొలి వికెట్‌కు వీరిద్దరు 32 పరుగుల భాగస్వామ్యం అందించారు. 13 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద స్మృతి మందాన పెవీలియన్‌కు వెనుదిరిగింది. అనంతరం రంగంలోకి దిగిన రోడ్రిగస్ మిథాలితో కలిసి స్కోరుబోర్డును ముందుకు నడిపించింది. 34 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 44 పరుగులు చేసి భారత్‌ను సురక్షిత స్థానానికి చేర్చింది. చివరలో రెండు వికెట్లను స్వల్ప వ్యవధిలో చేజార్చుకోవడంతో 166 పరుగులు చేయగలిగింది. 167 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన దక్షిణాఫ్రికా ఏదశలోను భారత్‌కు పోటీ ఇవ్వలేకపోయింది. ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ డేన్ వాన్ నికెర్క్ సేన 18 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయింది. కాప్ 27 పరుగులు, ట్రైయాన్ 25 పరుగులతో రాణించగా మిగతా వారిని భారత బౌలర్లు తక్కువ పరుగులకే పెవీలియన్‌కు పంపించడంతో సఫారీల వైఫల్యం బట్టబయలైంది. భారత బౌలర్లలో శిఖా పాండే, థార్, గైక్వాడ్‌లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టారు. ఒక్కొక్కరు మూడు వికెట్లు తీసి దక్షిణాఫ్రికా వెన్ను విరిచి విజయంలో కీలక పాత్ర పోషించారు.

సఫారీల లక్ష్యం 173



- భారీ స్కోరు సాధించడంలో భారత్ విఫలం
- ఆదుకున్న శిఖర్ ధావన్, సురేష్‌రైనా
- 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 172
- నిలకడగా ఆడుతున్న సఫారీలు
- 12 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 79
- ఉత్కంఠగా సాగుతున్న ఆఖరి టీ20

కేప్‌టౌన్ : సిరీస్ ఫలితాన్ని తేల్చే ఆఖరు టీ20 ఉత్కంఠభరితంగా సాగుతోంది. కేప్‌టౌన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరుజట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ దక్షిణాఫ్రికాకు 173 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. సిరీస్ విజేతను నిర్ణయించే మ్యాచ్‌లో భారత్ భారీ అంచనాల దిశగా వెళ్లలేకపోయింది. పరుగులు సాధించడంలో ఓపెనర్ రోహిత్ శర్మ మరోసారి విఫలమవ్వగా... మిడిలార్డర్‌లో మనీష్ పాండే, ధోనీ, దినేష్ కార్తీక్‌లు సైతం చేతులెత్తేశారు. చివరకు టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన సురేష్‌రైనా, శిఖర్ ధావన్ చేసిన 40 ప్లస్ స్కోరే భారత్‌ను ఆదుకుంది. అంతకు ముందు టాస్ కోల్పోవడంతో ప్రత్యర్థి జట్టు కెప్టెన్ జె.పీ. డమినీ నిర్ణయం మరకు ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ రోహిత్ (11; 8బంతుల్లో 2 ఫోర్లు) ను జూనియర్ డాలా తొందరగానే పెవిలియన్‌కు పంపాడు. తర్వాత వచ్చిన రైనా (43; 27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) సహకారంతో శిఖర్‌ధావన్ (47; 40 బంతుల్లో 3 ఫోర్లు 4 సిక్స్‌లు) ఇన్నింగ్స్‌ను చక్కబెట్టాడు. వీరిద్దరు నిలకడగా ఆడడంతో భారత పరువు దక్కించుకుంది. ఓ క్రమంలో 100 పరుగుల స్కోరుకూడా దాటే పరిస్థితి కనిపించలేదు. వీరి నిష్క్రమణ అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన బ్యాట్స్‌మెన్లు ఒకరి తర్వాత ఒకరు వరుసగా విఫలమయ్యారు. దీంతో భారత్ 7 వికెట్లు కోల్పోయి 172 పరుగులు మాత్రమే చేయగల్గింది. భారత్ బ్యాట్స్‌మెన్లలో మనీష్ పాండే (13), హార్దిక్ పాండ్య (21), ధోని (12), దినేశ్ కార్తీక్ (13), అక్షర్‌పటేల్ (1 నాటౌట్), భువనేశ్వర్‌కుమార్ (3 నాటౌట్) పరుగులు మాత్రమే చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో డాలా 3, మోరిస్ 2, షంసీ 1 వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా ఆదిలోనే ఓ వికెట్ కోల్పోయినప్పటికీ మడిలార్డర్‌లో కెప్టెన్ డుమినీ నిలకడగా ఆడుతూ... ఇన్నింగ్స్‌ను చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. కడపటి వార్తలు అందే సమయానికి సౌతాఫ్రికా 3 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. సౌతాఫ్రికా విజయానికి మరో 28 బంతుల్లో 70 పరుగులు చేయాల్సి ఉంది.

పుజారాకు తండ్రిగా ప్రమోషన్



హైదరాబాద్ : టీమిండియా నయావాల్ ఛెతేశ్వర్ పుజారా ఇకపై సరికొత్త పాత్ర పోషించనున్నాడు. అంటే ఫీల్డర్‌గా, బౌలర్‌గా, బ్యాట్స్‌మన్‌గా కాదు! ఒక బిడ్డకు తండ్రిగా. అవును..! పుజారా తండ్రయ్యాడు. అతడి సతీమణి పూజ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంతోష సందర్భాన్ని ట్విటర్ వేదికగా అందరితో పంచుకున్నాడు పుజారా. పాప, భార్యతో కలిసి దిగిన చిత్రాన్ని ఉంచాడు. దాంతో పాటు ఓ అందమైన వ్యాఖ్య పెట్టాడు. చిన్నారికి స్వాగతం. మా జీవితంలో కొత్త పాత్రలు పోషించేందుకు మేం చాలా ఆత్రుతగా అత్యంత ఆనందంగా ఉన్నాం. మా కోరిక నెరవేరింది. ఈమె (చిన్నారి) మా జీవితంలోకి ప్రవేశించింది అని పుజారా ఒక ఆత్మీయ వ్యాఖ్య పెట్టాడు. 2018 ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోని పుజారా ప్రస్తుతం తన దేశవాళీ జట్టు సౌరాష్ట్ర తరఫున విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. పుజారా జనవరి 1నే ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక చిత్రాన్ని ఉంచి తాము త్వరలో తల్లిదండ్రులం కాబోతున్నామని ముందుగానే సూచించాడు. ఈ ఏడాది తాము ఒక బుజ్జిపాపను కోరుకుంటున్నామని అందులో చెప్పాడు. ఐపీఎల్ సమయంలో ఖాళీగా ఉండకుండా పుజారా యార్క్‌షైర్ తరఫున ఇంగ్లాండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడేందుకు వెళ్లనున్నాడు. త్వరలో ఇంగ్లిష్ గడ్డపై టీమిండియా రెండు నెలల సుదీర్ఘ పర్యటనకు వెళ్లనుంది. పుజారా దంపతులు తల్లిదండ్రులైన సందర్భంగా మిత్రులు, అభిమానులు అభినందనలు తెలిజేశారు.

జిమ్నాస్టిక్స్‌లో చరిత్ర సృష్టించిన

తెలుగమ్మాయి

కాంస్య పతకం కైవసం చేసుకున్న అరుణరెడ్డి



మెల్‌బోర్న్ : జిమ్నాస్టిక్స్.. రెండేళ్ల క్రితం వరకు ఈ పేరు పెద్దగా పరిచయంలేనిద ఆట. 2016లో జరిగిన రియో ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున ఈ పోటీల్లో పాల్గొంది దీపా కర్మాకర్. ఫైనల్లో త్రూఎటిలో పతకాన్ని కోల్పోయిన దీప దేశానికే ఈ క్రీడను మరో సారి పరిచయం చేసింది. సుమారు 52 ఏళ్ల తర్వాత జిమ్నాస్టిక్స్ విభాగంలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన మహిళగా రికార్డు సృష్టించింది. ఇప్పుడు ఇదంతా ఎందుకు అని అనుకుంటున్నారా!. తాజాగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో భారత్‌కు చెందిన అరుణ బి.రెడ్డి కాంస్య పతకం గెలిచింది. మహిళల వాల్ట్స్ విభాగంలో నిర్వహించిన పోటీలో అరుణ రెండుసార్లు పోటీపడి 13.649 సగటుతో మూడో స్థానంలో నిలిచింది. స్లొనియాకు చెందిన జస కిస్లెఫ్ (13.800) స్వర్ణం గెలుచుకోగా, ఆస్ట్రేలియాకు చెందిన ఎమిలి వైట్‌హెడ్ (13.699) రజతం దక్కించుకుంది. ఇదే ఈవెంట్లో మరో భారత అమ్మాయి ప్రణతి నాయక్ (13.416) ఆరో స్థానంలో నిలిచారు. జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో భారత్ తరఫున పతకం గెలిచిన తొలి మహిళగా 22 ఏళ్ల అరుణ చరిత్ర సృష్టించింది. అరుణ హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి. కరాటేలో అరుణ బ్లాక్ మెడల్ సాధించారు. అంతేకాదు గతంలో ఆమె కరాటే శిక్షకురాలిగా కూడా పనిచేశారు. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో అరుణ అర్హత పోటీల్లో 14వ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఆసియా గేమ్స్‌లో తొమ్మిదో స్థానంలో నిలిచిన మన తెలుగమ్మాయి.. 2017 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది.



అప్పుడు చురకలు.. ఇప్పుడు విషెస్!

- మ్యాచ్ ఫిక్సర్‌కు స్టార్ క్రికెటర్ విషెస్
- ట్వీటర్ వార్‌కు తెరదించిన అశ్విన్

న్యూఢిల్లీ : ఇటీవల ఏదో జోక్ చేయబోయి టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేతికి చిక్కి, దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ హార్షల్ గిబ్స్ నోరు కరుచుకున్న విషయం తెలిసిందే. కానీ వారం కూడా గడవకముందే వీరి మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడం, పరిస్థితుల్లో ఎంతో మార్పు రావడంతో క్రికెట్ అభిమానులు ఇది నమ్మలేకపోతున్నారు. నేడు గిబ్స్ జన్మదినం సందర్భంగా భారత బౌలర్ అశ్విన్ సఫారీ మాజీ ఆటగాడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. 'మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలి గిబ్స్. ఈ ఏడాది నీకు కలిసిరావాలంటూ' అశ్విన్ ట్వీట్ చేశాడు. అందుకు ధన్యవాదాలు తెలుపుతూ గిబ్స్ ట్వీట్ ద్వారా బదులిచ్చాడు. మ్యాచ్ ఫిక్సర్‌ను సైతం తమ క్రికెటర్ క్షమించి శుభాకాంక్షలు తెలిపాడని టీమిండియా క్రికెట్ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. గిబ్స్ ఫిక్సర్ అని తెలియక కొందరు అశ్విన్‌కు వ్యతిరేకంగా ట్వీట్లు చేస్తున్నారు. తన కొత్త షూ ప్రత్యేకతలు, పరుగెత్తడంలో ఉండే సౌకర్యం గురించి చెబుతూ అశ్విన్ ఒక షూ వీడియో ట్వీట్ చేశాడు. వికెట్ల మధ్య, అవుట్ ఫీల్డ్‌లో అశ్విన్ చురుగ్గా పరుగెత్తలేడనే అంశాన్ని గుర్తు చేసే విధంగా ఇకనైనా నువ్వు మరింత వేగంగా పరుగెత్తగలవని ఆశిస్తున్నా అంటూ ఒకింత వ్యంగ్యంతో గిబ్స్ వ్యాఖ్య వదిలాడు. అయితే దీనిపై వెంటనే స్పందించిన అశ్విన్.. నాకు తిండి పెట్టే మ్యాచ్‌లను ఫిక్స్ చేయకూడదనే నైతిక విలువలు పాటించడంలో మాత్రం చాలా అదృష్టవంతుడిని అని ఘాటుగా జవాబిచ్చాడు. దాంతో షాక్‌కు గురైన గిబ్స్... జోక్ చేశానని, దీన్ని ఇంతటితో వదిలేయమన్నాడు. తాను కూడా జోక్ చేశానని, నీతో కలసి డిన్నర్ చేస్తానని ట్వీట్ చేశాడు. 2000 ఏడాది భారత పర్యటనలో భాగంగా మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో గిబ్స్ దోషిగా తేలి దాదాపు ఏడాదిపాటు నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. తనకు 15000 డాలర్ల ఆఫర్ వచ్చిందని గిబ్స్ తన తప్పు ఒప్పుకున్న విషయం తెలిసిందే.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO 8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.